

ప్లే-ఆఫ్స్ నుంచి విదేశీ ఆటగాళ్లు కష్టమే

- 25 తర్వాత వచ్చేయండి: దక్షిణాఫ్రికా బోర్డు షరతు

8

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 281 | విజయవాడ, గురువారం 15 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 15 May 2025 | Rs



52వ సిజెఐగా జస్టిస్ బిఆర్ గవాయ్

- ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రెండో దళిత ప్రధాన న్యాయమూర్తిగా అవకాశం

7

సబ్సిడీ విత్తనాల్లో జాప్యం

- మొదలే లేని వేరుశనగ సేకరణ
- తతిమ్మా సీడ్ కూడా అంతే
- ఫైనల్ కాని టెండర్లు
- తరుముకొస్తున్న ఖరీఫ్
- ముందే వర్షాలొస్తాయన్న సంకేతాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేయ దలిచిన విత్తనాల సేకరణలో తీవ్ర జాప్యం నెలకొంది. మరో రెండు మూడు వారాల్లో సీజన్ ప్రారంభమవుతుండగా ఇప్పటి వరకు విత్తనాల సేకరణకు వ్యవసాయ, ఎపి సీడ్స్ విభాగాలు ముందస్తు కార్యాచరణ మొదలు పెట్టలేదు. కేవలం ప్లాన్, జిల్లాల వారీ కేటాయింపులతో కాలక్షేపం చేస్తున్నాయి. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే విత్తనాల్లో వేరుశనగ అత్యధికంకాగా నేటికీ ఆ విత్తనాల సేకరణ ప్రక్రియ అడుగు ముందుకు పడలేదు. ఎంత మొత్తంలో సేకరించాలి, ఒక్కో రైతుకు ఎంత పరిమాణంలో ఇవ్వాలి, కిలోకు సేకరణ ధర, సబ్సిడీ భాగం, సబ్సిడీ పోను రైతులు చెల్లించాల్సిన నాన్ సబ్సిడీ అమౌంట్, ఫైనల్‌గా అమ్మకపు ధర.. ఇవేమీ ఖరారు కాలేదు. ధరలు ఖరారు కానందున టెండర్లు సైతం ఫైనల్ కాలేదు. దాంతో వేరుశనగ సాగయ్యే రాయలసీమ జిల్లాల్లో రాయితీ విత్తనాల పంపిణీపై సర్వత్రా అయోమయం నెలకొంది. సాధారణ రోజుల్లోనే రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ మే రెండు మూడు వారాల్లో మొదలవుతుంది. అప్పటికి అన్నీ ముగించి రాయితీ విత్తనాలు కావాల్సిన రైతుల పేర్లతో ముందస్తు రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. రైతులు ఇబ్బందులు పడకుండా మరింత ముందుగా విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం మే మూడోవారానికి కూడా సేకరణ ప్రారంభించక పోవడంపై రైతుల్లో ఆందోళన మొదలైంది.



తొలి సీజన్‌లోనే..

నిరుడు సాధారణ ఎన్నికల దృష్ట్యా కోడ్ ఉన్నప్పటికీ విత్తనాల పంపిణీ మే 24న అనంతపురం, 29న శ్రీసత్యసాయి జిల్లాలో లాంఛనంగానైనా ప్రారంభించారు. అప్పుడు ఎన్నికల కమిషన్ అనుమతులు కావాల్సి వచ్చింది. నిరుడు కరువు వలన వేరుశనగ సగమే సాగైంది. వేసిన పంట చేతికి రాలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక ఇదే తొలి ఖరీఫ్. మొదటి సీజన్‌లోనే విత్తనాల సేకరణలో జాప్యం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారంనాటి సమీక్షలో కేవలం ఉద్యాన పంటల సాగుపైనే ఫోకస్ పెట్టారు తప్ప తరుముకొస్తున్న ఖరీఫ్‌నకు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించలేదని సమాచారం. దాంతో వ్యవసాయశాఖ, ఎపి సీడ్స్ వేరుశనగతో పాటు ఇతర రాయితీ విత్తనాల సేకరణపై నాన్చుడు ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమాలకు ఆస్కారం

చివరి నిమిషంలో విత్తనాలు సేకరిస్తుండటంతో సేకరణ ధర పెంపు, అమ్మకపు ధర పెంపు చేస్తున్నారు. ప్రభుత్వం ఒక మేరకే సీలింగ్ విధించి సబ్సిడీ ఇస్తుండటంతో రైతులపై అదనపు భారం పడుతోంది. మరోవైపు చివరాఖరులో నాణ్యతలేని, నాసిరకం విత్తనాలను హడావుడిగా రైతులకు అంటగట్టడం జరుగుతోంది. అదనపు భారంతో పాటు నాణ్యతలేని విత్తనాలతో దిగుబడులు తగ్గి, మొత్తానికే మొలకెత్తక రైతులు నష్టపోతున్నారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు, ఈ వ్యవహారాన్నంతా పర్యవేక్షించే ఉన్నతస్థాయి వ్యక్తులు అయాచితంగా లాభ పడుతున్నారు. ఇదే అదనుగా అవినీతి కిందికంతా పాకింది. ఈ తంతు కొన్నేళ్లుగా సాగుతోంది. వేరుశనగలో మరీ ఎక్కువ.

తగ్గుతున్న సాగు

వర్షాభావం, లేదంటే అకాల, అధిక వర్షాలు, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేమి, వాణిజ్య పంటల విస్తరణ.. ఇత్యాది కారణాల వలన రాయలసీమలో సంప్రదాయ పంట వేరుశనగ సాగు అంతకంతకూ తగ్గుతోంది. ఒకప్పుడు సాధారణ సాగు 20 లక్షల ఎకరాల వరకు ఉన్నది కాస్తా ఇప్పుడు 14 లక్షల ఎకరాలకు పడిపోయింది. ఆ మాత్రం సైతం సాగు కావట్లేదు. నిరుడు ఖరీఫ్‌లో 7.2 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ముందటేడు 6.37 లక్షల ఎకరాల్లో వేశారు. కాగా ఈ ఏడాది 2.95 లక్షల క్వింటాళ్ల విత్తనాల సేకరణకు ప్రాథమికంగా ప్లాన్ రూపొందించారు. అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లాకు 97,500 క్వింటాళ్లు, అనంతపురానికి 76,137 క్వింటాళ్లను కేటాయించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు రేషన్‌కార్డులు

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

2

కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించడం

అభ్యంతరకరం

- పహల్గాంలో దాడి, ఆపరేషన్ సిందూర్‌పై వాస్తవాలు వివరించాలి
- పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరపాలి
- జాతీయస్థాయి వరకే ఇండియా బ్లాక్
- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి
- మావోయిస్టులతో చర్చలు జరపాలి : బివి రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ బేబీ. చిత్రంలో బివి రాఘవులు, ఎ విజయరాఘవన్, జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్ - పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణను ఇరు దేశాల కంటే ముందుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా బుధవారం హైదరాబాద్ వచ్చిన ఎంఎ బేబికి సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఎంబి భవన్‌లో జరిగిన సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో కలిసి ఎంఎ బేబి మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ప్రకటనకు విరుద్ధంగా భారత్ పాక్‌ల విషయంలో తాము మధ్యవర్తిత్వం చేయబోమని అమెరికా ఉపాధ్యక్షుడు డేవిడ్ వాన్స్ చెప్పారని, ఇది మరింత అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి, ఆపరేషన్ సిందూర్‌పై దేశ ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను జరపాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ అఖిల భారత మహాసభలో రాజకీయ, సంస్థాగత లక్ష్యాలను నిర్దేశించుకున్నామని, వాటికి అనుగుణంగా వామపక్ష, ప్రజాతంత్ర పార్టీలు, సామాజిక శక్తులను ఐక్యం చేసి ముందుకెళ్తున్నామని చెప్పారు. పార్టీ సొంత బలం పెంచుకోవడంపై దృష్టి సారించామన్నారు.. గతనెల 22న పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను కాపాడే ప్రయత్నంలో ఓ కాశ్మీరీ కూడా బలయ్యాడని అన్నారు. ఉగ్రవాదుల దాడిని దేశం, ప్రజలు, రాజకీయ పార్టీలన్నీ ఖండించాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశాయన్నారు. ఉగ్రవాదులను అణచివేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన త్రివిధ దళాలు ఉగ్రవాదుల శిక్షణా కేంద్రాలపై దాడి చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ దాడి తరువాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని ప్రకటించడం, ఆ సమావేశంలోనే సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ చెప్పిన విషయాలను బేబి వివరించారు. అనంతరం జరిగిన పరిణామాల్లో కాల్పుల విరమణ ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం అభ్యంతరకరమని అన్నారు. ఇలాంటి అనేక విషయాలపై ప్రజలకు వాస్తవాలు తెలియాలంటే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మతకలహాలు రెచ్చగొట్టేలా సైబర్ దాడి

ఎలక్ట్రానిక్ మీడియా టిఆర్‌పి పోటీ ప్రపంచంలో ఉందని ఎంఎ బేబీ అన్నారు. ఇండియా-పాకిస్తాన్ కాల్పుల సమయంలో మతకలహాలు రెచ్చగొట్టేలా కొన్ని మీడియా సంస్థలు వ్యవహరించాయని విమర్శించారు. ప్రజలంతా ఐక్యంగా ఉండాల్సిన సమయంలో ఇలాంటివి ప్రసారం చేయడం సరైంది కాదన్నారు. కేరళకు చెందిన ఉగ్రదాడి బాధితుడు మిగతా 7లో

కల్నల్ ఖురేషీపై బిజెపి మంత్రి అనుచిత వ్యాఖ్యలు

- నాలుగు గంటల్లో ఎఫ్ఐఆర్ నమోదుకు హైకోర్టు ఆదేశం
- పదవి నుంచి తప్పించాలని ప్రతిపక్షాల డిమాండ్



భోపాల్ : ఆపరేషన్ సిందూర్‌లో కీలకంగా వ్యవహరించిన ఇండియన్ ఆర్మీకి చెందిన మహిళా అధికారి కల్నల్ సోఫియా ఖురేషీని అప్రతిష్టపాలు చేసేలా 'ఉగ్రవాదుల సోదరి' అంటూ మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి, బిజెపి సీనియర్ నేత విజయ్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు మధ్యప్రదేశ్ న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. కల్నల్ సోఫియా ఖురేషిపై వ్యాఖ్యలు చేసిన మంత్రి విజయ్ షాపై నాలుగు గంటల్లోనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మధ్యప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. ఈ విషయాన్ని తమకు తాముగా పరిగణనలోకి తీసుకున్న కోర్టు తీవ్రమైన క్రిమినల్ అభియోగాల కింద కేసు నమోదు చేయాలని డిజిపి కైలాష్ మక్వానాను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విజయ్ షాపై చర్యలు తీసుకునే అంశాన్ని యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

పాక్ ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి పాత్రికేయులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించిన అధికారులలో సైనిక దళానికి చెందిన కల్నల్ సోఫియా ఖురేషీ ఒకరు. మంత్రి విజయ్ షా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ హిందువులపై అమానుష హత్యాకాండకు ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ 'ఉగ్రవాదుల మతానికి చెందిన ఓ సోదరి'ని పంపారని వ్యాఖ్యానించారు. 'ఉగ్రవాదులు హిందువులను చంపేశారు. దీనికి స్పందించిన ప్రధాని మోడీ వారి (ఉగ్రవాదు లు) సోదరిని సైనిక విమానంలో పంపి ఇళ్లలో ఉండగా దాడి చేయించారు. వాళ్లు మన సోదరీమణులను వితంతువులుగా మార్చారు. అందువల్ల మోడీ వారి మతానికి చెందిన సోదరిని వారికి గుణపాఠం చెప్పేందుకు పంపారు' అని విజయ్ షా అన్నారు. తీవ్రమైన విమర్శలు, ఖండనలు వెల్లువెత్తడంతో ఆయన క్షమాపణలు చెప్పారు.

తక్షణం మంత్రిని పదవి నుంచి తొలగించాలి : సిపిఎం డిమాండ్

విజయ్ షా ఒక సీనియర్ సైనికాధికారిని అప్రదిష్టపాలు చేసేలా అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. విజయ్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని సిపిఎం డిమాండ్ చేసింది. జబల్‌పూర్ హైకోర్టు ఆదేశాలను స్వాగతించింది. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో పోస్టు చేసింది. మంత్రిపై తక్షణం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేసింది. ఇటువంటి వ్యాఖ్యలకు బిజెపి సిగ్గుపడాలని పేర్కొంది. విద్వేష వ్యాఖ్యలు చేసేవారిని రక్షించే చర్యలకు ఇకనైనా స్వస్తిపలకాలని బిజెపిని డిమాండ్ చేసింది.


మధ్యప్రదేశ్ క్యాబినెట్ నుండి విజయ్‌ను వెంటనే తప్పించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి ఖార్జునఖర్గే డిమాండ్ చేశారు. బాధ్యతా యుతమైన స్థానాల్లోవున్న కొంతమంది మహిళలపై కొందరు వ్యక్తులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జాతీయ మహిళా కమిషన్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నాయి.

కల్నల్ సోఫియాపై తప్పుడు పోస్ట్, తొలగించిన అధికారులు

ఇదిలావుండగా ఆర్ఎస్ఎస్ మద్దతుదారులు కల్నల్ సోషియా కుటుంబ నివాసంపై దాడి చేశారంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పెట్టిన ఓ పోస్ట్ వైరల్ అయింది. పోలీసులు ఆ పోస్టును తొలగించాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఆ పోస్టును తొలగించారు. 'అనిస్ ఉద్దిన్' పేరిట కెనడాలోని బ్రిటిష్ కొలంబియాలో ఈ పోస్ట్ పెట్టినట్లు గుర్తించారు. ఈ ఘటన నేపథ్యంలో కల్నల్ సోఫియా నివాసం వద్ద పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణలో గూండాగిరి

- ప్రజాసంఘాల నాయకులను ఈడ్చుకెళ్లిన వైనం
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షునిపై దాడి
- టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమలో రసాయనాల ఉత్పత్తి పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ అపహాస్యం
- పోలీసుల ప్రేక్షక పాత్ర



ప్రజాభిప్రాయసేకరణలో ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్ రాధాకృష్ణ

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి/క్రైం

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ తండ్రి, రాజ్యసభ మాజీ సభ్యులు, బిజెపి నేత టిజి వెంకటేష్‌కు చెందిన టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమలో రసాయనాల ఉత్పత్తి పెంపు కోసం బుధవారం ఆ పరిశ్రమ ఆవరణంలో నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రయివేటు గూండాల పర్యవేక్షణలో జరిగింది. అభిప్రాయాలను తెలిపేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులను దౌర్జన్యంగా బయటకు ఈడ్చివేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిపై దాడి చేశారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభంలోనే కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, సిఐటియు నగర అధ్యక్షులు నరసింహులు, సిఐటియు నాయకులు హుసేన్ వలీని ఫ్యాక్టరీ యాజమాన్యం ఏర్పాటు చేసిన ప్రైవేట్ గూండాలు టిజి వెంకటేష్ దగ్గరికి లాక్కెళ్లారు. అనంతరం వారిని బయటకు ఈడ్చివేశారు. ప్రజాభిప్రాయ సేకరణ మధ్యలో తమ అభిప్రాయాన్ని అర్జీ రూపంలో ఇవ్వడానికి వెళ్తున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు హుసేన్ బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.అబ్దుల్లాపైనా గూండాలు దౌర్జన్యం చేశారు. వారినీ బయటకు లాక్కెళ్లి పడేశారు. రాఘవేంద్రను విచక్షణ రహితంగా బూతులు తిడుతూ గొంతు మీద కాలేసి తొక్కుతూ దాడి చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్‌ను కూడా గూండాలు అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. అయినా, వారు వేదికపైకి వెళ్లి రసాయన ఉత్పత్తుల పెంపును వ్యతిరేకిస్తూ వినతిపత్రం ఇచ్చారు. తాండ్రపాడు సర్పంచ్ బాలపీరా, సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్యలను కూడా గూండాలు బయటకు లాక్కెళ్లి బెదిరించారు. వీరిని ఎవరినీ తమ అభిప్రాయం చెప్పనివ్వలేదు. ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులును అభిప్రాయం చెప్పనీయకుండా అడ్డుకోవడంతో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి వెనుదిరిగారు.

మీడియాపైనా ఆంక్షలు

అక్కడి తతంగంపై వీడియో తీసిన ఓ మీడియా ప్రతినిధిని గూండాలు బెదిరించి ఫోన్ లాక్కుని ఫొటోలు, వీడియోలను మిగతా 7లో

చైనా, టర్కీ మీడియా సంస్థల ఎక్స్ ఖాతాల నిలిపివేత

న్యూఢిల్లీ : చైనా, టర్కీ మీడియా సంస్థల ఎక్స్ ఖాతాలను భారత్ నిలిపివేసింది. చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్, జిన్హువా న్యూస్ ఎక్స్ ఖాతాలను, టర్కీ ప్రభుత్వ వార్తా సంస్థ టిఆర్‌టి ఎక్స్ ఖాతాను బుధవారం కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బూటకపు, తప్పుడు సమాచారం వ్యాప్తిని నివారించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ అంశంపై వివరణ కోరగా ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి మంత్రిత్వ శాఖ స్పందించలేదు. గ్లోబల్ టైమ్స్, జిన్హువా న్యూస్ ఎక్స్ ఖాతాలను తెరిచినపుడు "ఖాతా నిలిపివేయబడింది" అనే మెసేజ్ స్క్రీన్‌పై కనిపిస్తోంది. పాకిస్తాన్‌కు మద్దతునిస్తూ టర్కీ ప్రధాని ఎర్డోగాన్ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు సందేశం పంపిన వెంటనే టిఆర్‌టిని బ్లాక్ చేశారు. నిజమైన స్నేహానికి అత్యుత్తమమైన ఉదాహరణ టర్కీ - పాకిస్తాన్ సంబంధాలేనని ఆ సందేశంలో ఎర్డోగాన్ పేర్కొన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపైనే భారత్ పోరాటం సాగుతోందని, కానీ ఎర్డోగాన్ ఉగ్రవాదంపై పూర్తిగా మౌనం పాటిస్తున్నారని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

వీలైనంత త్వరగా సంక్షేమ క్యాలెండర్

- ఏడాదిలోపు జిల్లా పార్టీ కార్యాలయాల నిర్మాణం
- కడపలో మూడు రోజుల పాటు మహానాడు
- టిడిపి పొలిట్‌బ్యూరోలో నిర్ణయం



పొలిట్‌బ్యూరో సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్షేమ పథకాల అమలుకు క్యాలెండర్‌ను విడుదల చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించారు. టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఎన్‌టిఆర్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఒక్కొక్క నెలలో ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయడానికి వీలుగా క్యాలెండర్‌ను రూపొందించాలని నిర్ణయించారు. సమావేశం ప్రారంభం కాగానే పహల్గాంలో 27 యాత్రికులపై జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించడంతో పాటు మృతులకు సంతాపం తెలుపుతూ ఒక్క నిమిషం మౌనం పాటించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రి కె అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు కాల్వ శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. గ్యాస్ సిలిండర్ లబ్ధిదారులకు ముందుగానే నగదును వారి ఖాతాల్లోకి వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అన్ని జిల్లాల్లోనూ టిడిపి కార్యాలయాలను ఏడాదిలోపు నిర్మించాలని తీర్మానించామని చెప్పారు. దీనికోసం కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పార్టీ కార్యాలయాల నిర్మాణాల కోసం రాష్ట్రా, జిల్లా స్థాయిలలో త్రిసభ్య కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర అధ్యక్షులు, జిల్లాల్లో ఆయా జిలాల్ల మంత్రులుఈ కమిటీకి నాయకత్వం వహిస్తారని చెప్పారు. ఈ నెల 27,28,29 తేదీల్లో తొలిసారి కడపలో నిర్వహించనున్న మహానాడు ప్రతిష్టాత్మకంగా జరపనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కడప ప్రజలు పార్టీని బాగా ఆదరించారని, ఈ కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేయాలని కోరారు.సికె దిన్నె మండలంలో జరిగే ఈ కార్యక్రమంలో రెండు రోజులు తీర్మానాలు, మూడో రోజు బహిరంగ సభ ఉంటుందని వెల్లడించారు. రాయలసీమ వెనుకబాటు తనానికి శాశ్వతమైన పరిష్కార మార్గాలు కనుగొనడానికి మహానాడు వేదిక కాబోతుందన్నారు. తీర్మానాలు, జరిగే చర్చల్లో 60శాతం రాయలసీమకు సంబంధించిన అంశాలను చర్చించబోతున్నామని తెలిపారు.

తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఉన్న యానాదులకు రేషన్, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, అన్ని సంక్షేమ పథకాలు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. 2014-19 హయాంలో నీరు-చెట్టు పనులు చేసిన పార్టీ కార్యకర్తలకు గత ప్రభుత్వం మిగతా 7లో



పాలిసెట్‌లో బాలికలదే హవా

- మొత్తం 95.36 శాతం ఉత్తీర్ణత

7

9 రకాల బడులు

- గత ప్రభుత్వ విధానాలే కొనసాగింపు
- 117 జిఓకు ప్రత్యామ్నాయం పేరుతో ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇక నుంచి 9 రకాల పాఠశాలలు ఉండనున్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలకు కొనసాగింపుగా ఈ విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం గతంలో ఉన్న ఆరు రకాల పాఠశాలలకు బదులు తొమ్మిది రకాల పాఠశాలల విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలను నాలుగు రకాలు చొప్పున ఏర్పాటు చేయనుంది. వీటితోపాటు ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించనుంది.

ప్రాథమిక పాఠశాలలు ఇలా..

గత ప్రభుత్వం ప్రాథమిక వ్యవస్థలో శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ పేరుతో మూడు రకాల పాఠశాలలను తీసుకొస్తే కూటమి ప్రభుత్వం అదనంగా మరో పాఠశాలను చేర్చింది. శాటిలైట్ ఫౌండేషనల్ స్కూళ్ల నిర్వహణ బాధ్యతను స్త్రీ, శిశు సంక్షేమశాఖకు అప్పగించింది. ఫౌండేషనల్ స్కూళ్లను అలానే కొనసాగించింది. ఫౌండేషనల్ స్కూల్ ప్లస్ పేరును బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మార్చింది. కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రవేశపెట్టింది. 1 నుంచి 8 తరగతుల వరకు ఉండే ప్రాథమికోన్నత పాఠశాలను అలానే కొనసాగించింది. రేషనలైజేషన్‌లో భాగంగా 4,706 మంది సబ్జెక్టు టీచర్లు మిగులుగా ప్రభుత్వం తేల్చింది. వీరిలో 4,690 మందిని మోడల్ ప్రైమరీకి ప్రధానోపాధ్యాయులుగా నియమించనుంది. మిగిలిన వారిని అవసరం ఉన్నచోట సబ్జెక్టు టీచర్లుగా సర్దుబాటు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

పాత విధానం	కొత్త విధానం
1.శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ (పిపి1, పిపి2)	1.శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ (పిపి1, పిపి2)
2.ఫౌండేషన్ స్కూల్ (పిపిఎ, పిపి2, 1, 2 తరగతులు)	2.ఫౌండేషన్ స్కూల్ (పిపిఎ, పిపి2, 1, 2 తరగతులు)
3. ఫౌండేషన్ ప్లస్ స్కూల్ (పిపి1, పిపి2, 1 నుంచి 5వ తరగతి)	3.బేసిక్ ప్రైమరీ స్కూల్ (పిపి1, పిపి2, 1 నుంచి 5వ తరగతి)
4.ప్రీ హైస్కూల్ (3 నుంచి 8వ తరగతి వరకు)	4.మోడల్ ప్రైమరీ స్కూల్ (పిపి1, పిపి2 ,1 నుంచి 5వ తరగతి)
5.హైస్కూల్ (3 నుంచి 10వ తరగతి వరకు)	5.అప్పర్ ప్రైమరీ స్కూల్ (పిపి1, పిపి2 ,6 నుంచి 8వ తరగతి వరకు)
6. హైస్కూల్ ప్లస్ (3 నుంచి 12వ తరగతి వరకు)	6.హైస్కూల్ (6 నుంచి 10వ తరగతి వరకు)
	7.హైస్కూల్ :(1 నుంచి 10వ తరగతి వరకు)
	8.హైస్కూల్ ప్లస్:(6 నుంచి12 వరకు)
	9.హైస్కూల్ ప్లస్:(1 నుంచి 12 వరకు)

4 రకాల ఉన్నత పాఠశాలలు

ప్రాథమిక విద్యా వ్యవస్థతో పాటు ఉన్నత విద్యా వ్యవస్థలో 4 రకాల పాఠశాలలను తీసుకొచ్చింది. 6 నుంచి 10వ తరగతి ఉండే ఉన్నత పాఠశాలలను అలానే కొనసాగించింది. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను తరలించిన ఉన్నత పాఠశాలల్లో 1, 2 తరగతులను కూడా కలపనుంది. అదేవిధంగా 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న కొన్ని ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులను తీసుకురానుంది. ఈ పాఠశాలల్లోనే మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయనుంది. హైస్కూల్ ప్లస్‌లో రెండు రకాల పాఠశాలలు ఏర్పాటు చేస్తుంది. 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కూడా ప్రారంభించనుంది. అదేవిధంగా మరికొన్ని ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతితోపాటు ఇంటర్మీడియట్‌ను ప్రారంభించనుంది.



రమణరావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు, లోకనాథం, తులసీదాస్, జగ్గునాయుడు

రమణరావు సేవలు స్ఫూర్తిదాయకం

- సంతాప సభలో పలువురు వక్తలు
- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

సిపిఎం సీనియర్ నాయకులు పివైవి రమణరావు సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమణరావు భౌతికకాయానికి చినగంట్యాడలోని ఆయన ఇంటి వద్ద బుధవారం సిపిఎం, సిపిఐ, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం మాట్లాడుతూ రమణరావు గొప్ప నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ తనకూ రమణరావుకూ 45 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. బిహెచ్‌పివిలో జరిగిన పోరాటాలు ఆయనకు ఉత్తేజాన్ని ఇచ్చాయన్నారు. వర్గ పోరాటంతోనే కార్మికులకు మేలు జరుగుతుందని భావించి ఆ రోజు నుంచి ఈ రోజు వరకు కమ్యూనిస్టు సిద్ధాంతం అమలు కోసం కృషి చేశారన్నారు. ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్ మాట్లాడుతూ రమణరావు గొప్ప పట్టుదల కలిగిన వ్యక్తి అని అన్నారు. ప్రజాశక్తి పేపర్ బాయ్ రాకపోతే ఆయనే పేపర్ వేసేవారని గుర్తుచేశారు. పని పట్ల అంకితభావం కనబరిచేవారన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రమణరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో గాజువాక ఆటోనగర్ సెయింట్ జోసెఫ్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ జోసెఫ్, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు, సిపిఐ కార్పొరేటర్ ఎజె స్టాలిన్, వైసిపి నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు టి శ్రీరామ్మూర్తి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె సత్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఐద్వా నాయకులు బి ప్రభావతి, పద్మ పాల్గొన్నారు. ముందుగా రమణరావు భౌతికకాయంపై లోకనాథం, జగ్గునాయుడు పార్టీ జెండా కప్పారు. రమణరావును స్మరిస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలు ఆలపించారు. సంతాప సభ అనంతరం ఆయన ఇంటి దగ్గర నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. సిపిఎం గాజువాక కార్యాలయం వద్ద సందర్శనార్థం రమణరావు భౌతికకాయాన్ని కొద్దిసేపు ఉంచారు. అనంతరం వంద అడుగుల రోడ్డులోని శ్మశానవాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. అంతిమ సంస్కారాన్ని ఆయన పెద్ద కుమార్తె చైతన్య నిర్వహించారు. రమణరావును కడసారి చూసేందుకు పెద్ద సంఖ్యలో సిపిఎం, ప్రజా సంఘాల కార్యకర్తలు తరలివచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పని కల్పించి, వలసలు అరికట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ కార్మికులందరికీ ఏడాది పొడవునా పని కల్పించాలని, వలసలు అరికట్టాలని ప్రభుత్వాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పనుల కోసం వెళ్తూ ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లాకు చెందిన నలుగురు కూలీలు పొట్టకూటి కోసం వెళ్తూ ప్రమాదంలో మృతి చెందారని తెలిపారు. ఇటువంటి ప్రమాదాలు ప్రతిరోజూ నిత్యకృత్యమయ్యాయని తెలిపారు. అయినా పేదల ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు వలస వెళ్లకుండా ఏడాది పొడవునా పని కల్పించాలని, వలస కార్మికుల రక్షణకు ప్రత్యేకంగా చట్టం చేయాలని కోరారు. పల్నాడులో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం, 2 ఎకరాల భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతోనే వ్యవసాయ పనుల్లో పెద్దయెత్తున యంత్రాలు రావడం, వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోవడం వల్ల నిత్యం లక్షలాది మంది పనుల కోసం వలస పోతున్నారని తెలిపారు. వలసలు నివారించడానికి తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. చేసిన పనికి నెలలు తరబడి వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఈ నెలలో రాష్ట్రంలో పేదలు చేసిన పనికి రూ.650 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. ఈ కారణంగా ఒక్క మే నెలలోనే 60 మందికిపైగా వ్యవసాయ కార్మికులు వలసలు పోతూ ప్రమాదాల్లో మృతి చెందారని పేర్కొన్నారు.

‘ఉక్కు’ కార్మికుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

పరిపాలన భవనం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్ యాజమాన్యం క్రమశిక్షణ పేరుతో కార్మికులపై సస్పెన్షన్, షోకాజ్ నోటీసుల జారీని తక్షణం ఎత్తివేయాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన బుధవారం ధర్నా నిర్వహించారు. స్టీల్ ఎఐటియుసి అధ్యక్షులు కెఎస్ఎన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం క్రమశిక్షణ పేరుతో నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మిక వర్గాన్ని తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ కార్మిక నాయకులకు షోకాజు నోటీసులు ఇవ్వాలనే ఆలోచన దుర్మార్గమన్నారు. ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి రమణమూర్తి మాట్లాడుతూ కర్మాగారంలో ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం విలువలకు తిలోదకాలు ఇస్తూ యాజమాన్యం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే కర్మాగారంలో అశాంతి, అలజడులు పెరిగి ఉత్పత్తి, ఉత్పాదకతలపై ప్రభావం పడుతుందన్నారు. యాజమాన్యం ఇటువంటి దుందుడుకు చర్యలను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి రామస్వామి, అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు రామ్‌కుమార్, డివి రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ యాజమాన్యం తన వైఖరిని తక్షణం మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



విశాఖ స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం ఎదుట రోడ్డుపై ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

చెరువులో పడి ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - భీమడోలు, ఉంగుటూరు

కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా భీమడోలులో చోటుచేసుకుంది. మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...ఏలూరు జిల్లా పెదవేగి మండలం వేగివాడకు చెందిన నేతల అజయ్ అలియాస్ కెనడాం (30), నేతల సాగర్ అలియాస్ నాని (23), చొక్కా అభిలాష్ (22), నున్న ప్రవీణ్, నేతల ఆనంద హర్ష ఐదుగురూ మిత్రులు. వీరంతా కలిసి భీమడోలు పంచాయతీ పరిధిలోని చిన్న లింగంపాడులో ఒక ఫంక్షన్‌కు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని కోమటికుంట చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు అజయ్, సాగర్, అభిలాష్ చెరువులో జారిపడిపోయారు. లోతు ఎక్కువగా ఉండడంతో వారిని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాలేదు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నీట మునిగిన ముగ్గురిని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుల్లో నేతల అజయ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మిగిలిన ఇద్దరు అవివాహితులు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భీమడోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28న రైతుల చలో సిఎం క్యాంప్ ఆఫీసు

- బర్లీ పొగాకు రైతుల సమస్యలపై ప్రభుత్వం మొద్దునిద్ర
- బాండ్లు ఇచ్చి కొనుగోలు చేయని కంపెనీలపై చర్యలు తీసుకోవాలి
- టుబాకో బోర్డు చైర్మన్‌తో సమావేశంలో రైతు సంఘాలు

ప్రజాశక్తి-గుంటూరు

గత రెండు, మూడు నెలలుగా పొగాకు రైతుల సమస్యలపై జరుగుతున్న ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతూ, కాలయాపన చేస్తుండడాన్ని నిరసిస్తూ ఈ నెల 28న ‘ఛలో సిఎం క్యాంప్ ఆఫీసు’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాలు తెలిపాయి. గత నెల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో జరిగిన సమావేశంలో బర్లీ పొగాకు కొనుగోలు చేస్తామని కంపెనీలు హామీ ఇచ్చాయని, ఇంత వరకూ కొనుగోలు మాత్రం చేయలేదు. దీంతో బుధవారం రైతు సంఘాలల నాయకులు, రైతులు గుంటూరులోని టుబాకో బోర్డు కేంద్ర కార్యాలయంలో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్‌తో సమావేశమయ్యారు. బ్లాక్ బెర్లీ పొగాకును అసలు కొనుగోలు చేయలేదని, వైట్ బర్లీ కూడా నామమాత్రంగా కొంటున్నారని సంఘాల నాయకులు తెలిపారు. బోర్డులో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్ నిరుపయోగంగా మారిందన్నారు. ముఖ్యంగా ఐటిసి, జిపిఐ, మద్ది లక్ష్మయ్య తదితర కంపెనీలు పంట కొంటామని రైతుల్ని ప్రోత్సహించి, బాండ్లు ఇచ్చి తీరా ఇప్పుడు కొనుగోలు చేయట్లేదని తెలిపారు. ఆయా కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ఇలాంటి వార్తలు ఇంకా వినాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో రౌడీల్లా వ్యవహరిస్తూ రైతుల్ని బెదిరిస్తున్నారన్నారు. వర్జీనియా పొగాకు కూడా గతేడాది క్వింటాలు రూ.28 వేల నుండి రూ.40 వేలు ధర ఉంటే ఈ ఏడాది రూ.22 వేలకు పడిపోయిందన్నారు. బోర్డు బాధ్యత తీసుకొని కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రం ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. బోర్డు చైర్మన్ మాట్లాడుతూ కంపెనీలు ఇచ్చిన బాండ్ పేపర్లు తెప్పించుకొని, వాటికి అనుగుణంగా పంటను కొనుగోలు చేసే విధంగా నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. బర్లీ పొగాకును బోర్డు పరిధిలోకి తేవాలనే అంశాన్ని ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, గన్నవరం, కారంచేతు, ఎం.ముప్పాళ్ల వివిధ ప్రాంతాల నుండి రైతులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిఆర్ బడ్జెట్‌పై అంచనాల కమిటీ సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 2019 నుంచి 2022 వరకూ మూడేళ్ల కాలంలో బడ్జెట్‌పై అంచనాల కమిటీ సమీక్ష నిర్వహించింది. వెలగపూడిలోని అసెంబ్లీ భవనంలోని కమిటీ హాలులో అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ మూడేళ్లకు సంబంధించిన బడ్జెట్ అంచనాలు, చేపట్టిన పనులు, చేసిన ఖర్చులు తదితర అంశాలను కమిటీ ముందుంచారు. ఈ సమావేశంలో అంచనాల కమిటీ సభ్యులు భూమా అఖిలప్రియ, మద్దిపాటి వెంకటరాజు, నిమ్మక జయకృష్ణ, కందుల నారాయణరెడ్డి, పాశం సునీల్ కుమార్, అసెంబ్లీ ఉప కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

మద్యం కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి ‘సుప్రీం’ నోటీసు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మద్యం కేసులో రాజ్ కసిరెడ్డి అరెస్టు అక్రమమని దాఖలైన పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసు ఇచ్చింది. సుప్రీంకోర్టులో రాజ్ కసిరెడ్డి తండ్రి ఉపేంద్ర రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ ఉపేంద్ర రెడ్డి తరపున సీనియర్ న్యాయవాదులు మహేష్ జెఠ్మలానీ, పొన్నవోలు సుధాకర్ రెడ్డి, అల్లంకి రమేష్ వాదనలు వినిపించారు. తెలంగాణలో అరెస్టు చేసి, ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లడం అక్రమమని పేర్కొన్నారు.

అరెస్టు సమయంలో చేర్చిన సెక్షన్లకు, రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న సెక్షన్లకు సంబంధం లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అరెస్టు సమయంలో 420 సెక్షన్లు చేర్చిన సిఐడి పోలీసులు, ఆ తరువాత అవినీతి నిరోధక చట్టం సెక్షన్లను చేర్చారని పేర్కొన్నారు. వాదనలు విన్న అనంతరం ఎపి సిఐడికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 19కు వాయిదా వేసింది. ఆ లోపు కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి కళ్యాణదుర్గం రూరల్

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలంలో పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. ఓబులాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి రామలింగ (45) తన గొర్రెలకు మేత కోసం ఊరి బయటకు తీసుకెళ్లారు. సాయంకాలం తిరిగి ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా వర్షం కురిసింది. చెట్టు కింద ఉన్న రామలింగానికి అతి సమీపంలో పిడుగు పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.

బిజెపిలో చేరిన జకియా ఖానమ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానమ్ బిజెపిలో చేరారు. బుధవారం విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. అంతకముందు వైసిపికి, డిప్యూటీ ఛైర్మన్ పదవికి ఖానమ్ రాజీనామా చేశారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జమ్మలమడుగు, ఆదోని ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పార్థసారధి, ఎస్‌సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు దేవానంద్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుమార్‌స్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఐవైఎఫ్ మహాసభ

- తొలిరోజు ర్యాలీ బహిరంగ సభ : తిరుమలై రామన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభ తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. విద్య, ఉపాధి, నిరుద్యోగ సమస్య, నిరుద్యోగ భృతి సాధన తదితర అంశాలపై జరిగే చర్చలకు 24 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవనున్నారని ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ తెలిపారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహాసభలో వివిధ అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గురువారం బాలాజీ కాలనీ నెహ్రూ మున్సిపల్ మైదానం నుంచి ఇందిరా మైదానం వరకూ ర్యాలీ అనంతరం బహిరంగసభ ఉంటుందన్నారు. వీటిని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ కె నారాయణ, జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు, జాతీయ మాజీ కార్యదర్శి జి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు రేషన్‌కార్డులు

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలు ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు రేషన్‌కార్డులు మంజూరు చేసి, ప్రభుత్వ పథకాలు వర్తించేటట్లు చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు లేఖ రాశారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో మూడు లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పలు రకాల సేవలందిస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి ఎటువంటి సంక్షేమ పథకాలూ అందించడం లేదని పేర్కొన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పెన్షన్లు, ఇళ్ల స్థలాలు వంటి పథకాలు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయడం లేదని తెలిపారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వారికి పథకాలు వర్తించకపోవడంతో కుటుంబం పోషించడం కష్టంగా మారిందని తెలిపారు. గత ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు అవకాశం కల్పించాలని, పథకాలన్నీ వర్తించేటట్లు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారమివ్వాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లాలో జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు వ్యవసాయ కార్మికులు మృతి చెందడంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారికి సంతాపం, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంలో చనిపోయిన వారిలో భార్యాభర్తలు ఉన్నారని, ఆ కుటుంబం రోడ్డున పడుతుందని తెలిపారు. చనిపోయిన ఒక్కొక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదలు పనుల కోసం వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు ఏడాది పొడవునా కల్పించకపోవడం వలనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. వ్యవసాయంలో యంత్రాల వల్ల కూలీలు పనులు దొరక్క నానాపాట్లు పడుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా కూలీలు వలసలు పోకుండా, ఉపాధి పనులు విస్తృతంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి బకాయిలు విడుదల చేయాలని శ్రీనివాసరావు కోరారు.

ఐదుగురు చిన్నారుల మృతిపై సిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ కడప జిల్లా, బ్రహ్మంగారిమఠం మండలం, మల్లేపల్లి చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్నారులందరూ 15 సంవత్సరాల లోపు వారేనని, దుర్ఘటన తనను కలిచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : జగన్

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేసవి సెలువులు కావడంతో పిల్లలు చెరువులో ఈతకు వెళ్లి మరణించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పండగలా టిడిపి మహానాడు

- పార్టీ సీనియర్ నేతలతో లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడపలో పండగ వాతావరణంలో టిడిపి మహానాడును నిర్వహిస్తామని టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ అన్నారు. మహానాడు కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్లతో ఏర్పాట్లపై పొలిట్‌బ్యూరో సమావేశానికి ముందు టిడిపి కార్యాలయంలో లోకేష్ సమావేశం నిర్వహించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా.. మహానాడును నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారని, అయినా ప్రజలు స్వచ్ఛంధంగా తరలివచ్చి విజయవంతం చేశారని తెలిపారు. పార్టీ ఆవిర్భావం తర్వాత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తిరుగులేని మెజార్టీ సాధించామన్నారు. మహానాడుకు వసతి, రవాణకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎస్ సవిత, పి నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, సీనియర్ నాయకులు బీద రవిచంద్ర యాదవ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తం : విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా 41 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశముందన్నారు. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు, మరికొన్ని చోట్ల ఎండలు ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నెల 15న అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నెల 16న అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్ కోనసీమ, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

శ్రీకాకుళం జిల్లా, జగ్గిలిబొంతులో బుధవారం 53.5 మిల్లీమీటర్లు, రాగోలులో 49.2, ఏలూరు జిల్లా పూళ్ళలో 44.5, ఎల్ఎన్‌పేటలో 38.5, ఆమదాలవలసలో 35.7, ఏలూరులో 34.5, పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండలో 32.7 మిల్లీ మీటర్లు చొప్పున వర్షపాతం నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

కడప మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు


- యాక్టు-1955 ఉల్లంఘన పేరిట తొలగింపు
- రూ.36 లక్షలు స్వాహా అయినట్లు ఆరోపణలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప మేయర్ కె.సురేష్‌బాబుపై అనర్హత వేటు పడింది. తన కుటుంబ సభ్యుల పేరిట నమోదైన కన్‌స్ట్రక్షన్ కంపెనీ చేపట్టిన రూ.36 లక్షల రహదారులు, ఇతర అభివృద్ధి పనులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తప్పుబట్టింది. మేయర్‌ను పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం జిఒఆర్‌టి 446 జారీ చేసింది. మున్సిపల్ యాక్టు-1955 ప్రకారం స్థానిక సంస్థల పదవుల్లో నియమితులైన నాయకులు తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట ఎలాంటి కాంట్రాక్టు పనులను చేపట్టకూడదని నిర్దేశిస్తోంది. నిబంధనల్ని ఉల్లంఘిస్తూ తన కుటుంబ సభ్యుల పేరిట నమోదైన వర్ధిని కన్‌స్ట్రక్షన్ సంస్థ కడప కార్పొరేషన్ పరిధిలో పది రకాల కాంట్రాక్టు పనులను చేపట్టింది. ఏడు పనుల్ని పూర్తి చేసింది. మరో మూడు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మేయర్ కుటుంబ సభ్యులకు చెందిన సంస్థ రూ.36 లక్షల విలువైన పలు రహదారులు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టడంపై అధికార పార్టీకి చెందిన కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై రాష్ట్ర మున్సిపల్ అడ్మిన్‌స్ట్రేషన్ అధికార యంత్రాంగం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ విచారణలో రూ.36 లక్షల దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించింది. మున్సిపల్ యాక్టు-1955 ఉల్లంఘనపై సమాధానం చెప్పాలని కోరుతూ పలుమార్లు నోటీసులు జారీ చేసింది. నోటీసులను సవాల్ చేస్తూ మేయర్ హైకోర్టును ఆశ్రయించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 28న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ అప్రైసల్ రిపోర్టును నివేదించింది. 24న షోకాజ్ నోటీసు కింద మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు మెమో జారీ చేశారు. ప్రభుత్వం ఏప్రిల్ 22న మెమో జారీ చేసింది. దీనిపై హైకోర్టులో రిట్ వేసింది. ప్రభుత్వం ఈనెల తొమ్మిదిన మెమో జారీ చేసింది. మేయర్‌ను పదవి

మాచర్ల మున్సిపల్ చైర్మన్ తొలగింపు

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)



తురకా కిషోర్

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిశోర్‌ను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. మున్సిపల్ చైర్మన్ పదవిని దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం విచారణ జరిపి మున్సిపల్ చట్టం సెక్షన్ 16(1) ఉల్లంఘించారని నిర్ధారించారు. దీంతో మున్సిపల్ చైర్మన్‌గా తురకా కిశోర్‌ను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ విషయాన్ని మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు నిర్ధారించారు.

'కూటమిని' రాజకీయంగా ఎదుర్కొంటాం : కె నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి/అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఆ మూడు ప్రధాన పార్టీలూ బిజెపి శక్తులేనని, వారికి పార్టీలు, జెండాలు, బొమ్మలు వేరైనా అందరూ బిజెపి ముఖాలేనని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. టిడిపి కూటమికి వ్యతిరేకరంగా కమ్యూనిస్టులు, ప్రగతిశీల శక్తులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ ప్రత్యామ్నాయ వేదికను సిద్ధం చేస్తామని తెలిపారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్‌కల్యాణ్, వైసిపి అధినేత జగన్ బిజెపికి వ్యతిరేకంగా ఒక్కమాటైనా మాట్లాడగలరా? అని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపిని నిలదీస్తే తప్పేముందని వ్యాఖ్యానించారు. చర్చలకు మావోయిస్టులు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఖాతరు చేయకుండా, 2025 నాటికి వారిని అంతం చేస్తామని ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమ్మెను జయప్రదం చేయండి : సిపిఐ

కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ప్రజలు, సిపిఐ శ్రేణులు పాల్గొని మద్దతు తెలపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అలంబిస్తుందన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని రామకృష్ణ కోరారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు ఆయన లేఖ రాశారు.

దేశ ప్రతిష్టను దెబ్బతీసిన మోడీ

- వైఫల్యాల నుంచి బయటపడేందుకే తిరంగయాత్ర
- మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు : వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షులు చెప్పినట్లు నడుచుకుని దేశ ప్రతిష్టను ప్రధాని మోడీ దెబ్బతీశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. తన వైఫల్యాల నుంచి బయటపడడానికి తిరంగ యాత్ర అంటూ బిజెపి కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. ఇది తిరంగ యాత్ర కాదని, మోసపూరిత యాత్ర అని విమర్శించారు. నెల్లూరు బాలాజీనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... యుద్ధంతో ఉగ్రవాద సమస్య పరిష్కారం కాదని, ఉగ్రవాద మూలాలు తొలగించాలన్నారు. ఈ పోరాటంలో పాకిస్తాన్‌ను ఒంటరి చేయడం, దౌత్యపరంగా అదుపు చేయడం, ప్రపంచ దేశాలను కూడగట్టాలన్నారు. ఈ ప్రయత్నం చేయకుండా ఉపన్యాసాలతో సమస్య పరిష్కారం కాదని, కాశ్మీర్ ప్రజలను విశ్వాసంలోకి తీసుకుంటేనే ఇది పరిష్కారం అవుతుందన్నారు. అన్ని పార్టీలతో చర్చించాలని, వాస్తవాలు వివరించి, సమగ్ర చర్చ జరపడానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం బీహార్ ఎన్నికలు, పార్టీ బలం పెంచుకోవడానికి బిజెపి తప్పుడు పద్ధతుల్లో వ్యవహరించిందన్నారు. కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు చెప్పినట్లు ఎందుకు విన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా ముందుకొచ్చి వాస్తవ పరిస్థితులు మాట్లాడకుండా రెచ్చగొట్టే ధోరణితో మోడీ వ్యవహరించారన్నారు. కాశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులున్నారని హోంమంత్రి చెప్పారని, ఎంతమందిని నిర్మూలించారో చెప్పలేదన్నారు. ముస్లిములు పాకిస్తాన్‌కు వెళ్లిపోండి అని చెప్పడం దేశంలో మతోన్మాదం రెచ్చగొట్టడమేనని చెప్పారు. కాశ్మీర్ ప్రజలు దేశం కోసం పనిచేశారని తన ప్రసంగంలో మోడీ ఎక్కడా చెప్పలేదన్నారు. కాల్పుల విరమణ తరువాత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఒక్క మాట మాట్లాడడం లేదని, అంతకు ముందు హిందువుల రక్షణ అంటూ యాత్రలు చేశారని, ఇప్పుడైనా మతసామరస్యానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు సన్నాహాలు చేస్తోందని, దీనిని ప్రజలు వ్యతిరేకించాలన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేసు వేశారని, మీటర్లు పగులగొట్టాలని గతంలో లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. మా ఇంటికి స్మార్ మీటర్ వద్దంటూ బోర్డులు పెట్టాలని ప్రజలను కోరారు. ఇప్పటికే అదానీ కంపెనీతో తప్పుడు ఒప్పందాలు చేసుకొని రూ.1.20 లక్షల కోట్లు ప్రజలపై భారాలు మోపారని వివరించారు. టిడ్కో ఇళ్లను వెంటనే పేదలకు పంచాలని, జగనన్న ఇళ్లల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, పక్కన రమేష్, వెంకటేశ్వర్లు, కె.అజయ్‌కుమార్

గోవిందప్ప బాలాజీకి 20 వరకు రిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం కేసులో గోవిందప్ప బాలాజీకి విజయవాడ ఎసిబి కోర్టు ఈ నెల 20 వరకు రిమాండ్ విధించింది. ఈ కేసులో ఎ33గా ఉన్న గోవిందప్ప బాలాజీని మంగళవారం కర్ణాటకలో అరెస్టు చేసిన సిట్ అధికారులు విజయవాడ ఎసిబి ప్రత్యేక న్యాయస్థానంలో బుధవారం హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవించి గోవిందప్ప బాలాజీని 6 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వెంటనే ఆయనను విజయవాడ సబ్ జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. వైసిపి హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో రూ.వేలకోట్లు కొల్లగొట్టి, ముడుపులను డొల్ల కంపెనీలకు మళ్లించి ఓ అగ్రనేతకు అవి చేరేలా చేశారనే ఆరోపణలు బాలాజీపై ఉన్నాయి. ఇతను మాజీ సిఎం వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడు, ఆయన సతీమణి భారతి తరపున ఆర్థిక వ్యవహారాలన్నీ ఈయనే చూస్తుంటారనే వాదన కూడా ఉంది. మరోవైపు ఎ31, ఎ32గా ఉన్న రిటైర్డ్ ఐఎఎస్ అధికారులు ధనంజయరెడ్డి, కృష్ణమోహన్ సిట్ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. తమను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఈ నెల 16 వరకు అరెస్టు చేయొద్దని, దర్యాప్తు అధికారులకు సహకరించాలని ఆదేశించిన నేపథ్యంలో బుధవారం వీరిద్దరూ తమ న్యాయవ్యాదులతో సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. ఈ కేసులో కీలకంగా గోవిందప్ప బాలాజీతో పాటు రిటైర్డ్ ఐఎఎస్ ధనంజయరెడ్డి దర్యాప్తు అధికారుల ముందుకు రావడంతో అనేక విషయాలు వెలుగులోకి రావచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

జిల్లాకు ఒకే పేపర్ విధానం పెట్టాలి

విజయనగరంలో డిఎస్‌సి అభ్యర్థుల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - విజయనగరం టౌన్



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న డిఎస్‌సి అభ్యర్థులు

పరీక్ష సమయం 90 రోజులు గడువు ఇవ్వాలని, జిల్లాకు ఒక పేపర్ విధానం పెట్టాలని డిమాండ్ చేస్తూ విజయనగరం కలెక్టరేట్ వరకూ డిఎస్‌సి అభ్యర్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ధర్నా చేశారు. డిఆర్‌ఒ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యాన బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ.. ఏడేళ్ల తరువాత వెలుబడిన నోటిఫికేషన్‌లో నిరుద్యోగులు సన్నద్ధం కావడానికి పరీక్షకు కనీసం 90 రోజులు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి 44 సంవత్సరాలకు పరిమితం చేయడంతో చాలా మంది అభ్యర్థులు నష్టపోతున్నారని తెలిపారు. తెలంగాణలో మాదిరి 47 ఏళ్ల వరకు అవకాశం కల్పించాలని కోరారు. పరీక్షలో నార్మలైజేషన్ పద్ధతి రద్దుచేసి జిల్లా అంతటికీ ఒకే పేపర్ నిర్వహించాలని, ఓపెన్ డిగ్రీలో పాస్ అయిన వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భాను, ఈశ్వర్ రావు, డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు చంద్ర గ్రహణం

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన తొమ్మిది బడుల విధానంతో విద్యా వ్యవస్థ సర్వనాశనం అవుతోందని వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. 19, 20, 21 జిఓలతో పాఠశాలలు మూతపడే ప్రమాదం వచ్చిందని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్యారంగం నిర్వీర్యం అవుతోందని, ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం అవుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై టీచర్లలో ఆగ్రహ జ్వాల రగులుతోందన్నారు. కొత్త జిఓలతో డిఎస్‌సి పోస్టులకు కోత పడుతోందని పేర్కొన్నారు. క్లస్టర్ లెవెల్ అకడమిక్ విధానంతో టీచర్లకు తిప్పలు తప్పడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెంబరు 117ను రద్దు చేస్తామని చెప్పిన సిఎం మంగళవారం మూడు జిఓలు తీసుకొచ్చారని, దీంతో ఉపాధ్యాయుల గుండెల్లో దడ పుడుతోందని పేర్కొన్నారు.

పోలవరంలో మూడో ట్రెంచ్ కట్టర్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో మూడవ ట్రెంచ్ కట్టర్‌కు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు ట్రెంచ్ కట్టర్లతో పనులు చేసిన అధికారులు కొంతమేర ట్రెంచ్ కటింగ్ కాంక్రీటు పనులు పూర్తి చేశారు. అధికారికంగా డిజైను ఆమోదం జరిగిన ప్రాంతాల్లో డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం గైడ్ వాల్ నిర్మించి కొంతమేర కాంక్రీటు పనులు పూర్తి చేశారు. మిగిలిన ప్రాంతాల్లో ట్రెంచ్ కట్టర్ ద్వారా రాతి పొరలు వచ్చే వరకూ తవ్వకాలు జరపాల్సి ఉంది. రాతిపొర గట్టిదనం లేకపోవడం, రాతి పొర ఇసుకలా పిండిపిండి అవుతుండటం వల్ల గట్టి రాతిపొర వచ్చే వరకూ తవ్వకాలు చేయాల్సిందేనని గత వారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన నిపుణుల బృందం సూచించింది. దీంతో అధికారులు ఇప్పటి వరకూ రెండు ట్రెంచ్ కట్టర్లకు తోడు మూడో ట్రెంచ్ కట్టర్‌ను రంగంలోకి దింపి పనులు వేగవంతం చేశారు. కార్యక్రమంలో జలవనరులశాఖ అధికారులు డి.శ్రీనివాస్, అనిల్‌కుమార్, శ్రీరామపటేల్, నిర్మల, బావర్ ప్రతినిధులు హసన్, మహీధర్, మెగా జిఎం గంగాధర్, డిజిఎం పి.మురళీ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి ఉరవకొండ

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం కొత్తకోట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కొత్తకోట గ్రామానికి చెందిన రవి యాదవ్ (27) తనకున్న తొమ్మిది ఎకరాల పొలంతో పాటు మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశారు. పంటల సాగు నిమిత్తం రూ.పది లక్షల వరకు అప్పు చేశారు. ఈ ఏడాది మిర్చికి ధర లేకపోవడంతో పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చేమార్గం లేక మనస్తాం చెందారు. తన ఇంటి పక్కనే ఉన్న షెడ్‌లోకి వెళ్లిఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సినిమా థియేటర్లలో రేట్ల క్రమబద్ధీకరణకు కమిటీ

- జిఓ 80 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సినిమా థియేటర్లలో రేట్లను హేతుబద్ధీకరించేందుకు ప్రభుత్వం నూతన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం హోంశాఖ జిఓ ఎంఎస్ నెంబరు 80ని విడుదల చేసింది. ఈ విషయంలో ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి సమగ్ర పద్ధతిలో సమస్యను పరిష్కరించడానికి ఏర్పాటుచేసిన కమిటీకి ఛైర్మన్‌గా హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వ్యవహరించనున్నారు. మెంబర్లుగా ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఅండ్‌పిఆర్ డైరెక్టర్ అండ్ ఎక్స్ అఫీషియో సెక్రటరీ, లా డిపార్టుమెంట్ సెక్రటరీ, సినీ నిర్మాత వివేక్ కూచిబొట్ల ఉన్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

విద్యాదృక్పథాలు : ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు



-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

ప్రాథమిక హక్కులు

ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో 12 నుంచి 35 వరకు ప్రకరణల్లో పేర్కొన్నారు. అమెరికా రాజ్యాంగ స్ఫూర్తితో భారత రాజ్యాంగ నిర్మాతలు మన రాజ్యాంగంలో వాటిని పొందుపర్చారు. భారత రాజ్యాంగంలోని మూడో భాగాన్ని 'భారత మెగ్నాకార్టా'గా పేర్కొంటారు. మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు సంపూర్ణమైనవి. సమగ్రమైనవి. సవివరమైనవి. న్యాయబద్ధమైనవి. వాస్తవానికి భారత రాజ్యాంగంలో పేర్కొనబడిన ప్రాథమిక హక్కులు ప్రపంచ రాజ్యాంగాలన్నింటి కంటే సవివరమైనవి.

భారత రాజ్యాంగ లక్షణాల్లో ప్రాథమిక హక్కులు అత్యంత ముఖ్యమైనవి. ప్రాథమిక హక్కులు భారత పౌరుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి, రాజకీయ ప్రజాస్వామ్య ప్రగతికి దోహదపడతాయి. కేంద్ర, రాష్ట్రస్థాయిల్లో అధికారం చెలాయించే ప్రభుత్వాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో అమలు చేయాల్సిన నియమాలుగా ఆదేశ సూత్రాలు ఉండగా, ప్రాథమిక హక్కులు భారత పౌరుల ప్రాథమిక జీవన విధానానికి సోపానాలుగా ఉంటాయి. భా భారత రాజ్యాంగ పరిషత్తు ఏడు రకాల ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలో చేర్చింది. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని మూడో భాగంలోని 12వ అధికరణం (ఆర్టికల్) మొదలుకొని 35వ అధికరణం వరకు మొత్తం 24 అధికరణాల్లో ప్రస్తావించారు. ప్రారంభంలో ఏడు రకాల ప్రాథమిక హక్కులను భారత పౌరులకు ఇచ్చారు. 1976లో పార్లమెంటు 42వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని ఆమోదించడం ద్వారా ఆస్తిహక్కుపై పరిమితులు విధించింది. 1978లో పార్లమెంటు 44వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఆస్తిహక్కును ఒక సాధారణ హక్కుగానే పరిగణించాల్సివుంటుందంటూ పేర్కొంటూ, ప్రాథమిక హక్కుల జాబితా నుంచి దాన్ని తొలగించింది. అప్పటి నుంచీ ఆరు రకాల ప్రాథమిక హక్కులే భారత పౌరులకు అందుబాటులో ఉన్నాయి.

1.సమానత్వ హక్కు (14, 15, 16, 17, 18 అధికరణాలు)
2.స్వేచ్ఛ, వ్యక్తి స్వాతంత్ర్య హక్కు (10, 20, 21, 22 అధికరణాలు)
3. పీడనను నిరోధించే హక్కు (23, 24 అధికరణాలు)
4. మత స్వాతంత్ర్య హక్కు (25, 26, 27, 28 అధికరణాలు)
5. విద్యా సాంస్కృతిక హక్కు (29, 30 అధికరణాలు)
6. రాజ్యాంగ పరిహార హక్కు (32వ అధికరణం)1.

1.సమానత్వ హక్కు

14వ అధికరణం ప్రకారం చట్టం దృష్టిలో అందరూ సమానులే.

15వ అధికరణం ప్రకారం ప్రతివ్యక్తీ ఎంతటి హోదా, ఆస్థి ఉన్నప్పటికీ సాధారణ న్యాయపరిధిలోకే వస్తారు. పౌరుల మధ్య జాతి, కుల, మత, లింగ, జన్మ సంబంధమైన విచక్షణలు నిషేధించారు.

16వ అధికరణం ప్రకారం రాజ్యం ఏ ఒక్కరి పైనా ఏ విధమైన ప్రత్యేక ఆదరణ చూపరాదు.

17వ అధికరణం ప్రకారం బలహీన వర్గాలు, సాంఘికంగా వెనకబడిన జాతులు, తెగల ఉద్ధరణ కోసం కొన్ని ప్రత్యేక సదుపాయాలు హేతుబద్ధమైన రీతిలో కొంతకాలంపాటు కల్పించారు. వ్యక్తుల మధ్య అంటరానితనాన్ని పాటించడం శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారు.

18వ అధికరణం ప్రకారం సాంఘిక అసమానతలకు అవకాశం కల్పించే బిరుదులను ఎవ్వరూ స్వీకరించరాదు. సైనిక, రక్షణ, సాంస్కృతిక, కళారంగాల్లో రాజ్యం కొందరిని బిరుదుల ద్వారా సత్కరించొచ్చు. ఉదా: భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ, అశోకచక్ర వంటివి.

2. స్వేచ్ఛ, వ్యక్తి స్వాతంత్ర్య హక్కు

ఈ హక్కు ద్వారా ప్రజలందరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇచ్చారు.

19వ అధికరణం ప్రకారం ప్రతి ఒక్కరికీ ఆరు స్వేచ్ఛలు ఉన్నాయి. అవి :

1. వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ.
2. ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకునే స్వేచ్ఛ.



3. దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లని విధంగా సంస్థలను నెలకొల్పుకొనే స్వేచ్ఛ.
4. భారతదేశంలో ఏ ప్రాంతంలోనైనా స్వేచ్ఛగా సంచరించే స్వేచ్ఛ.
5. భారత భూభాగంలో ఎక్కడైనా స్థిరనివాసం ఏర్పరచుకొనే స్వేచ్ఛ.
6. చట్టవ్యతిరేకంకాని ఏరకమైన వత్తి, వ్యాపారం, వర్తకం లేదా వాణిజ్యాన్ని చేపట్టే స్వేచ్ఛ.

అయితే భారతదేశ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, సమగ్రత, లౌకికతత్వాలకు భంగం వాటిల్లని రీతిలో పౌరులు తమకిచ్చిన స్వేచ్ఛలను అనుభవించాల్సివుంటుంది. వీటినే 'సహేతుక నిర్బంధాలు' అని అంటారు.

20వ అధికరణం ప్రకారం ఏ ఒక్క వ్యక్తీ చట్టాన్ని అతిక్రమించకపోతే ఆ వ్యక్తి శిక్షకు గురికాకూడదని తెలుపుతుంది.

21వ అధికరణం ప్రకారం ఒక నేరానికి ఒకసారి మించి శిక్షకు గురిచేయరాదు. ఏ ఒక్క వ్యక్తినీ నిర్బంధంగా తనకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వమని బలవంతం చేయరాదు. చట్టం పేర్కొన్న విధంగా ఏ ఒక్కరి జీవనానికి, స్వేచ్ఛలకు హాని కల్గించరాదు.

22వ అధికరణం ప్రకారం న్యాయమూర్తి అనుమతి లేకుండా ఏ ఒక్కరినీ 24 గంటలకు మించి నిర్బంధంలో ఉంచరాదు. ఏ కారణం వల్ల నిర్బంధించిందీ బాధితుడికి తెలియజేయాలి. నిర్బంధితుడికి న్యాయవాదిని ఏర్పాటు చేసుకొనే అవకాశం ఇవ్వాలి. నిర్బంధించిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీపంలోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాలి. .

3. పీడనాన్ని నిరోధించే హక్కు

వ్యక్తుల ఆత్మగౌరవాన్నీ హుందాతనాన్నీ గౌరవించి, పరిరక్షించి, పెంపొందించే లక్ష్యంతో ఈ హక్కు ఇవ్వడమైంది.

23వ అధికరణం ప్రకారం వెట్టి చాకిరితోపాటుగా అమానుషమైన కొన్ని పనులను నిషేధించింది. వస్తువుల లాగే మనుషులను కొనుగోలు చేయడాన్ని, వ్యభిచార గృహాలను నిర్వహించరాదు.

24వ అధికరణం ప్రకారం 14 సంవత్సరాలలోపు పిల్లలను ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదకరమైన పనుల్లో నియమించరాదు.

4. మత స్వాతంత్ర్య హక్కు

భారతదేశాన్ని లౌకిక రాజ్యాంగా రూపొందించే లక్ష్యంతో మత స్వాతంత్ర్య హక్కును రాజ్యాంగం పౌరులకు ప్రసాదించింది.

25వ అధికరణం ప్రకారం ప్రతివ్యక్తికీ తనకు ఇష్టమైన మతాన్ని స్వీకరించడానికీ, ప్రబోధించడానికీ, ప్రచారం చేసుకోవడానికీ పూర్తి స్వేచ్ఛ ఉంది.

26వ అధికరణం ప్రకారం మతపరమైన వ్యవహారాలను నిర్వహించుకోవడానికి ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉంది. మతపరమైన, ధార్మికమైన సంస్థలను ఏర్పరచుకోవడానికీ, వాటి నిర్వహణకోసం నిధులను లేదా విరాళాలను సేకరించుకోవడానికీ, ఆస్తులను సంపాదించుకోవడానికీ అనుమతిస్తుంది.

27వ అధికరణం ప్రకారం వ్యక్తులపై మతం ఆధారంగా ఏ విధమైన పన్నును విధించరాదు.

28వ అధికరణం ప్రకారం ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని పూర్తిగా లేదా పాక్షికంగా పొందే విద్యా సంస్థల్లో మతపరమైన ప్రార్థనలు, పూజలు, వేడుకలు నిర్వహించరాదు.

5. విద్యా, సాంస్కృతిక హక్కు

పౌరులకు సాంస్కృతిక, విద్యాసంబంధిత హక్కులను 29, 30 అధికరణాలు ప్రసాదించాయి.

29వ అధికరణం ప్రకారం భారతదేశంలో నివశించే ప్రతి పౌరుడూ కుల, మత, ప్రాంత, భాషాపరమైన వ్యత్యాసాలతో నిమిత్తం లేకుండా తన భాషా సంస్కృతులను కాపాడుకోవచ్చు. మతం, భాష, సంస్కృతుల విషయంలో భారతదేశంలోని అల్ప సంఖ్యాక వర్గాల ప్రయోజనాలను 29వ అధికరణం పరిరక్షిస్తుంది.

30వ అధికరణం ప్రకారం ప్రభుత్వం మంచి పూర్తిగా లేదా పాక్షికంగా ఆర్థిక సహాయం పొందే విద్యా సంస్థల్లో ప్రవేశం విషయంలో కుల, మత, ప్రాంత, వర్ణ, భాష, లింగ విచక్షణలతో ఏ ఒక్కరిపట్ల ప్రత్యేకమైన ఆదరణ చూపరాదు.

6. రాజ్యాంగ పరిహార హక్కు

రాజ్యాంగంలోని 32వ అధికరణం సర్వహక్కులకు సర్వోన్నత రక్షణ వలయంగా ఉంటుంది. పైన పేర్కొన్న ప్రాథమిక హక్కులను అనుభవించడంలో ఏర్పడే అడ్డంకులను అధిగమించేందుకు ఇచ్చిన హక్కే రాజ్యాంగ పరిహార హక్కు. దీని ప్రకారం రాజ్యాంగానీ, వ్యక్తులుగానీ, సంస్థలుగానీ ఒక పౌరుడికి గల ప్రాథమిక హక్కుల విషయంలో జోక్యం చేసుకొంటే లేదా ప్రాథమిక హక్కుల వినియోగంలో ఏవైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే లేదా కష్టనష్టాలకు గురిచేస్తే ఆ వ్యక్తి తగిన న్యాయస్థానానికి అప్పీలు చేసుకోవడం ద్వారా ఉపశమనాన్ని పొందొచ్చు.

ప్రాథమిక హక్కులు - పరిమితులు

పౌరులు ప్రాథమిక హక్కులను కొన్ని పరిమితులకు లోబడి అనుభవించొచ్చు. అవి:

1. అత్యవసర పరిస్థితిలో పార్లమెంటు 19వ అధికరణంలో చెప్పిన ప్రకారం ప్రాథమిక స్వాతంత్ర్యాన్ని యోగ్యమైన పరిమితులను విధించడం ద్వారా తగ్గించొచ్చు. 358, 359 అధికరణలు అత్యవసర పరిస్థితి కాలంలో కేంద్ర ప్రభుత్వానికి ఇలాంటి చర్యలు తీసుకొనే అధికారాన్నిచ్చాయి. 352, 356, 360 అధికరణల కింద ప్రాథమిక హక్కులను అత్యవసర పరిస్థితుల్లో తాత్కాలికంగా రద్దుచేయొచ్చు.

2.19వ అధికరణంలో ప్రస్తావించిన స్వాతంత్ర్య హక్కునుగాక మిగిలిన ప్రాథమిక హక్కులను 359వ అధికరణం కింద భారత రాష్ట్రపతి తాత్కాలికంగా సస్పెండ్ చేయొచ్చు. రాష్ట్రపతి ఆదేశం భారతదేశం మొత్తానికి లేదా ఏ భాగానికైనా వర్తిస్తుంది. అయితే ఆ ఆదేశాన్ని పార్లమెంటు ఉభయసభలు ఆమోదించాల్సివుంది.

3.22వ అధికరణంలోని 4, 5, 6, 7 నిబంధనల మీద నివారక నిర్బంధానికి సంబంధించి పరిమితులున్నాయి. నివారక నిర్బంధం కింద పార్లమెంటు అనేక నిరోధక చట్టాలను చేసింది. అవి జాతీయ భద్రతా చట్టం (1980), ముఖ్యావసర వస్తువుల సరఫరా నిర్వహణ చట్టం (1981), ముఖ్య సర్వీసుల నిర్వహణ చట్టం, విదేశీ మారక ద్రవ్య రక్షణ చట్టం, దొంగ వ్యాపార కార్యకలాపాల నిరోధక చట్టం మొదలైనవి. జాతీయ భద్రతా చట్టం వల్ల జిల్లా మేజిస్ట్రేట్లకు, పోలీసు కమిషనర్లకు నిరోధక ఆజ్ఞలను జారీచేసే అధికారం లభించింది.



"ప్రాథమిక హక్కులు వ్యక్తి స్వేచ్ఛకు పట్టుగొమ్మలు. అవి ఒక ప్రవర్తనా నియమావళి, భారత ప్రజాస్వామ్యానికి జవసత్వాలను అందించే దృఢత్వానికి పునాదులు".

ఆదేశ సూత్రాలు

ఆదేశ సూత్రాలు భారత రాజ్యాంగ లక్షణాల్లో ముఖ్యమైనేవి. వాటిని భారత రాజ్యాంగ నిర్మాతలు ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. భారత రాజ్యాంగం నాలుగో భాగంలో 36 నుంచి 51 (ఎ) వరకూ ఉన్న ప్రకరణల్లో వాటిని పేర్కొన్నారు. అవి భారత రాజ్యాంగ ప్రవేశికలో ఉదహరించిన ఆశయాలను పోలి ఉంటాయనీ, ఆధునిక రాజ్యాంగంలోని పోకడలకు అవి నిదర్శనాలని బి.ఆర్.అంబేద్కర్ వర్ణించారు. అయితే భారత ప్రభుత్వ చట్టం, 1935లోని ఆజ్ఞలు కార్యనిర్వాహక శాఖకు ఉద్దేశించగా, ప్రస్తుత ఆదేశక సూత్రాలను కార్యనిర్వాహక, శాసన నిర్మాణ శాఖలు రెండింటికి నిర్దేశించిన ఆజ్ఞలుగా పరిగణించొచ్చు. భారత దేశంలో కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిలో పనిచేస్తున్న కార్యవర్గాలు, శాసనసభలు, స్థానిక సంస్థలన్నింటికీ అవి వర్తిస్తాయి. భారతీయులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరమైన స్వేచ్ఛా సాంత్రంత్ర్యాలను, న్యాయాన్ని అందించటానికి ఆదేశక సూత్రాలు దోహదపడతాయి.

ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలకు మధ్య తేడాలు

ప్రాథమిక హక్కులు	ఆదేశ సూత్రాలు
1.అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు	1.ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి గ్రహించారు.
2.3వ భాగంలో 12 నుంచి 35 వరకూ ప్రకరణల్లో పొందుపర్చబడ్డాయి	2.4వ భాగంలోని 36 నుంచి 51 వరకు గల ప్రకరణల్లో పొందుపర్చబడ్డాయి
3.వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఉద్దేశించినవి. అంటే వ్యక్తి ప్రాతిపదికన ఏర్పాటుచేశారు.	3.సమాజ సమిష్టి ప్రయోజనాలకు ఉద్దేశించబడ్డాయి
4.వ్యక్తి స్వేచ్ఛ, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని పెంపొందించటానికి	4.ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటానికి
5. ప్రధానంగా నకారాత్మక దృక్పథం కల్గివుంటాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయకూడని పనులు గురించి తెలియజేస్తాయి	5.ఇవి ప్రధానంగా నకారాత్మకమైనవి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేయాల్సిన పనులను తెలియజేస్తాయి
6.వీటి సంరక్షణ ఉన్నత న్యాయస్థానాలది.	6.వీటి అమలు బాధ్యత ప్రభుత్వాలపై ఆధారపడివుంటుంది
7.న్యాయ సంరక్షణ ఉంటుంది	7.న్యాయ సంరక్షణ లేదు
8.వీటి అమలు కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేయాల్సిన అవసరం లేదు	8.ప్రభుత్వాలు తప్పనిసరిగా చట్టాలు చేయాలి
9.జాతీయ అత్యవసర కాలంలోనే సస్పెండ్ చేయొచ్చు.	9.ఇవి ఎల్లప్పుడూ సుప్త చేతనావస్థలో ఉంటాయి
10. రాజ్యాంగ లక్ష్యాలను సాధించటానికి ఇవి సాధనాలుగా తోడ్పడతాయి	10.రాజ్యాంగ లక్ష్యాలను ఇవి తెలియజేస్తాయి
11.సర్వ కాలాల్లో, సర్వ వ్యవస్థల్లో అందుబాటులో ఉంటాయి.	11.ప్రభుత్వాల ఆర్థిక స్తోమతను అనుసరించి మాత్రమే అందుబాటులో ఉంటాయి.

రేపు : ప్రజ్ఞా - వికాసం

సంపాదకీయం

ట్రోలర్లపై చర్యలేవి?

విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రితో పాటు ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన ఆన్‌లైన్ దాడులు మన దేశ డిజిటల్ వాతావరణంలో పెరుగుతున్న ప్రమాదకర ధోరణికి నిదర్శనం. స్వాతి చతుర్వేది తన పుస్తకం 'ఐ యామ్ ఏ ట్రోల్' (నేనొక అంతర్జాల పోకిరిని)లో "భారతదేశంలో సోషల్ మీడియా మితవాద ట్రోలర్స్‌తో నిండిపోయింది. వారు ఆన్‌లైన్‌లో మత విద్వేషాన్ని రెచ్చగొడతారు, జర్నలిస్టులను, ప్రతిపక్ష రాజకీయ నాయకులను దుర్భాషలాడతారు, లైంగికంగా వేధిస్తారు.' అని పేర్కొన్నారు. ఈ విషపూరిత సంస్కృతి గతంలో ప్రముఖులను మాత్రమే లక్ష్యంగా చేసుకునేది. ఇప్పుడు వారి కుటుంబ సభ్యులను, అలాగే జాతీయ విషాద ఘటనల్లో బాధితుల కుటుంబాలను కూడా వదిలిపెట్టకపోవడం గమనార్హం. విదేశాంగ కార్యదర్శిగా ఉన్న విక్రమ్ మిస్రి పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాక్‌ల మధ్య కాల్పుల పర్వం ప్రారంభమైనప్పటి నుండి జరిగిన మీడియా సమావేశాల్లో మరో ఇద్దరు సైనికాధికారులతో కలిసి భారత ప్రభుత్వ వాణిని వినిపించేవారు. ఈ క్రమంలో భాగంగానే కాల్పుల విరమణ గురించి ప్రకటనను భారత ప్రభుత్వం తరపున ఆయన చేశారు. దీంతో ట్రోలర్స్ ఆయన్ను, ఆయన కుమార్తెను లక్ష్యంగా చేసుకున్నారు. రాయలేని భాషల్లో సోషల్ మీడియాలో దూషించారు. మిస్రి కుమార్తె వ్యక్తిగత వివరాలు బయటపెట్టడంతోపాటు, ఆమె దేశభక్తిని ప్రశ్నించారు. ఈ దాడితో వారు తమ సోషల్ మీడియా ఖాతాలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఈ వేధింపులు అధికారుల కుటుంబాలకూ పరిమితం కాదు.


ఉగ్రవాద దాడుల బాధిత కుటుంబాలు, ఇతర బాధితుల కుటుంబాలు కూడా ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులకు గురయ్యాయి. పహల్గాం ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాంషి నర్వాల్ కూడా ట్రోల్స్ బారిన పడ్డారు. ఈ సంఘటనలో కాశ్మీరీలను, ముస్లింలను లక్ష్యంగా చేసుకోవద్దని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరడమే ఆమె చేసిన నేరం! ఉగ్రవాదుల కాల్పుల్లో తండ్రిని కోల్పోయిన ఒక యువతి కాశ్మీర్‌లో తనకు ఇద్దరు సోదరులు లభించారంటూ చేసిన వ్యాఖ్యలు కూడా ట్రోలింగ్‌కు గురయ్యాయి. సమాజం నుండి మద్దతు, సానుభూతి లభించాల్సిన సమయంలో వీరంతా నిందలకు, వేధింపులకు గురికావడం బాధాకరం. గాయకుడు సోనూ నిగమ్, బాలీవుడ్ నటుటు భూమి పెడ్నేకర్, ఆలియా భట్ తదితరులు కూడా తదితరులు కూడా ఇటీవల ట్రోలింగ్ బారిన పడ్డారు.

అధికార పార్టీకి చెందిన మంత్రులపైనో, నాయకులపైనో సోషల్ మీడియాలో విమర్శలు పెట్టీ పెట్టగానే రకకరాల కేసులతో చెలరేగిపోయే ప్రభుత్వ యంత్రాంగం ఈ అన్ని సందర్భాల్లోనూ మౌనం వహించడం, నామమాత్రంగా కూడా స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

విదేశాంగశాఖ కార్యదర్శి మిస్రీ కుమార్తె గతంలో రోహింగ్యా శరణార్థుల కోసం పనిచేయడమే మితవాద ట్రోలర్స్ ఆగ్రహానికి కారణమని చెబుతున్నారు. ఈ కారణంగానే అత్యున్నత స్థాయి అధికారైనప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందన్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. అత్యున్నత స్థాయి వ్యక్తులకే ఈ పరిస్థితి తప్పనప్పుడు సామాన్యుల సంగతేమిటన్న ప్రశ్నకు జవాబు లభించడం కష్టం. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 2024లో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 66,854 సైబర్ వేధింపుల కేసులు నమోదయ్యాయి. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక కేసు నమోదైనట్లు చెబుతున్నారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా ఈ తరహా కేసులు భారీగా పెరిగే అవకాశముందని అంచనా!

'ట్రోలర్స్ యాదృచ్ఛిక వ్యక్తులు కారు. వీరిలో చాలామంది వ్యవస్థీకత డిజిటల్ ఆర్మీలో భాగంగా ఉంటారు. వారి ఆన్‌లైన్ దాడులకు ప్రోత్సాహం, కొందరికి బహుమతులు కూడా లభిస్తాయి," అని చతుర్వేది రాశారు. "ట్రోలింగ్ అనేది ఉద్దేశపూర్వకమైన, వ్యవస్థీకత చర్య. మౌనంగా ఉండేలా చేయడం, బెదిరించడం, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడం' వీరి లక్ష్యమని సుదీర్ఘ పరిశోధన తరువాత ఆమె నిర్ధారించారు. ఈ తరహా వైఖరి పౌర హక్కులకు, ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని కలుగ చేస్తుంది. వాటిని రక్షించుకోవడం ప్రజలందరి బాధ్యత. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కఠినచర్యలు తీసుకోవాలి. బాధితులకు, వారి కుటుంబాలకు అండగా నిలవాలి.

మంచి మాట



పెట్టుబడిదారీ వ్యవస్థలో నిరుద్యోగం అనేది ఏదో పొరపాటు విధానాల వల్ల రాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ కోసమే నిరుద్యోగం నిరంతరం పెంచి పోషించబడుతుంది. నిరుద్యోగ సైన్యం నిరంతరం సంసిద్ధంగా ఉంటేనే శ్రమ దోపిడీ యథేచ్ఛగా సాగుతుంది. అందుకే పెట్టుబడిదారీ విధానం ఉన్నంతకాలం నిరుద్యోగం ఉంటుంది.

- కారల్ మార్క్స్

Karl Marx

బిజెపి అండతో 'గాలి' అక్రమ మైనింగ్

విశ్లేషణ



వి. రాంభూపాల్

సహజ వనరులను దోచుకునే వారికి అధికారం తోడైతే చట్టాలను తుంగలో తొక్కి, వేల కోట్లకు ఎలా పడగలెత్తగలరనేందుకు సజీవ సాక్ష్యం గాలి జనార్ధనరెడ్డి జీవితం. అక్రమ మైనింగ్ ద్వారా కోట్లకు కోట్లను దోచుకొని, రాజకీయాలను అతి పెద్ద వ్యాపారంగా మార్చి, పెద్ద నోట్లతో ఓట్లను కొని, ప్రత్యర్థి పార్టీలను చిత్తు చేసి, బలంలేని పార్టీకి జవసత్వాలను కూర్చే ఆశ్రిత పెట్టుబడిదారులకు ప్రతిరూపం జనార్ధనరెడ్డి జీవితం. ఇంతింతై వటుడింతయై.. అన్నట్లు ఓ సాధారణ కుటుంబంలో పుట్టిన ఆయన రెండు దశాబ్దాలుగా కర్ణాటక రాజకీయాలను శాసించగలిగే శక్తిసంపన్నుడుగా ఎదిగాడు. నేడు దేశంలోని కార్పొరేట్ కంపెనీలు అడవులపై కన్నెందుకు వేశాయో, వేల మంది సైనికులు, పారా మిలిటరీ దేశ సరిహద్దులను వదలి అడవుల్లో ఎందుకు తిరుగుతున్నారో, తరతరాల కొండలు, గుట్టలు ఎందుకు చదునవుతున్నాయో, మైనింగ్ ఘనాపాటీలు భూగర్భాన్ని ఎందుకు ఛిద్రం చేస్తున్నారో, నేతల నీతిమాటలు ఎంతటి 'గాలి' కబుర్లో జనార్ధనరెడ్డి జీవితాన్ని చూస్తే అర్థమవుతుంది. అక్రమ సంపాదనకు రాజకీయాన్ని ఆయుధంగా ఉపయోగించుకున్న జనార్ధనరెడ్డి కర్ణాటక బిజెపి లో వుంటూ, ఆంధ్రలో కాంగ్రెస్ తో స్నేహం చేసి రెండు ప్రత్యర్థి పార్టీలకు ఎన్నికల బాండ్లు ఇచ్చే కంపెనీలకు 'నయా మోడల్'గా నిలిచాడు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో అక్రమ మైనింగ్ ద్వారా లక్షల కోట్ల టన్నుల ఐరన్ ఓర్‌ను లూటీ చేసి, వేల కోట్లను పోగేసుకున్న గాలి జనార్ధనరెడ్డిని 15 సంవత్సరాల పాటు విచారించిన సిబిఐ ప్రత్యేక కోర్టు ఎట్టకేలకు ఈ నెల 6న ఏడు సంవత్సరాల జైలు శిక్ష వేసింది. న్యాయమూర్తికి కాకపోయినా దేశాన్ని ఏలే వారికి తనను ఇంతకాలం బ్రోచిన వారికి తన విన్నపం వినపడుతుందని, కటాక్షం తప్పక వస్తుందనే నమ్మకంతో 'దైవ కార్యక్రమాలు చేసుకోవడానికి తనను విడుదల చేయమని' జనార్ధనరెడ్డి జడ్జీని కోరడం విశేషం.

చిత్తూరు జిల్లా నుండి బళ్ళారికి వలస వెళ్ళిన కుటుంబంలో పుట్టిన జనార్ధనరెడ్డి 21 సంవత్సరాల వయసులో 1989లో 'ఎన్నోబుల్ ఇండియా సేవింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్' అనే ఫైనాన్స్ కంపెనీని ఏడుగురు వాటాదారులతో కలిసి బళ్ళారిలో స్థాపించాడు. కర్ణాటకతో పాటు ఆంధ్ర, తమిళనాడు లలో 125 శాఖలు ఏర్పాటు చేసి బళ్ళారి, కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల నుండి రూ.300 కోట్ల డిపాజిట్లు సేకరించాడు. 'ఎన్నోబుల్ ఇండియా' అనే పేరుతో మొదట్లో వారపత్రిక, ఆ తర్వాత దినపత్రికను నడిపాడు. ఫైనాన్స్ కంపెనీ నిర్వహణలో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో 1998 అక్టోబర్ 5న రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిట్ల సేకరణను నిలిపివేసి,



ఆ తర్వాత మూసివేసింది. దీంతో వేలాది మంది డిపాజిటర్లు నష్టపోయారు. ఆ తర్వాత కొద్ది రోజులకే తన సోదరులైన కరుణాకర్ రెడ్డి (ఈయన తర్వాతి కాలంలో బిజెపి మంత్రి అయ్యారు), సోమశేఖర రెడ్డిలతో కలిసి జనార్ధనరెడ్డి చిట్‌ఫండ్ కంపెనీ ప్రారంభించాడు. ఈ క్రమంలో ఆంధ్ర సరిహద్దు డి.హీరేహాళ్ మండలంలోని భూముల్లో విలువైన ఇనుప ఖనిజం (ఐరన్ ఓర్) వున్నట్లు పరిశోధనల్లో తేలింది. రాజకీయ అండదండలు లేకుండా మైనింగ్ వ్యాపారంలో రాణించలేమని గుర్తించిన గాలి సోదరులకు 1999లో బళ్ళారి పార్లమెంట్ ఉప ఎన్నిక కలిసి వచ్చింది. ఈ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ పోటీ చేశారు. అప్పటికి బళ్ళారిలో ఏ మాత్రం బలంలేని బిజెపి సుష్మా స్వరాజ్‌ను తన అభ్యర్థిగా దింపింది. గాలి జనార్ధనరెడ్డి వెంటనే బిజెపిలో చేరి మొత్తం ప్రచార భారాన్ని మోసి, ఆ పార్టీ అగ్ర నాయకుల దృష్టిని ఆకర్షించాడు. అప్పటికే ఆయన ఫైనాన్స్ కంపెనీల చరిత్ర తెలిసినా బిజెపి చేరదీసింది. డిపాజిటర్లను దివాళా తీయించి పోగేసుకున్న డబ్బుతో 2001 అక్టోబరు 29న ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఒ.ఎం.సి)ని స్థాపించి మైనింగ్ వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. తన మైనింగ్ సామ్రాజ్యాన్ని విస్తరించడానికిగాను అతనికి బిజెపి, రాష్ట్రంలో బలపడేందుకు ఆ పార్టీకి జనార్ధనరెడ్డి లాంటి ఆర్థిక శక్తివంతులు కావలసి వచ్చింది. వీరి బంధం దినదిన ప్రవర్ధమానమై ఇప్పటికీ కొనసాగుతున్నది. అప్పట్లో సుష్మా స్వరాజ్ తరచూ బళ్ళారికి రావడం, తమ పార్టీ కార్యక్రమాలకు కేంద్రంగా జనార్ధనరెడ్డి ఇంటిని మార్చుకోవడంపై అనేక వార్తలు వచ్చేవి.

> **అక్రమ సంపాదనకు రాజకీయాన్ని ఆయుధంగా ఉపయోగించుకున్న జనార్ధనరెడ్డి కర్ణాటక బిజెపి లో వుంటూ, ఆంధ్రలో కాంగ్రెస్ తో స్నేహం చేసి రెండు ప్రత్యర్థి పార్టీలకు ఎన్నికల బాండ్లు ఇచ్చే కంపెనీలకు 'నయా మోడల్'గా నిలిచాడు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో అక్రమ మైనింగ్ ద్వారా లక్షల కోట్ల టన్నుల ఐరన్ ఓర్‌ను లూటీ చేసి, వేల కోట్లను పోగేసుకున్న గాలి జనార్ధనరెడ్డిని 15 సంవత్సరాల పాటు విచారించిన సిబిఐ ప్రత్యేక కోర్టు ఎట్టకేలకు ఈ నెల 6న ఏడు సంవత్సరాల జైలు శిక్ష వేసింది.**

జనార్ధనరెడ్డి, బిజెపి పరస్పరం లాభపడుతూ కర్ణాటక రాజకీయాలను, మైనింగ్ అక్రమాల చరిత్రను తిరగరాశారు. ఒకవైపు 2001-02లో కేవలం పది లక్షల పెట్టుబడితో ప్రారంభమైన గాలి జనార్ధనరెడ్డి మైనింగ్ వ్యాపారం ఏడు సంవత్సరాల్లో మూడు వేల కోట్ల అక్రమ మైనింగ్ చేయగలిగే స్థాయికి చేరింది. మరోవైపు 1989లో కేవలం నాలుగు అసెంబ్లీ స్థానాలున్న బిజెపి 2004 నాటికి జనతాదళ్ సెక్యులర్ పార్టీతో కలిసి 79 సీట్లను సాధించి మొట్టమొదటిసారి దక్షిణ భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామి అయ్యింది. ఈ విజయానికి ప్రతిఫలంగా 2006లో బిజెపి గాలి జనార్ధనరెడ్డిని ఎమ్మెల్సీగా ఎన్నిక చేసింది. ఈ పదవిని ఆసరా చేసుకుని ఓబుళాపురం మైనింగ్‌లో భారీ అక్రమాలకు పాల్పడుతూ, బిజెపి ఎదుగుదలకు తోడ్పడ్డాడు. ఓబుళాపురం గనులు ఆంధ్ర సరిహద్దులో వుండడంతో కర్ణాటకలో బిజెపితో వుంటూనే, ఆంధ్రలో కాంగ్రెస్‌తో చెలిమి చేశాడు. డి.హీరేహాళ్ మండలంలో మొత్తం ఆరు గనులు వుండగా వాటిలో ఐదింటిని జనార్ధనరెడ్డి ఒ.ఎం.సి తన ఆధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని ఆధిక్యాన్ని పొందింది. బళ్ళారి ఐరన్ ఓర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 27.12 హెక్టార్లు, ఒ.ఎం.సి-1కి 25.98, అంతరగంగమ్మ కొండలో ఒ.ఎం.సి-2కి 68.5, ఒ.ఎం.సి-3కి 39.5, అనంతపురం మైనింగ్‌కు 6.5, వై.మహాబళేశ్వరప్ప అండ్ సన్స్‌కు 20.24 హెక్టార్ల భూమిని కేటాయించారు. వీటిలో బళ్ళారి ఐరన్ ఓర్ ప్రైవేట్ లిమిటెడ్ తప్ప మిగిలినవన్నీ గాలి జనార్ధనరెడ్డివే. ఇంత భూమిని ఆయనకు కేటాయించడంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ గనులశాఖ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్ చట్టవిరుద్ధంగా వ్యవహరించినట్లు సిబిఐ రుజువు చేసింది. ప్రస్తుతం శిక్ష పడింది. రాజగోపాల్‌కు ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అండదండలు వున్నాయనే ఆరోపణలు వున్నాయి. లీజుకు తీసుకున్న ఈ భూమిలో

> **ఒకవైపు తాను ఎదుగుతూ మరోవైపు బిజెపి ఎదిగేలా చేశాడు. 2008లో ఆ పార్టీ 110 సీట్లు గెలిచి అధికారానికి ఐదుగురు ఎమ్మెల్యేలు అవసరమైనప్పుడూ వారిని సమకూర్చడంలో జనార్ధనరెడ్డి కీలక పాత్ర పోషించాడు. ఆయన చేసిన 'సేవ'కు ప్రతిఫలంగా పర్యాటక, మౌలిక సదుపాయాల మంత్రి పదవిని బిజెపి కట్టబెట్టింది. 2006 నాటికే గాలి జనార్ధనరెడ్డిపై రెండు అక్రమ మైనింగ్ కేసులు నమోదైనప్పటికీ ఆయనకు ఈ పదవి దక్కింది. బిజెపి అండదండలతో ఆయన మరింత రెచ్చిపోయాడు. అటవీ ప్రాంతంలో ఇష్టానుసారంగా మైనింగ్ చేశాడు. పురాతన సుంకులమ్మ దేవాలయాన్ని కూల్చివేశాడు. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా ఆపగలిగాడు. ఓబుళాపురం నుండి కృష్ణపట్నం ఓడరేవుకు ప్రతిరోజు వందలాది లారీల్లో ఐరన్ ఓర్ సరఫరా చేశాడు.**

40,367 టన్నుల ఖనిజం మాత్రమే తవ్వినట్లు రికార్డు అయ్యింది. కాని 197 లక్షల టన్నుల ఖనిజాన్ని అక్రమంగా ఎగుమతి చేసినట్లు సిబిఐ నిర్ధారించింది. లీజుకు తీసుకున్న భూమి కంటే అనేక రెట్లు అక్రమంగా తవ్వకాలు జరిపాడు. అంతేకాకుండా బళ్ళారి ఐరన్ ఓర్ గనుల్లోకి అక్రమంగా చొరబడి రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల ఖనిజాన్ని తవ్వి తరలించుకుపోయాడు. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడడానికి రాజకీయాల్లో తనకున్న పలుకుబడిని ఉపయోగించుకున్నాడు. ఈ డబ్బుతో రాజకీయాల్లో బలపడ్డాడు.

ఒకవైపు తాను ఎదుగుతూ మరోవైపు బిజెపి ఎదిగేలా చేశాడు. 2008లో ఆ పార్టీ 110 సీట్లు గెలిచి అధికారానికి ఐదుగురు ఎమ్మెల్యేలు అవసరమైనప్పుడూ వారిని సమకూర్చడంలో జనార్ధనరెడ్డి కీలక పాత్ర పోషించాడు. ఆయన చేసిన 'సేవ'కు ప్రతిఫలంగా పర్యాటక, మౌలిక సదుపాయాల మంత్రి పదవిని బిజెపి కట్టబెట్టింది. 2006 నాటికే గాలి జనార్ధనరెడ్డిపై రెండు అక్రమ మైనింగ్ కేసులు నమోదైనప్పటికీ ఆయనకు ఈ పదవి దక్కింది. బిజెపి అండదండలతో ఆయన మరింత రెచ్చిపోయాడు. అటవీ ప్రాంతంలో ఇష్టానుసారంగా మైనింగ్ చేశాడు. పురాతన సుంకులమ్మ దేవాలయాన్ని కూల్చివేశాడు. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా ఆపగలిగాడు. ఓబుళాపురం నుండి కృష్ణపట్నం ఓడరేవుకు ప్రతిరోజు వందలాది లారీల్లో ఐరన్ ఓర్ సరఫరా చేశాడు. వందల కిలోమీటర్ల రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నా, ఈ లారీల ప్రమాదాల్లో అనేకమంది చనిపోతున్నా, రోడ్డు పక్కనున్న గ్రామాల ప్రజలు దుమ్ముధూళితో జబ్బుల బారిన పడుతున్నా పాలకులకు, అధికారులకు ఏ మాత్రం పట్టలేదు. అక్రమ సంపదను సక్రమం చేసుకునేందుకు అనేక డొల్ల కంపెనీలను సృష్టించిన ఆదాయ శాఖ వారికి కనిపించలేదు. తన అనుచరులను బినామీలుగా చేసుకుని స్థిరాస్తులను సంపాదించుకుంటున్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ వారికి తెలియలేదు. బంగారపు సింహాసనం, కిరీటం, పళ్లెం, బెల్టు, బాత్‌రూం కమోడ్‌తో సహా అనేకం చేయించుకుని అన్ని రకాల స్వర్గసుఖాలను అనుభవించాడు. అసెంబ్లీకి స్వంత హెలికాప్టర్‌లో వెళ్ళి ఆశ్రిత పెట్టుబడిదారులకు 'నయా మోడల్'గా నిలిచాడు. తిరుపతి వెంకటేశ్వరునికి వజ్రాలు పొదిగిన కిరీటాన్ని బహూకరించినా, కూతురు పెళ్లికి కోట్లు ఖర్చు చేస్తున్నా ఏ శాఖలో కనీస చలనం లేకపోవడానికి కారణం ఆయన బిజెపి వాషింగ్ మిషన్‌లో మునిగితేలుతుండడమే.

2009లో ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమాలు, రాష్ట్ర సరిహద్దుల మార్పులపై అనంతపురానికి చెందిన టపాల్ గణేశ్ అనే వ్యక్తి కేంద్రానికి ఫిర్యాదు చేయడంతో సర్వే ఆఫ్ ఇండియాతో మైనింగ్ ప్రాంతాన్ని సర్వే చేయించాలని, మైనింగ్ ఆపాలని నిర్ణయించింది. ఈ అక్రమాలపై సిబిఐతో విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో 2011 సెప్టెంబర్ 5న జనార్ధనరెడ్డి అరెస్టయ్యాడు. ఈ కేసులో బెయిల్ పొందేందుకు సిబిఐ న్యాయమూర్తికి రూ.5 కోట్లు లంచం ఇవ్వడానికి సిద్ధపడ్డాడని ఆరోపణ. మాజీ న్యాయమూర్తి చలపతిరావు సహకారంతో అప్పటి జడ్జి పట్టాభి రామారావు కుమారుడు రవి ద్వారా ఈ మొత్తాన్ని చేర్చేందుకు బళ్ళారి నుండి సంచుల్లో ఈ డబ్బును తరలించినట్లు సిబిఐ రుజువు చేసింది. తాను జైల్లో వున్నప్పుడు తన రాజకీయ పలుకుబడిని చాటుకునేందుకు తన సహచరుడు బి. శ్రీరాములును బిజెపి కి రాజీనామా చేయించి 'బదవర శ్రమికర రైతర కాంగ్రెస్' పార్టీని స్థాపించేటట్లు చేశాడు. 2014లో ఈ పార్టీని తిరిగి బిజెపి లో విలీనం చేయడం, 2015లో జనార్ధనరెడ్డి బెయిల్‌పై విడుదల కావడం జరిగింది. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనకు తగినన్ని సీట్లు ఇవ్వకపోవడంతో జనార్ధనరెడ్డి 'కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష' (క.ఆర్.పి.పి) పేరుతో స్వంత పార్టీని పెట్టి బళ్ళారి సమీపంలోని గంగావతిలో పోటీ చేసి గెలిచాడు. 2024 పార్లమెంట్ ఎన్నికల ముందు ఈ పార్టీని బిజెపిలో విలీనం చేసి మరోసారి కమల తీర్థం పుచ్చుకున్నాడు.

నాకు ఇంత, నీకు ఇంత అనే ఆశ్రిత పెట్టుబడిదారీ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం కర్ణాటకలో బిజెపి, గాలి జనార్ధనరెడ్డి బంధం. మాటల్లో నిత్యం నీతులు చెబుతూ, ఎదుటివారిని దేశద్రోహులుగా, విలువలు లేని వ్యక్తులుగా చిత్రీకరించే అధికార పార్టీ అనుచర మీడియాకు ఈ జుగుప్సాకరమైన పనులు కనిపించకపోవచ్చు, కానీ ప్రజలు వీటిని గుర్తిస్తారు. సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారు.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

ఇది పొల్లాచి బాధితుల విజయం

వ్యాఖ్య



డి. రమాదేవి

పొల్లాచి సామూహిక అత్యాచార ఘటన తమిళనాడులో 2019లో వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో చోటుచేసుకున్న దుర్మార్గం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. బాధితలకు న్యాయం జరగాలంటూ ఉద్యమాలు పెద్ద ఎత్తున జరిగాయి. న్యాయం కోసం చేసిన పోరాటంలో 'ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్' (ఐద్వా) కీలక పాత్ర పోషించింది. ఈ నెల 13న మహిళా న్యాయస్థానం నిందితులకు జీవితకాల శిక్ష విధించడం కొంత ఉపశమనంగా భావించవచ్చు.

ఏం జరిగింది?

2016 నుండి 2018 మధ్య కాలంలో, ఈ గ్యాంగ్ అనేక మంది యువతులను లక్ష్యంగా చేసుకుంది. వారిని మోసం చేసి, లైంగికంగా వేధించారు. ఆ దృశ్యాలను వీడియోలు తీసి, వాటిని ఉపయోగించి బ్లాక్‌మెయిల్ చేశారు. అయితే 2019 ఫిబ్రవరిలో పందొమ్మిదేళ్ల విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు విచారణలో దిగ్భ్రాంతికరమైన వివరాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు నిందితుల ఫోన్లలో అనేక వీడియోలు గుర్తించారు. వీటి ద్వారా అనేక మంది బాధితులు ఉన్నట్లుగా రుజువులు లభించాయి.

న్యాయం కోసం...

ఈ ఘటనపై తమిళనాడులో విద్యార్థులు, మహిళా సంఘాలు, రాజకీయ పార్టీల సభ్యులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఐద్వా రాష్ట్ర కమిటీ అందరినీ కలుపుకుని ఉద్యమించడంలో చొరవ తీసుకుంది. చెన్నై, కోయంబత్తూరు, తిరుప్పూర్, వెల్లూరు వంటి నగరాల్లో విద్యార్థులు తరగతులు బహిష్కరించి ర్యాలీలు నిర్వహించారు. ద్రవిడ మున్నేట్ర కజగం, స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తదితర రాజకీయ, సామాజిక సంస్థలు కూడా ఈ నిరసనల్లో పాల్గొన్నాయి. ఈ నిరసనల నేపథ్యంలో, తమిళనాడు ప్రభుత్వం కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కు బదిలీ చేసింది.

పోలీసు-న్యాయ విచారణ

పోలీసులు మొదట నలుగురిని అరెస్టు చేశారు. తర్వాత, సిబిఐ విచారణలో మరికొందరు అరెస్టయ్యారు. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులు ఉన్నారు. వారు క్రిమినల్ కుట్ర, లైంగిక వేధింపులు, అత్యాచారం, సామూహిక అత్యాచారం, బ్లాక్‌మెయిల్ వంటి నేరాల్లో దోషులుగా తేల్చబడ్డారు.

ఎట్టకేలకు తీర్పు

కోయంబత్తూరులోని మహిళా కోర్టు న్యాయమూర్తి ఆర్.నందిని దేవి 2025 మే 13న తొమ్మిది మంది నిందితులకు జీవితకాల శిక్ష విధించారు. అలాగే, బాధితులకు రూ.85 లక్షల పరిహారం చెల్లించాలంటూ తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ తీర్పు మహిళలపై జరిగే నేరాలకు వ్యతిరేకంగా న్యాయవ్యవస్థ తీసుకున్న కఠిన చర్యగా భావించబడుతోంది.

రాజకీయ ప్రభావం

ఈ కేసు 2019 సాధారణ ఎన్నికల ముందు వెలుగులోకి రావడంతో, తమిళనాడులో అధికారంలో ఉన్న అన్నాడిఎంకె పై తీవ్ర విమర్శలు వచ్చాయి. కేసుకు సంబంధించి నిందితులతో పార్టీకి సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, పార్టీ ఒక సభ్యుడిని పార్టీ నుండి బహిష్కరించింది. అదేవిధంగా బాధితుల వివరాలు లీక్ చేశారన్న విమర్శలు పోలీసులపైన వచ్చాయి. ఈ కేసు భారతదేశంలో మహిళల భద్రత, న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడంలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ ఘటనపై ఐద్వా సభ్యులు తీవ్రంగా స్పందించి, బాధితుల పక్షాన న్యాయం సాధించేందుకు అనేక చర్యలు చేపట్టారు.

ఐద్వా పాత్ర

ఐద్వా సభ్యులు తమిళనాడులో వివిధ ప్రాంతాల్లో నిరసనలు నిర్వహించారు. వారు విద్యార్థి సంఘాలు, ఇతర మహిళా సంఘాలతో కలిసి, బాధితులకు న్యాయం కోరుతూ ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. పోలీసులు బాధితురాలి వ్యక్తిగత వివరాలను మీడియాకు వెల్లడించిన ఘటనపై తీవ్రంగా స్పందించారు. దీనివల్ల ఇతర బాధితులు ముందుకు రావడాన్ని నిరుత్సాహపరిచే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఐద్వా సభ్యులు, ముఖ్యంగా ఐద్వా కోయంబత్తూరు జిల్లా కార్యదర్శి రాధికా మురుగన్ ఈ కేసులో పోలీసుల వైఫల్యాలను, రాజకీయ ప్రభావాలను వెలుగులోకి తెచ్చారు. కేసును సిబిఐకి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కేసులో ప్రధాన నిందితులుగా భావించిన వ్యక్తులపై ఐద్వా పోలీసులకు ఫిర్యాదులు సమర్పించింది. అయితే, పోలీసులు ఆ సమయంలో చర్యలు తీసుకోకపోవడం వల్ల, సిబిఐ విచారణలోనే వారు అరెస్టయ్యారు. మహిళలపై జరిగే లైంగిక దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, బాధితలకు అండగా ఐద్వా చేస్తున్న న్యాయ పోరాటానికి ఇది ఒక ఉదాహరణగా నిలిచింది.

> **ఈ కేసులో చోటుచేసుకున్న దుర్మార్గం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. బాధితలకు న్యాయం జరగాలంటూ ఉద్యమాలు పెద్ద ఎత్తున జరిగాయి. న్యాయం కోసం చేసిన పోరాటంలో 'ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్' (ఐద్వా) కీలక పాత్ర పోషించింది. ఈ నెల 13న మహిళా న్యాయస్థానం నిందితులకు జీవితకాల శిక్ష విధించడం కొంత ఉపశమనంగా భావించవచ్చు.**

పోలీసుల వైఫల్యాలు

మహిళా పోలీసు అధికారిణి ద్వారా బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సిన నిబంధనను పోలీసులు ఉల్లంఘించారు. పురుష పోలీసు అధికారి రికార్డు చేశారు. ఇది 2018లో సవరణ చేసిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు వ్యతిరేకం. పోలీసులు బాధితురాలి పేరు, చిరునామా వంటి వ్యక్తిగత వివరాలను మీడియాకు వెల్లడించడం ద్వారా, ఇతర బాధితులు ముందుకు



రావడాన్ని నిరుత్సాహపరిచారు. గత మూడు సంవత్సరాల్లో పొల్లాచిలో 58 మంది యువతులు ఆత్మహత్య చేసుకున్నారని, వీరిలో చాలామంది సదరు గ్యాంగ్ బ్లాక్‌మెయిల్‌కు గురయ్యారని అభియోగం ఉంది. అయినప్పటికీ పోలీసులు ఈ ఆత్మహత్యలపై సరైన దర్యాప్తు జరపలేదు.

రాజకీయ ప్రభావాలను బహిర్గతం చేయడం

కేసులో ఎఐఎడిఎంకె పార్టీకి చెందిన కొంతమంది నిందితులుగా ఉన్నారు. ఉదాహరణకు, 'బార్' నాగరాజ్ అనే వ్యక్తి, బాధితురాలి సోదరుడిపై దాడి చేసిన కేసులో అరెస్టయ్యారు. అయితే, పోలీసులు అతనిపై లైంగిక దౌర్జన్యం ఆరోపణలు నమోదు చేయకపోవడం, అతను రాజకీయ సంబంధాల వల్ల రక్షణ పొందుతున్నాడన్నది సూచిస్తుంది. కేసులో రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని, పోలీసులు ఈ అంశాలను దర్యాప్తు చేయడంలో విఫలమయ్యారన్నది ఆరోపణ. అయితే, పోలీసులు ఈ ఆరోపణలను ఖండించారు. ప్రధాన నిందితులపై సాక్ష్యాధారాలను సమర్పించడంలో ఐద్వా కీలక పాత్ర పోషించింది. కేసు విచారణలో, 48 మంది సాక్షులను విచారించగా, ఎవరూ కూడా తమ స్టేట్‌మెంట్‌ను మార్చలేదు. ఇది బాధితులకు న్యాయం సాధించడంలో కీలకంగా నిలిచింది.

ఈ కేసులో, నిందితులపై ఐపిసి సెక్షన్ 376 (డి) (సామూహిక అత్యాచారం), 376(2)(ఎన్) (అదే మహిళపై పలుసార్లు అత్యాచారానికి పాల్పడడం) కింద ఆరోపణలు నమోదయ్యాయి. ఇందుకుగాను వారు కనీసం 20 సంవత్సరాల శిక్ష, జీవితకాల శిక్షకు అర్హులు.

ఈ తొమ్మిది మంది నిందితులకు జీవితకాల శిక్ష విధింపు బాధితల పోరాట ఫలితమే.

/ వ్యాసకర్త 'ఐద్వా' రాష్ట్ర కార్యదర్శి /

జనవాక్యం

కుటుంబ శ్రేయస్సే దేశ ఉషస్సు

(15 మే 'అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం')

నిస్వార్థ ప్రేమలకు చిరునామాలు కుటుంబాలు. మనల్ని వరించిన అపూర్వ వరం కుటుంబ ప్రేమ. మూడు, నాలుగు తరాల ప్రేమానురాగాల సమ్మేళనమే ఓ ఆదర్శ కుటుంబం. కుటుంబ వాతావరణమే పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇంధనం. కుటుంబ సహకారం లేకుండా ఏ విజయం కూడా పరిపూర్ణం కాదు. పౌర సమాజ వృక్షానికి వివిధ దిశల్లో విస్తరించిన కొమ్మలు, శాఖలే కుటుంబాలని తెలుసుకోవాలి. మన ఆశ, శ్వాస, ఉనికి, ఊపిరి కుటుంబమే. మన జీవిత ప్రారంభం, అనంత ఆనందాల దేవాలయం కుటుంబమే అని తెలుసుకొని కుటుంబ పునాదులను పటిష్ట పరుచుకుందాం, బాధ్యత కలిగిన రేపటి తరాన్ని బహూకరిద్దాం. ప్రేమల పునాదుల మీద నిర్మితమైన ఆదర్శ కుటుంబాలు 'గృహమే కదా స్వర్గ సీమ' అయితే, 'దేశమే సౌభాగ్యాల కోవెల'గా మారుతుంది.

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

రాష్ట్రపతితో సైనికాధికారుల భేటీ

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ గురించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సైనికాధికారులు వివరించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనీల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులతో కలిసి బుధవారం రాష్ట్రపతితో భేటీ అయ్యారు. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళ సిబ్బంది చీఫ్ ఎయిర్‌చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్, నావికా బలగాల అధిపతి ఆడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠిలతో కలిసి జనరల్ అనీల్ చౌహాన్ రాష్ట్రపతికి మిలటరీ అపరేషన్ల గురించి వివరించారని రాష్ట్రపతి భవన్ ఎక్స్ పోస్టులో పేర్కొంది. సాయుధ బలగాల అంకిత భావం, నిబద్ధతలను రాష్ట్రపతి ప్రశంసించారని వివరించింది.

సంగం డెయిరీని సందర్శించిన కెన్యా బృందం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలోని సంగం డెయిరీని కెన్యా దేశ గవర్నర్ విల్బెర్‌తో కూడిన అధికార బృందం బుధవారం సందర్శించింది. పాలు, పాల ఉత్పత్తుల తయారీలో టెక్నాలజీని పరిశీలించింది. కెన్యా దేశ గవర్నర్ విల్బెర్, కెన్యా హెల్త్ కమిటీ చైర్మన్ ఫ్రెడిక్, అసెంబ్లీ ఎంసిఎ పౌల్ టిర్ర, హెల్త్ సర్వీసెస్ ముఖ్య అధికారి డాక్టర్ మేరీ సుసాన్, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిస్టోఫర్, బయోమెడికల్ ఆఫీసర్ ఎలిజబెత్, వెలాసిటీ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ డైరెక్టర్ హరిమూర్తి, ప్రెస్ యూనిట్ డైరెక్టర్ ఫ్రాన్సిస్తోలు డెయిరీలో కలియతిరిగారు. సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ వారికి డెయిరీ విశిష్టతను వివరించారు. సంగం డెయిరీకి



కెన్యా బృందానికి సంగం డెయిరీ గురించి వివరిస్తున్న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో 6,799 గ్రామ స్థాయి సొసైటీలు ఉన్నాయని తెలిపారు. వాటి ద్వారా షుమారు 1.50 లక్షల మంది పాల ఉత్పత్తిదారులు డెయిరీకి పాలు సరఫరా చేస్తున్నారని వివరించారు. పరిశ్రమలో పాలను సేకరించే, నిలువ చేసి, వాటి అనుబంధ ప్రొడక్ట్స్ తయారు చేసే విధానంపై వారికి నరేంద్ర వివరించారు. తమ దేశంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో డెయిరీలు నడుస్తున్నాయని కెన్యా గవర్నర్ విల్బెర్ తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి, రైతులకు ఆదాయం సమకూరుతోందన్నారు. విజిటర్స్ బుక్‌లో సంగం డెయిరీ పరిశ్రమలో తన అనుభవాలను ప్రత్యేకంగా రాసి ధన్యవాదాలు తెలిపారు. కెన్యా బృందాన్ని దుశ్శాలువాలతో కప్పి మెమొంటోలతో నరేంద్ర సత్కరించారు. సంగం డెయిరీ ఎండి. గోపాలకృష్ణన్, అధికారులు పాల్గొన్నారు.

వీరయ్యచౌదరి హత్య కేసులో తొమ్మిది మంది అరెస్టు

ప్రజాశక్తి - ఒంగోలు బ్యూరో

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన కుట్రదారులను, నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను మీడియా సమావేశంలో ఎస్‌పి దామోదర్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాజకీయంగా, వ్యాపారంగా వీరయ్యకు, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన సాంబయ్యకు విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో సాంబయ్య తన మేనల్లుడు ముప్పా సురేష్ ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. వీరికి వినోద్ కూడా తోడయ్యారు. గ్రామంలో వీరయ్యతో పేచీలు పెరిగిన నేపథ్యంలో భవిష్యత్‌లో తన మేనల్లుడు ముప్పా సురేష్‌కు రాజకీయంగా భవిష్యత్ ఉండదని భావించి వీరయ్యను అంతమొందించేందుకు సాంబయ్య కుట్ర పన్నారు. నెల్లూరుకు చెందిన నలుగురిని హత్యకు పురమాయించారు. గత నెల 22న పథకం ప్రకారం నలుగురు కలిసి వీరయ్య ఆఫీసులోకి వెళ్లి దారుణంగా హతమార్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు. వీరయ్యకు రాజకీయంగా వ్యతిరేకంగా ఉన్నవారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా అసలు విషయం బయటపడింది. వీరయ్య హత్య కేసులో ఒంగోలుకు చెందిన బోర్లగుంట వినోద్ కుమార్, నెల్లూరుకు చెందిన తువ్వర వంశీ, బెల్లంకొండ వెంకటగౌతం, మన్నంతేజ, ఒంగోలుకు చెందిన మార్టూరి కిరణ్‌కుమార్, చీమకుర్తికి చెందిన షేక్ సమీర్, అమ్మనబ్రోలుకు చెందిన ఆళ్ల సాంబయ్య, వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి, నాగులుప్పలపాడు మండలం దాసరివారిపాలెంకు చెందిన తోట శ్రీనివాసరావును అరెస్టు చేశారు. ముప్పా సురేష్, ఓబిలినాగరాజు, గోళ్ల రుష్యేంద్రబాబు పరారీలో ఉన్నట్లు ఎస్‌పి తెలిపారు.

హామీలు అమలు చేయకుంటే ఉద్యమాలు

- కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూ యజమాని సంతకం లేకుండా సిసిఆర్‌సి కార్డులు ఇస్తామని, కులాలతో సంబంధం లేకుండా అందరికీ పెట్టుబడి సహాయం అందిస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీని ఎందుకు అమలు చేయడం లేదని కౌలు రైతు సంఘం ప్రశ్నించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీ సాక్షిగా పాత చట్టాన్ని రద్దు చేస్తున్నామని, వ్యవసాయ బడ్జెట్‌లో మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారన్నారు. ఈ మేరకు బుధవారం కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే కౌలు గుర్తింపు కార్డుల జారీలో వైఖరి చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలురైతులు ఉండగా, కేవలం 10 లక్షల మందికి గుర్తింపు కార్డులు ఇవ్వడానికి కోటా ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాత చట్టాన్ని సవరించి, భూ యజమాని సంతకం తొలగించి గ్రామ సభల ద్వారా గుర్తింపు కార్డులిచ్చి తమ చిత్తశుద్ధిని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో కౌలు రైతులు చేసే ఉద్యమాలకు ప్రభుత్వం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

దసరాలోపు చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే దసరాలోగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. చేనేతలకు త్వరలోనే ఆరోగ్య బీమాను అమలు చేస్తామన్నారు. చేనేత దుస్తుల అమ్మకాలు పెంచేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విజయవాడలోని ఒక ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో నేత కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

నేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా ఆరు నెలలకోసారి కొనుగోలు చేస్తున్న దుస్తులను ఇకపై మూడు నెలలకోసారి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. బకాయిలను విడతల వారీ చెల్లిస్తామన్నారు. వర్క్ షెడ్లు ఏర్పాటుకు చేయూతనందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత దుస్తులు తప్పనిసరిగా ధరించేలా పిలుపునివ్వనున్నట్లు పేర్కొన్నారు. చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ప్రదర్శనను మంత్రి, ఇతర ప్రముఖులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ కమిషనర్ రేఖారాణి, సెర్ప్ సిఇఒ కరుణ, ఆప్కో విసి, ఎమ్‌డి ఎం విశ్వ, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ అబద్దయ్య, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కోకు పరికరాల సరఫరా వేగవంతం

- బిహెచ్‌ఇఎల్ చర్యలు తీసుకోవాలి
- సమీక్షలో సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జెన్‌కో కీలక విద్యుత్ ప్రాజెక్టులు నిర్ణిత సమయానికి పూర్తి చేసేందుకు కావాల్సిన ఎలక్ట్రికల్, మెకానికల్ పరికరాల సరఫరాను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ కోరారు. విజయానంద్ అధ్యక్షతన ఎపిజెన్‌కో-బిహెచ్‌ఇఎల్‌ల సమీక్షా సమావేశం సచివాలయంలో బుధవారం జరిగింది. పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు, లోయర్ సీలేరు అదనపు యూనిట్ల కోసం ఎలక్ట్రికల్, మెకానికల్ పరికరాలను వీలైనంత త్వరగా సరఫరా చేయాలని బిహెచ్‌ఇఎల్‌ను విజయానంద్ కోరారు.

ఈ ప్రాజెక్టులను పూర్తిచేయడానికి నిర్ణీత వ్యవధిలో చర్యలు తీసుకోవాలన్నారు. పరికరాల సరఫరా షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించి సకాలంలో పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటామని బిహెచ్‌ఇఎల్ హామీ ఇచ్చిందని చెప్పారు. ఎన్‌టిటిపిఎస్ స్టేజ్-5లో రోటర్ వైఫల్యాల కారణాలను పరిశీలించి సమస్యను త్వరగా పరిష్కరించేందుకూ అంగీకరించిందని తెలిపారు. దామోదర సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని బిహెచ్‌ఇఎల్ హామీ ఇచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టులను నిర్దిష్ట సమయానికి పూర్తి చేసేందుకు కృత నిశ్చయంతో ఉందన్నారు. వీటి వల్ల రాష్ట్ర విద్యుత్ మౌలిక సదుపాయాలు బలపడటమే కాకుండా రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు.

జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ.. 12 పెద్ద కప్లాన్ టర్బైన్ యూనిట్లతో అధిక ప్రవాహం నియంత్రణ సామర్థ్యం కలిగిన హైడ్రో పవర్ ప్రాజెక్టుగా పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు దేశంలో మొట్టమొదటి ఘనతను సాధించిందని అన్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రోజే 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసి సుమారు 23 మిలియన్ యూనిట్లు సరఫరా చేయగలదని చెప్పారు. లోయర్ సీలేరు విస్తరణ ప్రాజెక్టు ప్రస్తుత పవర్ హౌస్ సామర్థ్యాన్ని పెంచేందుకు రూపొందించబడిందన్నారు. ఇప్పటికే ఉన్న నాలుగు యూనిట్లకు అదనంగా మరో రెండు 115 మెగావాట్ల యూనిట్లను చేర్చుతున్నామన్నారు. దీని ద్వారా ముఖ్యంగా వేసవి కాలంలో, అత్యవసర సమయాల్లో గ్రిడ్ స్థిరత్వాన్ని కల్పించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జెన్‌కో డైరెక్టర్లు ఎం సుజయకుమార్, పి అశోక్ కుమార్‌రెడ్డి, బిహెచ్‌ఇఎల్ సిఎమ్‌డి కె సదాశివ మూర్తి, డైరెక్టర్ ఎస్‌ఎం రామనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ్ రస్తోగి పాల్గొన్నారు.

ఎఐఐబితో మెట్రో ఎమ్‌డి చర్చలు

- నిధుల కోసం బ్యాంకర్లతోనూ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులో కదలిక వచ్చింది. రూ.12 వేలకోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధుల కోసం ప్రభుత్వం.. ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి)తో చర్చలు జరుపుతోంది. దీనిలో భాగంగా బుధవారం మెట్రో ఎమ్‌డి రామకృష్ణారెడ్డి.. బ్యాంకు ప్రతినిధులతో సమావేశం అయ్యారు. అలాగే కెఎఫ్‌డబ్ల్యు, ఎఎఫ్‌డి, ఎడిబి, ఎన్‌డిబి, జైకా వంటి సంస్థలు ఇప్పటికే ఆసక్తి చూపిస్తున్నాయి. దీనిలో భాగంగా ఎఐఐబి ప్రతినిధులు విజయవాడలో ప్రాజెక్టు ఏర్పాటయ్యే ప్రాంతం మొత్తాన్ని పరిశీలించారు. రెండు మెట్రో ప్రాజెక్టులను ఒకేసారి ప్రారంభించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. విశాఖ మెట్రోకు రూ.6,100 కోట్లు, విజయవాడ మెట్రోకు రూ.5,900 కోట్లు ఖర్చవనున్నాయి. వీటిల్లో కొన్ని బ్యాంకులు ఎక్కువ వడ్డీ వసూలు చేస్తుండటంతో తక్కువ వడ్డీకి రుణాలిచ్చే సంస్థల కోసం మెట్రో కార్పొరేషన్ సుదీర్ఘ చర్చలు జరుపుతోంది. ఎఐఐబి ముందుకు వస్తే దాదాపు ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని మెట్రో ఎమ్‌డి తెలిపారు. విజయవాడలో 26.03 కిలోమీటర్లు, విశాఖలో 42.55 కిలోమీటర్ల దూరం మెట్రో నిర్మించాలని తొలుత ప్రణాళిక రూపొందించారు. మొత్తం విశాఖ ప్రాజెక్టుకు రూ.13,488 కోట్లు, విజయవాడ ప్రాజెక్టుకు రూ.6,769 కోట్లు ఖర్చవుతుందని అప్పట్లో లెక్కగట్టారు. ప్రస్తుతం పనులు ప్రారంభించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎంతోకొంత సమకూర్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రూ.12 వేలకోట్లు సమకూర్చుకుంటే పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని, దీనిలో భాగంగానే బ్యాంకులతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. రుణం ఇచ్చేందుకు ఎఐఐబి ముందుకొచ్చిందని, అతి త్వరలో ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు గాను కొంత స్థలాన్ని సేకరించాల్సి ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో నుండే ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందించినా కొన్నిచోట్ల ప్రైవేటు స్థలాలు కూడా తీసుకోవాల్సి ఉంది.

రాజధాని పనులు వేగవంతం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో చేపడుతున్న పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. దీనిలో భాగంగా గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాల పూర్తికి సంబంధించిన పనులను షాపూర్‌జీ పల్లోంజి సంస్థలకు అప్పగించింది. లెటర్ ఆఫ్ అవార్డును కమిషనర్ కన్నబాబు నిర్మాణ సంస్థ ప్రతినిధులకు అప్పగించారు. మొత్తం అమరావతిలో రూ.56 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే దాదాపు పూర్తయి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్న ఎన్‌జిఒ, గెజిటెడ్ అధికారుల నివాసాలను పూర్తి చేయనున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఎల్‌ఒఎ అప్పగించారు.

भारत सरकार
कारपोरेट कार्य मंत्रालय
त्वरित कॉर्पोरेट समापन प्रसंस्करण केंद्र (सी-पेस),
आई.आई.सी.ए. बिल्डिंग, 7वीं मंज़िल,
प्लाट P-6,7,8, से.-5, आई.एम.टी. मानेसर, गुडगाँव,
हरियाणा - 122050.
Email: roc.cpace@mca.gov.in

सत्यमेव जयते

భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (సి-పేస్)
ఐఐసిఏ బిల్డింగ్, 7వ అంతస్తు,
ప్లాట్ పి-6,7,8, సెక్టార్-5, ఐఎంటి మనేసర్,
గుర్గావ్, హర్యానా-122050.
ఇమెయిల్: roc.cpace@mca.gov.in

ఫారమ్ నెం. STK-6
బహిరంగ ప్రకటన
[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248లోని సబ్-సెక్షన్ (2) మరియు సబ్-సెక్షన్ (4) మరియు కంపెనీల రూల్ 7 (రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ నుండి కంపెనీల పేర్ల తొలగింపు) రూల్స్, 2016]

పబ్లిక్ నోటీసు: ROC/C-PACE/STK-2/248(2)/2025-26/366 తేదీ: 06-05-2025

రిఫరెన్స్:
(1) కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 ప్రకారం **ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలో (12) కంపెనీల పేర్లను కొట్టివేసే లేదా తొలగించడం విషయంలో:

క్ర. సం.	వర్క్ ఐటం	CIN	కంపెనీ పేరు
1	AB3515633	U65992AP2010PTC068331	శ్రీ వెంకటరామ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్
2	AB3597248	U63090AP2016PTC098156	వాండర్‌ట్రయిల్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
3	AB3728387	U45401AP2016PTC104504	IND ఆంధ్ర గోల్డెన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్
4	AB3726931	U15110AP2016PTC104440	IND ఆంధ్ర ఫుడ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్
5	AB3727066	U70200AP2016PTC104447	IND ఆంధ్ర నిర్మాణ్ ప్రైవేట్ లిమిటెడ్
6	AB3730171	U63030AP2016PTC104444	IND ఆంధ్ర స్టోరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్
7	AB3647334	U31907AP2019PTC113749	హ్యూయిడ్స్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్
8	AB3729682	U15319AP2020PTC114843	ఆర్గానిక్‌మోర్సెల్ ఫుడ్ అండ్ బెవరేజ్ ప్రైవేట్ లిమిటెడ్
9	AB3626196	U31900AP2023PTC123841	ఇండి ఎలక్ట్రికల్స్ ప్రైవేట్ లిమిటెడ్
10	AB3502019	U85499AP2023PTC112577	నీలర్ ఇన్నోవేషన్ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్
11	AB3432949	U79120AP2024OPC113902	ఎపిక్విస్టా హాలిడేస్ (ఓపిసి) ప్రైవేట్ లిమిటెడ్
12	AB3660551	U86100AP2024PTC117012	ఎంఎల్‌టి ట్రినిటీ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్

(2) కంపెనీల రిజిస్ట్రార్ కంపెనీల రిజిస్టర్ నుండి కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 248(2) కింద దాని/వారి పేరు (ల)ని తీసివేయడానికి పైన పేర్కొన్న కంపెనీల నుండి దరఖాస్తులను స్వీకరించినట్లు నోటీసు ఇవ్వబడింది. వారు విలీనం చేసిన ఒక సంవత్సరంలోపు వ్యాపారాన్ని ప్రారంభించడంలో విఫలమయ్యారనే కారణంతో లేదా కంపెనీ(ఐఎస్) కొనసాగిస్తున్న/దీనిని కొనసాగించడం లేదు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 455 లేదా కంపెనీ(స్) ప్రకారం నిద్రాణస్థితిలో ఉన్న కంపెనీ స్థితిని పొందడం కోసం అటువంటి వ్యవధిలోపు ఎలాంటి దరఖాస్తు (లు)ను పొందడం కోసం తక్షణమే ముందున్న ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఏదైనా వ్యాపారం లేదా ఆపరేషన్ నిద్రాణమైన కంపెనీ స్థితిని పొందారు/మెమోరాండమ్‌కు చందాదారులు వారు చేపట్టిన సభ్యత్వాన్ని చెల్లించలేదు. కంపెనీని విలీనం చేసే సమయంలో చెల్లించడానికి మరియు ఈ ప్రభావానికి సంబంధించిన డిక్లరేషన్ లోపల దాఖలు చేయబడలేదు. సెక్షన్ 12లోని సబ్-సెక్షన్ (9) కింద నిర్వహించిన భౌతిక ధృవీకరణ తర్వాత వెల్లడైనట్లుగా, సెక్షన్ 10ఏ/లోని సబ్‌సెక్షన్ (1) కింద నూట ఎనభై రోజులు ఏ వ్యాపారం లేదా కార్యకలాపాలను కొనసాగించలేదు, కానీ అది/అవి దాని/వారి రిజిస్ట్రేషన్‌ను కంపెనీలుగా కొనసాగించాలనుకోవద్దు మరియు కంపెనీల రిజిస్టర్ నుండి దాని/వారి పేర్లను తీసివేయమని/కొట్టి చేయాలని అభ్యర్థించారు.
(3) తదనుగుణంగా, కంపెనీల రిజిస్ట్రార్ పైన పేర్కొన్న కంపెనీల పేర్లను కంపెనీల రిజిస్టర్ నుండి తొలగించాలని లేదా కొట్టివేయాలని ప్రతిపాదించారు.
(4) కంపెనీల రిజిస్టర్ నుండి కంపెనీల పేరును ప్రతిపాదిత తొలగింపు లేదా కొట్టివేయడాన్ని వ్యతిరేకించే ఏ వ్యక్తి అయినా ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి ముప్పై రోజులలోపు పైన పేర్కొన్న కార్యాలయ చిరునామాకు తన అభ్యంతరాన్ని పంపవచ్చు.

ఇర్ఫాన్ టిర్కీ
అసిస్టెంట్ రిజిస్ట్రార్
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్

CBC 07123/11/0169/2526

ఏడాదిలో మెరుగైన పాలన

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అనుకున్న దానికంటే మెరుగైన పాలన అందించామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అనేక సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొని 2024లో అధికారంలోకి వచ్చామన్నారు. మహానాడు సన్నాహక సమావేశాన్ని నిర్వహణ కమిటీ బాధ్యులు, ముఖ్యనేతలతో టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. తొలిసారి కడపలో మహానాడును నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్ర చర్చ జరగాలని తెలిపారు. పార్టీ కేడర్ మంచి ఉత్సాహంతో పనిచేస్తున్నారని, ఈ సభ ద్వారా రాయలసీమలో నూతనోత్సాహం వస్తుందన్నారు. రాయలసీమ ప్రజల గుండెల్లో పార్టీ బలంగా ఉందన్నారు. తొలిరోజు పార్టీపరమైన అంశాలపై, రెండోరోజు ప్రభుత్వపరంగా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించాలని చెప్పారు. మూడోరోజు లక్షలాది మందితో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అందరికీ అవగాహన కలిగించేలా తీర్మానాలు ఉండాలని చెప్పారు. మినీ మహానాడును ఈ నెల 18, 19, 20 తేదీల్లో అన్ని నియోజకవర్గాల్లో, 22, 23 తేదీల్లో పార్లమెంట్ల వారీ నిర్వహించాలని సూచించారు.

అదనపు భూ సమీకరణపై అసంతృప్తి

- అవసరానికి మించి తీసుకుంటే అభివృద్ధి ఎప్పటికి సాధ్యం?
- రాజధానిలో నిలిచిన లావాదేవీలు
- భూముల ధరలు తగ్గుతాయని సమీకరణ రైతుల ఆందోళన



తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అవసరాల కోసం మరో 44 వేల ఎకరాల భూమిని తీసుకోవాలన్న ప్రతిపాదనలపై దుమారం చెలరేగుతోంది. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ మాత్రం రాజధాని అవసరాల కోసం ఇంకా పది వేల ఎకరాలు మాత్రమే అవసరం ఉందని మంగళవారం ప్రకటించారు. అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే లైను, పారిశ్రామికవేత్తలకు కలిపి పది వేల ఎకరాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. 2015లో రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలంలోని మూడు గ్రామాల్లో భూ సమీకరణ చేయలేదు. పెదపరిమి, హరిశ్చంద్రపురం, వడ్డమాను గ్రామాల్లో దాదాపు పది వేల ఎకరాల భూమి ఉంది. తాజా భూ సమీకరణను ఈ మూడు గ్రామాలతోపాటు దాదాపు నాలుగు మండలాల్లో 44 వేల ఎకరాల భూ సమీకరణ ప్రతిపాదనను తెరపైకి తేవడం వివాదం అవుతోంది. వడ్డమాను గ్రామంలో భూ సమీకరణకు బుధవారం నిర్వహించిన గ్రామసభలో రైతులు అధికారులను నిలదీశారు. రాజధానికి ఇప్పుడు మేం భూములు ఇస్తే భవిష్యత్తులో ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రం అయిన తాడికొండలో కూడా పది వేల ఎకరాల భూమి ఉంది. ఈ గ్రామం మొత్తం భూ సమీకరణ చేస్తారన్న ప్రచారంతో గ్రామస్తుల్లో వ్యతిరేకత ఏర్పడింది. ఇప్పటి అమరావతి మండలం వైకుంఠపురం, పెదమద్దూరు, కర్లపూడి, యండ్రాయి గ్రామాల్లో దాదాపు పది వేల ఎకరాలు అందుబాటులో ఉండడంతో ఈ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. మెజార్టీ రైతులు అంగీకారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలోనే ఈ సభలు జరిగాయి. 2015 జనవరిలో ప్రారంభమైన భూ సమీకరణలో 37,941 ఎకరాలకుగాను 34,689 ఎకరాలను సిఆర్‌డిఎకు రైతులు అప్పగించారు. మిగిలిన 3,252 ఎకరాలను ఇవ్వడానికి దాదాపు వెయ్యి మంది రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. భూ సమీకరణలో తీసుకున్న 34,689 ఎకరాలతోపాటు ప్రభుత్వ భూములు మరో 17 వేల ఎకరాలు కూడా రాజధానికి వినియోగించుకునేందుకు సిఆర్‌డిఎ తన ఆధీనంలోకి తీసుకుంది. మొత్తం 51 వేల ఎకరాలు రాజధానికి సిద్ధం చేశారు. రైతులు ఇచ్చిన 34,689 ఎకరాల్లో దాదాపు పది వేల ఎకరాలను అభివృద్ధి చేసి రైతులకు గృహ అవసరాలు, వాణిజ్య ప్లాట్లను అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పి పదేళ్లు దాటింది. ఈ నేపథ్యంలో మరోసారి భూ సమీకరణకు వెళ్లాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలపై రాజధాని రైతుల్లోనూ అసంతృప్తి ఏర్పడింది. రాజధానికి పరిసరాల్లో ఇంత పెద్ద ఎత్తున భూమిని తీసుకుంటే తమ ప్లాట్లకు విలువ ఎలా పెరుగుతుందనేది వారి ప్రధాన ప్రశ్నగా ఉంది. రాజధాని విస్తరణ ప్రతిపాదనలపై ఇంతవరకూ అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఎప్పటికి అప్పగిస్తారన్నదీ ఇప్పటికీ అయోమయంగానే ఉంది. ఇప్పటికే చాలామంది రైతులు తమ భూములను సమీకరణ ద్వారానే ఇతరులకు విక్రయించుకున్నారు. దాదాపు ఆరు వేల ఎకరాలు చేతులు మారింది. రాజధాని నిర్మాణాలు పూర్తయి తమ ప్లాట్లకు మంచి ధరలు వచ్చి లబ్ది పొందుదామని అనుకుంటున్న రైతులకు అదనపు భూ సమీకరణ అంశం పిడుగుపాటు వార్తలా మిగిలింది. గత రెండు నెలలుగా రాజధాని గ్రామాల్లో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి.

ఆక్వా కల్చర్ సలహా కమిటీలోకి గద్దె క్రాంతికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆక్వా కల్చర్ విభాగంలో ఎదుర్కొంటున్న సవాళ్లపై పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సలహా కమిటీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు కుమారుడు గద్దె క్రాంతికుమార్‌ను కూడా చేర్చింది. ఏప్రిల్ 9న విడుదల చేసిన ఉత్తర్వుల్లో సవరణ చేస్తూ బుధవారం జిఓ 169ను పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి అండ్ మత్స్యసంపద ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రాజశేఖర్ విడుదల చేశారు.

తాగునీటి సరఫరాకు రూ.28 కోట్లు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరువు రహిత మండలాల్లో తాగునీటి సరఫరా కోసం రూ.28 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 జిల్లాల్లోని కరువు రహిత మండలాలైన 244 మండలాల్లో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా తాగునీటి సరఫరా కోసం రూ.28 కోట్లు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ ఇఎన్‌సి తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో ఆదేశించారు.


జీవకోనలోని గంగమ్మకు సారె సమర్పిస్తున్న ముస్లీం నాయకులు రఫీ హిందుస్తానీ

గంగమ్మకు సారె సమర్పించిన రఫీ హిందుస్తానీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'గంగమ్మా తల్లీ ...నా భారతదేశాన్ని మతోన్మాదం, మారణహోమం, మానవత్వం మరచిన మృగాల నుంచి, నరరూప రాక్షసుల నుంచి కాపాడు' అంటూ ఆల్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షులు రఫీ హిందుస్థానీ, కమిటీ మెంబర్లు, జీవకోన ముస్లీములు తిరుపతి జిల్లా రాజీవ్‌గాంధీ కాలనీ గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా రఫీ హిందూస్థానీ మాట్లాడుతూ తిరుపతిలో గంగమ్మ జాతర వైభవంగా జరుగుతుందని, మతసామరస్యానికి ప్రతీక అని, ఇక్కడ హిందువులు, ముస్లిములు అన్నదమ్ముల్లా జీవిస్తున్నారని అన్నారు. అందుకే జీవకోన గంగమ్మ తల్లికి తామందరమూ కలిసి సారె సమర్పించామని తెలిపారు. బీబీ నాంచారమ్మ మాకు సోదరిగా, వెంకటేశ్వర స్వామి మాకు బావగా, వెంకటేశ్వర స్వామి సోదరి గంగమ్మ తల్లి మా బంధువుగా భావిస్తామన్నారు. హిందూ ముస్లిం భాయిభాయి అనే నినాదాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించేలా భవిష్యత్ తరాలు ఆదర్శవంతంగా మెలగాలన్నారు. భారతదేశంలో కొందరు మతోన్మాదంతో పెట్రేగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిబాష, రియాజ్ బాష, మహ్మద్ అలీ, సాధిక్ అలీ, సాబ్‌జాన్, కలీం, అలీమ్, మహబూబ్‌బాష, సాజిదా, సాబీరా, షాజహాన్, అనీషా, జిలాని, బి.ఫయాజ్, నజీర్, మహిళలు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణీ మృతి

ప్రజాశక్తి - పోలవరం

వైద్యుల నిర్లక్ష్యంతో ఓ నిండు గర్భిణీ మృతి చెందారు. ఈ సంఘటన ఏలూరు జిల్లా పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల వివరాల మేరకు... పోలవరం మండలం జిల్లెళ్లగూడెం పంచాయతీ కొత్త కుంకాల గ్రామానికి చెందిన గిరిజన మహిళ తామా శిరీషా (25) తొమ్మిది నెలల గర్భిణి. పురిటి నొప్పులతో మంగళవారం రాత్రి పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో చేరారు. గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు ఆమె పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధపడగా ఆమె మృతి చెందారు. మంగళవారం రాత్రి నుంచి నర్సులే చికిత్స చేశారని, వైద్యులు పట్టించుకోలేదని, రాత్రే రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి పంపినా తన భార్య బతికి ఉండేదని మృతురాలి భర్త భూచంద్రం, బంధువులు ఆరోపించారు. ఫోనులో నర్సులకు సూచనలు ఇచ్చానని, శిరీషాకు రెండేళ్ల క్రితం సిజేరియన్ జరిగిందని, నాటి కుట్లు మానకపోవడంతో అంతర్గత రక్తస్రావం జరిగి రక్తహీనత వల్ల మృతి చెందారని ఆసుపత్రి గైనకాలజిస్టు విష్ణువర్ధిని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కెఆర్‌పురం ఐటిడిఎ పిఒ రాములునాయక్ పోలవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులను విచారించారు. రాజమహేంద్రవరం డిసిహెచ్ఎస్ పద్మావతి నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం ఆసుపత్రికి చేరుకుని వైద్యులను, సిబ్బందిని, మృతురాలి బంధువులను విచారించింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే గర్భిణీ మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో


మృతి చెందిన తామా శిరీషా

తేలిందని ఏలూరు డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని, నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆదాయం 83 శాతమే

- జిఎస్‌టిలోనూ తగ్గుదలే
- భారీగా పెరిగిన అప్పులు
- 2024-25 సంవత్సరపు లెక్కలు తేల్చిన కాగ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రాథమిక గణాంకాలను ఎట్టకేలకు కాగ్ విడుదల చేసింది. ఆదాయ, వ్యయాలు, లోటు, అప్పులు, కేంద్రం నుంచి వచ్చిన నిధులు వంటి వాటితో ఈ నివేదిక విడుదల కావడం గమనార్హం. ఇందులో బడ్జెట్ అంచనాలకు, వాస్తవాలకు మధ్య భారీ అంతరాలు ఉండడం విశేషం. లోటు చివరి దశలో కొద్దిగా తగ్గినట్లు చూపించగా, రుణాలు మాత్రం అంచనాల కన్నా ఎక్కువగా ఉన్నట్లు తేలింది మొత్తం ఆదాయం 2.69 లక్షల కోట్లు వస్తుందని అంచనా వేయగా, చివరకు 2.50 లక్షల కోట్లు వచ్చినట్లు ప్రాథమికంగా తేల్చారు. భారీగా రుణాలు తీసుకున్నా కూడా ఇంకా 19 వేల కోట్ల వరకు ఆదాయంలో కొరత కనిపించింది. వచ్చిన ఆదాయంలో పన్నులు, కేంద్రం నుంచి రు. 1.60 లక్షల కోట్ల వరకు సమకూరినట్లు తేలింది. ఇందులో జిఎస్‌టి ద్వారా 47,853 కోట్లు రాగా, అంచనా కన్నా ఇది ఐదు వేల కోట్ల వరకు తక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇక వ్యాట్ ద్వారా 24,500 కోట్లకుగాను 17,422 కోట్లు మాత్రమే వచ్చాయి. రాష్ట్ర ఎక్సయిజ్ డ్యూటీ విభాగంలో 25,597 కోట్లకుగాను 19,882 కోట్లు మాత్రమే వచ్చాయి. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా 35,395 కోట్లకుగాను 36,869 కోట్లు రాగా, కేంద్రం ఇచ్చే గ్రాంట్లు మాత్రం తగ్గినట్లు తేలింది. కేంద్రం నుంచి 30,333 కోట్లు రావాల్సి ఉండగా, 20,136 కోట్లు మాత్రమే చేతికందాయి.

వ్యయంలో విచిత్రాలు

ఇక వ్యయం విభాగంలో ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూశాయి. వాస్తవానికి బడ్జెట్‌లో మొత్తం వ్యయాన్ని రు. 2.94 లక్షల కోట్లుగా చూపించగా, కాగ్ ప్రకటించిన ప్రాథమిక నివేదికలో మాత్రం ఏకంగా 3.37 లక్షల కోట్లుగా చూపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇందులో కూడా బడ్జెట్ అంచనాల్లో రెవెన్యూ వ్యయాన్ని 2.35 లక్షల కోట్లుగా, పెట్టుబడి వ్యయాన్ని 32,712 కోట్లుగా ప్రతిపాదించగా, తాజా కాగ్ నివేదికలో మాత్రం రెవెన్యూ వ్యయాన్నిరు. 2.91 లక్షల కోట్లుగా, పెట్టుబడి వ్యయాన్ని 45,382 కోట్లుగా చూపించారు. ఇంత తేడా ఎలా వచ్చిందన్నది మాత్రం అర్థంకాని విధంగానే ఉంది.

లోటు లెక్కల్లోనూ అదే పరిస్థితి

ఇక లోటు లెక్కల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. బడ్జెట్ అంచనాల్లో ఆదాయ లోటును 34,743 కోట్లుగా, ద్రవ్య లోటును 68,742 కోట్లుగా కాగ్ తాజా నివేదికలో మాత్రం ఆదాయ లోటు అంచనా 90 వేల కోట్లుగా, ద్రవ్య లోటు అంచనా 1.37 లక్షల కోట్లుగా చూపించారు. రుణాలు భారీగా నమోదైనట్లు నివేదికలో తేలింది. బడ్జెట్‌లో 68,360 కోట్లు రుణాలు తీసుకోవాలని ప్రతిపాదించగా, చివరకు 81,597 కోట్లు తీసుకున్నట్లు తేలింది. దీంతో అదే మొత్తాన్ని కాగ్ లోటుగా చూపించింది.

కాగ్ వెల్లడించిన ఆర్థిక గణాంకాలు (రూ. కోట్లలో)

రంగం	బడ్జెట్‌లో	వాస్తవంగా
మొత్తం ఆదాయం	2,91,639	2,25,899
రెవెన్యూ ఆదాయం	2,01,173	1,68,443
ఏ.పన్నుల ద్వారా	1,60,264	1,41,515
బి.పన్నేతర	10,576	6,792
సి.కేంద్రం నుంచి	30,333	20,136
పెట్టుబడి ఆదాయం	68,372	81,617
మొత్తం వ్యయం	3,37,021	2,45,076
ఏ.రెవెన్యూ వ్యయం	2,91,639	2,25,899
బి.పెట్టుబడి వ్యయం	45,382	19,176
ఆదాయ లోటు	90,465	57,456
ద్రవ్య లోటు	1,37,155	81,622

టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు

- పశుసంవర్ధకశాఖ కాన్‌క్లేవ్‌లో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాడిపరిశ్రమలో టెక్నాలజీ వినియోగంతో మరింత మెరుగైన ఫలితాలు తీసుకురావచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. విజయవాడలో గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జిఎఫ్ఎస్టి), పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించిన టెక్ ఎఐ 2.0 కాన్‌క్లేవ్‌లో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 42 లక్షల కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. పాడి, పౌల్ట్రీ పరిశ్రమలను లభాల బాట పట్టిస్తామన్నారు. డెయిరీ షెడ్లకు ఆస్తిపన్ను రద్దు చేస్తామని చెప్పారు. యానిమల్ మొబైల్ అంబులెన్స్‌లను పెంచుతామన్నారు. పశువులకు మేత సమకూర్చే పనిని నరేగాతో అనుసంధానం చేసి డ్వాక్రా సంఘాలకు అప్పగిస్తామన్నారు. పశుగ్రాసం పెంపకానికి డ్రిప్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గడ్డికోత, ఇతర పనులకు యంత్రాలను సమకూరుస్తామని చెప్పారు. పశుసంవర్ధక రంగంలో వచ్చిన స్టార్టప్‌లకు ప్రోత్సాహాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. మనుషులకు ఆధార్ సంఖ్యలాగా పశువులకు గోధార్ సంఖ్యను కేటాయించనున్నట్లు చెప్పారు. ఆరునెలల్లో అక్కడ పూర్తి చేస్తారని, రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పశువులకు గోధార్ సంఖ్యను ఇస్తామని తెలిపారు. పౌల్ట్రీలో కోళ్ల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి రైతులకు సమాచారం ఇచ్చే మరో స్టార్టప్ సంస్థకు సహకారం అందిస్తామన్నారు. గొర్రెల ఫామ్, పందుల ఫామ్ నడుపుతున్న రైతులతో మాట్లాడారు. వారి ఆదాయ వ్యయాల గురించి తెలుసుకున్నారు.

కూటమి తీరుతో కౌలు రైతులకు నష్టం

- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కౌలు రైతుల పట్ల కూటమి సర్కార్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కౌలుదారుకార్డుల జారీలో ఉదాసీనంగా ఉందని పౌరసరఫరాలశాఖ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంక్షేమ ఫలాలను కౌలు రైతులకు దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో అర్హులందరికీ కార్డులు ఇచ్చామని, అన్ని ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు వర్తింపజేశామని పేర్కొన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే సిసిఆర్‌సి మేళాలు నిర్వహించామని చెప్పారు. కౌలు రైతులకు అండగా వైఎస్ జగన్ నిలబడ్డారని తెలిపారు. వ్యవసాయ రంగంలో 70 నుండి 80 శాతం వరకూ కౌలుదారులే ఉన్నారని పేర్కొన్నారు. సిసిఆర్‌సి కార్డుల వల్ల విత్తనాల సబ్సిడీ, రైతుభరోసా, బ్యాంకు రుణాలు, సున్నావడ్డీ వంటి సంక్షేమ ఫలాలు అందేవని వివరించారు. కూటమి ప్రభుత్వ తీరుతో పొగాకు రైతుకు కష్టాలు వచ్చాయని అన్నారు. బర్లీ పొగాకు కొనుగోలుకు కంపెనీలు ముందుకు రావడం లేదన్నారు.

‘జోక్యం’ పై పదేపదే ట్రంప్ ప్రకటనలు

- భారత్ పాక్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం
- సౌదీ అరేబియా పర్యటనలోనూ వెల్లడి
- స్పందించని భారత ప్రధాని



న్యూఢిల్లీ : భారత్, పాక్‌ల మధ్య జరుగుతున్న పరిణామాలు తనకు నచ్చలేదని, అందుకే కాల్పుల విరమణకు ఆ రెండు దేశాలను ఒప్పించేందుకు తాను జోక్యం చేసుకున్నానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చెప్పారు. గత నాలుగు రోజుల వ్యవధిలో ట్రంప్ ఇలా చెప్పడం ఐదవసారి. తాను మంచి పని చేశానని, శాంతిని నెలకొల్పేలా ఇరు దేశాలను ఒప్పించానని అలాగే వారు వాణిజ్య ఒప్పందాలు కూడా చేసుకునేలా ఒప్పించానని చెప్పుకుంటున్నారు. మంగళవారం సౌదీ అరేబియా పర్యటన ముగింపు సందర్భంగా మంగళవారం విమానంలో మాట్లాడుతూ ట్రంప్ పై వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 10న భారత్, పాక్‌లు యుద్ధాన్ని విరమించేందుకు అవగాహన కుదుర్చుకున్నాయి. ఇరు దేశాల డిజిఎంఓల స్థాయిలో చర్చలు జరిగాయని, అక్కడ అన్ని రకాల కాల్పులను, సైనిక చర్యలను నిలిపివేయాలని అవగాహన కుదిరిందని భారత ప్రభుత్వం చెబుతోంది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని కూడా పేర్కొంది. ఈ విషయాల్లో తృతీయపక్షం జోక్యమే లేదని స్పష్టం చేసింది. భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నడుమ కాల్పుల విరమణను ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరు తీవ్ర చర్చనీయాంశమవుతున్నది. ఈ విషయంపై భారత్‌లోని ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళనను వ్యక్తపరుస్తున్నాయి. ట్రంప్ తీరు దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బ తీసే విధంగా ఉన్నదని, డోనాల్డ్ ట్రంప్‌నకు మోడీ తలొగ్గారంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ట్రంప్‌తో మోడీకి మంచి సంబంధాలున్నాయని బిజెపి నాయకులు తరచూ చెప్తుంటారు. ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడిగా భారత్‌లో పర్యటించిన సందర్భంగా ‘నమస్తే ట్రంప్’ కార్యక్రమాన్ని మోడీ ఏర్పాటు చేసి, తన మిత్రుడిగా మోడీ అభివర్ణించారు. ఆ తర్వాత, మోడీ కూడా అమెరికా పర్యటనకు వెళ్లాడు. తదుపరి ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్‌కు భారత సంతతి ఓట్లు దక్కేలా చేయటంలో భాగంగా ‘హౌడీ మోడీ’ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. మోడీ అందులో పాల్గొన్నారు. ఇటీవల భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన సందర్భంగా ఆ విషయంలో జోక్యం చేసుకోబోమన్న ట్రంప్.. ఉన్నట్టుండి కాల్పుల విరమణ ప్రకటన చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) ద్వారా దీనిని ప్రకటించారు. అప్పటి వరకు పాక్‌కు వ్యతిరేకంగా ‘ఆపరేషన్ సిందూర్’తో తీవ్రమైన హైప్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సృష్టించింది. కాశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం వహిస్తానని ట్రంప్ చెప్పటం మోడీ మద్దతుదారులతోపాటు భారతీయులను విస్మయానికి గురిచేసింది. ఉద్రిక్తతలను తగ్గించకపోతే రెండు దేశాలతో వాణిజ్యాన్ని చేయబోనని చెప్పటంతో భారత్ - పాక్‌లు కాల్పుల విరమణకు వచ్చాయని ట్రంప్ చెప్పారు. ఈనెల 12న జాతినుద్దేశిస్తూ మోడీ చేసే ప్రసంగానికి కొన్ని నిమిషాల ముందే అమెరికా అధ్యక్షుడు ఈ ప్రకటన చేయటం గమనార్హం. ఇలాంటి తరుణంలో ట్రంప్ ప్రకటనల విషయంలో మోడీ దీటుగా స్పందిస్తారని అంతా భావించారు. భారత ప్రధాని ఒక్కసారి కూడా ఆయన పేరును ప్రస్తావించకపోగా, ఆ ప్రకటనలపైనా స్పందించలేదు. విశ్వగురువు అని చెప్పుకునే మోడీ.. అమెరికా అధ్యక్షుడిని సర్వశక్తివంతమైన నాయకుడిగా సమ్మతించారా? లేక ట్రంప్ చెప్పినవి నిజాలు కాబట్టే మోడీ స్పందించలేదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వానికి సిద్ధమన్న ట్రంప్ ప్రకటనపై ఎందుకు స్పందించలేదని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

మూడు వారాల్లో 31 మంది మావోయిస్టులు మృతి

- ఆపరేషన్ కగార్ నిలిపివేత

రాయ్‌పూర్ : మావోయిస్టులను అంతమొందించాలన్న లక్ష్యంతో కేంద్రంలోని మోడీ సర్కారు ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో 31 మంది మావోయిస్టులు మరణించారని అధికారులు తెలిపారు. భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులతో పారామిలిటరీ బలగాలను కేంద్రం వెనక్కి పిలవటంతో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసినట్లు ప్రకటించారు. గతనెల 21న ప్రారంభమైన ఈ ఆపరేషన్ దాదాపు మూడు వారాల పాటు కొనసాగింది. కేంద్రం చేపట్టిన ఈ ఆపరేషన్‌పై పలు పార్టీలు, మానవ హక్కుల సంఘాలు, నాయకులు, కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని ఒక సీనియర్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. హిడ్మా మడ్వితో పాటు టాప్ మావోయిస్టు లీడర్లు ఉన్నారన్న సమాచారంతో 25 వేల మందికి పైగా భద్రతా సిబ్బంది, భారత వైమానిక దళం (ఐఎఎఫ్)కు చెందిన హెలికాప్టర్లు, డ్రోన్లు రంగంలోకి దిగాయి. ఈ ఆపరేషన్ సందర్భంగా తెలంగాణలో మందుపాతర పేలి గ్రేహౌండ్స్‌కు చెందిన ముగ్గురు కానిస్టేబుళ్లు మరణించారు. వేర్వేరు పేలుళ్లలో ఇద్దరు భద్రతా సిబ్బంది తమ అవయవాలను కోల్పోయారు. దాదాపు అరడజను మంది గాయపడ్డారు. “హిడ్మాతో పాటు మావోయిస్టు సీనియర్ నాయకులు తప్పించుకోగలిగారు. తొలుత, ఈ ఆపరేషన్ కోసం ఒక ప్రణాళిక రూపొందించాం. కేంద్ర బలగాలకు కఠినమైన ప్రాంతం కావడంతో ఇలాంటి వాతావరణ పరిస్థితిలో భద్రతా సిబ్బంది అక్కడ వేచి ఉండటం సురక్షితం కాదు కాబట్టి.. ప్రస్తుతానికి ఈ ఆపరేషన్‌ను ముగించాలని మేం నిర్ణయించాం” అని సంబంధిత వర్గాలు తెలిపాయి. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) బలీయమైన బెటాలియన్ నెంబర్.1 రక్షణలో ఉన్న మావోయిస్టు కీలక నేతలను ఏరివేయటం ఈ ఆపరేషన్ లక్ష్యం. చనిపోయిన 20 మంది మావోయిస్టులను గుర్తించామని, 11 మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించామని మీడియా సమావేశంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు. మృతుల్లో 16 ఏళ్ల బాలుడు, పలువురు మహిళలు ఉన్నారని తెలిసింది.

పాలిసెట్‌లో బాలికలదే హవా


- మొత్తం 95.36 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిసెట్-2025లో బాలికలు హవా సాగించారు. బాలురు కంటే 2.52 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. పాలిసెట్-2025 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విడుదల చేశారు. ఏప్రిల్ 30న జరిగిన ఈ పరీక్షలో మొత్తం 95.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,39,840 మంది హాజరవ్వగా, వీరిలో 1,33,358 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 54,722 మంది హాజరవ్వగా, 53,024 (96.9 శాతం) మంది అర్హత సాధించారు. బాలురు 85,118 మంది హాజరవ్వగా 80,334 (94.38 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 120 మార్కులకు జరిగిన పరీక్షలో 19 మంది 120 మార్కులు తెచ్చుకున్నారు. వీరిలో తూర్పు గోదావరికి చెందిన బడ్డి శశివెంకట్ మొదటి, విశాఖపట్నంకు చెందిన బాలినేని కళ్యాణ్‌రామ్ రెండో, తూర్పుగోదావరికి చెందిన ఎంజెఎస్‌ఎన్‌వి చంద్రహర్ష మూడో ర్యాంకు సాధించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా 98.66 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానం దక్కించుకుంది. 97.36 శాతంతో ఏలూరు రెండో స్థానంలో, 97.07 శాతంతో గుంటూరు మూడో స్థానంలో నిలిచాయి. అడ్మిషన్లకు సంబంధించిన కౌన్సెలింగ్ తేదీ, తరగతుల ప్రారంభ తేదీలను సాంకేతిక విద్య ప్రకటించాల్సి ఉంది.

ఉరుగ్వే మాజీ అధ్యక్షుడు జోస్ ముజికా కన్నుమూత

మాంటెవీడియో : ఒకప్పటి గెరిల్లా, ఉరుగ్వే మాజీ అధ్యక్షుడు జోస్ ముజికా (89) బుధవారం కన్ను మూశారు. ఆయన చేపట్టిన ప్రగతిశీల సంస్కరణలతో ఆయన దక్షిణ అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందారు. ముక్కుసూటిగా మాట్లాడే ముజికా చాలామందికి ‘పేప్’ అనే నిక్‌నేమ్‌తో సుపరిచితులు. ఆయన మరణ వార్తను అధ్యక్షుడు యమాండు ఓర్సి ఎక్స్‌లో పోస్టు చేశారు. పౌర హక్కులకు సంబంధించిన అంశాలపై ఉదారమైన వైఖరి ప్రదర్శించిన ముజికా గే వివాహాలకు, తొలి మాసాల్లో గర్భస్రావాలకు అనుమతిస్తూ చట్టాన్ని తీసుకువచ్చారు. కేథలిక్ లాటిన్ అమెరికాకు అప్పట్లో ఈ చర్యలు పెద్ద మార్పు. బ్రెజిల్, చిలీ, మెక్సికో దేశాల అధ్యక్షులతో సహా పలువురు ప్రాంతీయ నాయకులు ముజికా మృతికి సంతాపం తెలిపారు. ఆయన పాలనా తీరును ప్రశంసించారు. ఆయన ప్రజాస్వామ్యాన్ని సమర్థించారని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా వ్యాఖ్యానించారు.



52వ సిజెఐగా జస్టిస్ బిఆర్ గవాయ్

- ప్రమాణం స్వీకారం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రెండో దళిత ప్రధాన న్యాయమూర్తిగా అవకాశం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధాని మోడీతోపాటు, కేంద్ర మంత్రులు, ఇతర అతిథులు పాల్గొన్నారు. గవాయ్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆయన అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యుడిగా చరిత్రాత్మక తీర్పులను వెలువరించారు. సిజెఐ బిఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేస్తారు. సిజెఐ పీఠాన్ని అధిరోహించిన రెండో దళిత వ్యక్తిగా గవాయ్ పేరు పొందారు. మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24న జన్మించిన గవాయ్ 1985 మార్చి 16న న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. మహారాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, మాజీ అడ్వకేట్ జనరల్ బారిస్టర్ రాజా భోంస్లేతో ఆయన పనిచేశారు. 1987 నుంచి 1990 వరకూ బాంబే హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 1992లో నాగపూర్ బెంచ్ అసిస్టెంట్ గవర్నమెంట్ లాయర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2003 నవంబరు 14న బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ గవాయ్ 2005 నవంబరు 12న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొంది ఆ హైకోర్టు ప్రధాన ధర్మాసనం ఉన్న ముంబయితో పాటు నాగ్‌పూర్, ఔరంగాబాద్, పనాజీ ధర్మాసనాల్లో సేవలందించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. గత ఆరేళ్లలో జస్టిస్ గవాయ్ సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వామ్యం పంచుకొని రాజ్యాంగ, పరిపాలన, సివిల్, క్రిమినల్ చట్టాలు, వాణిజ్య వివాదాలు, ఆర్బిట్రేషన్, విద్యుత్తు, విద్య, పర్యావరణానికి సంబంధించిన కేసులను విచారించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన గవాయ్‌కు ముందు ఇదే సామాజిక వర్గానికి చెందిన జస్టిస్ కెజి బాలకృష్ణన్ 2007లో సిజెఐగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సిజెఐ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో జస్టిస్ బిఆర్ గవాయ్ నియమితులయ్యారు.

మహిళలు రాఫెల్‌నే నడిపితే ఆర్మీ లీగల్ పోస్టులు ఎందుకు ఇవ్వరు ?

- కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : భారత వైమానిక దళంలో ఒక మహిళ రాఫెల్ యుద్ధ విమానాన్ని నడపగలిగినప్పుడు, ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ (లీగల్) పోస్టుల్లో కొద్దిమంది మహిళా అధికారులు మాత్రమే ఎందుకు వున్నారని సుప్రీంకోర్టు బుధవారం కేంద్రాన్ని నిలదీసింది. ఈ పోస్టుల్లో మహిళలు తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ పోస్టులకు 50-50 నిబంధన వర్తించినప్పటికీ మహిళలను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించింది. ఇద్దరు మహిళా అధికారులు అర్షనూర్ కౌర్, ఆస్థా త్యాగి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ నెల 8న తమ తీర్పును రిజర్వ్ చేసింది. ఆ ఇద్దరు మహిళా అధికారులు ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షల్లో వరుసగా 4, 5 ర్యాంకులు సాధించారు. పురుషుల కన్నా మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ, మహిళలకు కేటాయించిన ఖాళీలు తక్కువగా ఉండటం వల్ల జెఎజి విభాగానికి తమను ఎంపిక చేయలేదని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఖాళీలను భర్తీ చేసే విషయంలో మహిళలు, పురుషుల మధ్య గల అసమానతలను ఈ పిటిషన్‌లో వారు సవాలు చేశారు. మొత్తం ఆరు పోస్టులకు గానూ మహిళలకు మూడు ఖాళీలే ఉన్నందున వారిని ఎంపిక చేయలేమని అధికారులు చెప్పారని తెలిపారు. భారత వైమానిక దళంలో ఒక మహిళ రాఫెల్ యుద్ధ విమానం నడపడానికి అనుమతి ఉంటే, జెఎజిలో ఎక్కువ మంది మహిళలను అనుమతించడంలో ఆర్మీకి కష్టమేముందని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. జెఎజి పోస్టులు లింగభేదంతో సంబంధం లేని తటస్థ పోస్టులైనప్పటికీ.. మహిళలకు ఎందుకు తక్కువ పోస్టులు కేటాయించారని ప్రశ్నించింది. పురుషులు, మహిళలు ప్రాతిపదికన ఖాళీలను విభజించడం వల్ల అధిక అర్హత కలిగిన మహిళా అభ్యర్థులను ఆ పోస్టులకు తీసుకోనప్పుడు.. వాటిని లింగ తటస్థ పోస్టులని ఎందుకు పిలుస్తారని ధర్మాసనం ప్రశ్నించింది.

యుపిలో సెమీకండక్టర్ యూనిట్

- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో : ఉత్తరప్రదేశ్‌లోని జెవార్‌లో రూ.3,706 కోట్లతో సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం నాడిక్కడ ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ హెచ్‌సిఎల్ - ఫాక్స్‌కాన్ సెమీకండక్టర్ ప్లాంట్ మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్, ఇతర పరికరాల కోసం డిస్‌ప్లే డ్రైవర్ చిప్‌లను తయారుచేస్తుందని అన్నారు. ఇప్పటికే ఐదు సెమీకండక్టర్ యూనిట్లు నిర్మాణంలో అధునాతన దశలో ఉన్నాయని పేర్కొన్నారు. జెవార్‌లో ఏర్పాటుచేసే ప్లాంట్ ఆరో సెమీకండక్టర్ యూనిట్‌గా నిలుస్తుందని అన్నారు. ఈ యూనిట్ నెలకు 20,000 వేఫర్‌లను ప్రాసెస్ చేస్తుందని, దాదాపు 2,000 ఉద్యోగాలను సృష్టిస్తుందని తెలిపారు.

వీలైనంత త్వరగా సంక్షేమ క్యాలెండర్

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క పైసా కూడా విడుదల చేయలేదన్నారు. మహానాడులోపు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామన్నారు. మే నెలాఖరుకు పార్టీ సంస్థాగత ఎన్నికలన్నింటినీ పూర్తిచేస్తామని చెప్పారు. మహానాడులోపు అన్ని కమిటీలు పూర్తిచేయాలని నిర్ణయించామని చెప్పారు. మూడు సార్లు మండల పార్టీ అధ్యక్షుడిగా చేసిన వారిని ఇతర పోస్టులో ఉంచేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇకపై ఏ కార్యక్రమం జరిగినా ఒకే యాప్‌లో ప్రతి కార్యక్రమాన్ని చూసేలా మై టిడిపి యాప్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. మహానాడు నుంచి దీనిని ఉపయోగంలోకి తీసుకురావాలని అధినేత ఆదేశాలు జారీ చేశారు. భర్తలు చనిపోయినప్పటికీ ఫించను అందని మహిళలు రాష్ట్రంలో లక్షమందికి పైగా ఉన్నారని, గత ప్రభుత్వం వీరిపట్ల నిర్లక్ష్యం చూపిందని చెప్పారు. వీరికి జూన్ 12వ తేదీన పింఛను అందించనున్నట్లుమల చెప్పారు. కేంద్రప్రభుత్వం పిలుపు మేరకు కూటమి పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 16,17,18 తేదీల్లో అన్ని నియోజకవర్గాల్లో తిరంగ ర్యాలీలు జరపాలని నిర్ణయించామని చెప్పారు.

వచ్చి కార్యాలయం చూసుకోండి

- మరోసారి కెఆర్‌ఎంబికి లేఖ రాసిన ఇఎన్‌సి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

‘వీలైనంత త్వరగా ఎపిలో కార్యాలయం ఏర్పాటు చేయండి, వచ్చి ఒకసారి భవనాలు చూసుకోండి’ అంటూ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌కు ఇఎన్‌సి వెంకటేశ్వరరావు లేఖ రాశారు. విజయవాడకు రైలు, రోడ్డు, విమాన సర్వీసులు అన్నీ అందుబాటులో ఉన్నాయని, కృష్ణా నదికి అతి సమీపంలోనే ఈ కార్యాలయాలు ఉన్నాయంటూ బుధవారం రాసిన లేఖలో స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును ఎపిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. టిడిపి ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చిన సమయంలో విజయవాడలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత దాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తామని మంత్రులు ప్రకటనలు చేశారు. ఈ గందరగోళంలో కెఆర్‌ఎంబి కార్యాలయాన్ని ఎర్రమంజిల్‌లోని జలసౌధలోనే నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని ఫిబ్రవరి 11న ఇఎన్‌సి ఛైర్మన్‌కు లేఖ రాశారు. స్పందన లేకపోవడంతో బుధవారం మరోలేఖ రాశారు. విజయవాడ వచ్చి సూచించిన కార్యాలయాలను ఎంపిక చేసుకుంటే ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని లేఖలో ఇఎన్‌సి పేర్కొన్నారు. 6.10.2020న జరిగిన రెండో అపెక్స్ కౌన్సిల్‌లో చేసిన తీర్మానాన్ని దీనికి జోడించారు. నాలుగేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు కార్యాలయం ఏర్పాటు చేయలేదని, దీనిపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం విజయవాడ నగరానికి అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కెఆర్‌ఎంబి కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని, ఏమైనా ఇబ్బందులు, ఫిర్యాదులు, వినతులు చేయాలంటే హైదరాబాద్ వెళ్లడం, అక్కడ అధికారులు ఉన్నదీ లేనిదీ సమాచారం లేకపోవడం వంటి ఇబ్బందులు పడుతున్నామని అప్పటి అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. కృష్ణా రివర్‌కు సంబంధించి అనేక అంశాలు రాష్ట్ర ప్రధాన కేంద్రంగా ఉన్నాయని, నిరంతరం సంప్రదింపులు, వినతులకు విజయవాడలో అయితే ఎక్కువ అవకాశాలుంటాయని పేర్కొన్నారు. నాలుగేళ్ల నుంచి దీనిపై ఛైర్మన్, సెక్రటరీ దృష్టికి తీసుకెళుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లిన సమయంలోనూ కెఆర్‌ఎంబి కార్యాలయం ఏర్పాటుపై జలవనరులశాఖ మంత్రికి వినతిపత్రం ఇచ్చి వచ్చారు. ఈ నేపథ్యంలో వెంటనే కార్యాలయం ఏర్పాటు చేయాలని ఇఎన్‌సి వెంకటేశ్వరరావు బుధవారం లేఖ రాశారు.

కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించడం అభ్యంతరకరం

(మొదటి పేజీ తరువాయి)

రామచంద్రన్ కుమార్తె ఆరతి ఇద్దరు ముస్లిం సోదరులు వారికి అన్ని విధాలుగా సహాయం చేశారంటూ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఒలింపిక్స్ జావెలింగ్ త్రో విజేత నీరజ్‌చోప్రాపైనా సైబర్ దాడులు జరిగాయన్నారు. పార్లమెంటు సభ్యులకు అనేక ప్రశ్నలుంటాయనీ, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఎంఏ బేబీ సమాధానమిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ పనిచేసిందనీ, బిజెపి మెజార్టీ తగ్గిందని వివరించారు. ఇండియా బ్లాక్ జాతీయ స్థాయిలోనే పనిచేస్తుందనీ, రాష్ట్రాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలుంటాయని అన్నారు. బీహార్ ఎన్నికలు త్వరలో రాబోతున్నాయని, ఆ రాష్ట్ర ఇంచార్జిగా విజయరాఘవన్ ఉన్నారనీ, ఆర్‌జెడితో సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. అఖిలపక్ష సమావేశానికి ఢిల్లీలోనే ఉన్నా ప్రధాని మోడీ ఎందుకు రాలేదనే దానిపై తాను రాజకీయ విమర్శలు చేయదల్చుకోలేదని చెప్పారు. అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరుగుతాయని, కేరళలో ఎల్డీఎఫ్ మళ్లీ గెలుస్తుందన్న నమ్మకముందన్నారు. ఐదేండ్లకోసారి కేరళలో ప్రభుత్వం మారుతుందనీ, కానీ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రెండోసారి గెలిచి చరిత్ర సృష్టించిందని చెప్పారు. ఇక ముందు కూడా ఎల్డీఎఫ్ కూటమి అధికారాన్ని నిలబెట్టుకుందనీ, అందుకోసం వామపక్ష శ్రేణులు కృషి చేస్తున్నాయని అన్నారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి : బివి రాఘవులు

ఆపరేషన్ సిందూర్ తాత్కాలికంగా ముగిసిందని సిపిఎం (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు చెప్పారు. ఇదే సమయంలో ఆపరేషన్ కగార్‌ను కూడా కేంద్రం నిలిపేసిందనీ, ఇది మంచి పరిణామమని అన్నారు. దానికి కొనసాగింపుగా మావోయిస్టులతో చర్చలు జరిపాలని కోరారు. చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టులు ప్రకటించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం షరతుల్లేకుండా మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణలో గూండాగిరి

(మొదటి పేజీ తరువాయి)

డిలీట్ చేయించారు. కనీసం ఫొటోలు తీయడానికి కూడా మీడియా ప్రతినిధులకు అనుమతి ఇవ్వలేదు.

గ్రామస్తులకు అన్యాయం జరుగుతోంది
-పరిశ్రమ కోసం కొందరి పొలాలను బలవంతంగా తీసుకున్నారు
-ఫోర్జరీ సంతకాలతో రిజిస్టర్ చేసుకున్నారు : తాండ్రపాడు గ్రామానికి చెందిన మహిళ ఆవేదన

తాండ్రపాడుకు చెందిన మహిళ రేణుక మాట్లాడుతూ గ్రామంలో కొందరికి అన్యాయం జరుగుతోందన్నారు. అట్టడుగు వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదని, ఉద్యోగాలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ కోసం కొందరి పొలాలను బలవంతంగా తీసుకున్నారని, ఫోర్జరీ సంతకాలతో రిజిస్టర్ చేసుకున్నారని వాపోయారు. పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు మాట్లాడుతూ స్థానికులకు మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని, తాగునీరు ఇవ్వాలని కోరారు. మొత్తం 30 మంది తమ అభిప్రాయాలను తెలిపారు. 250 మంది తమ వినతులను అందించారు.

ప్రమాదకర పిఎఫ్‌ఒఇని వాడబోం : టిజి వెంకటేష్

టిజివి ఎస్‌ఆర్‌ఎఎసి కంపెనీ తరపున టిజి వెంకటేష్ మాట్లాడుతూ పిఇఎఫ్ఇ ఉత్పత్తికి వాడే పిఎఫ్‌ఒఇ ప్రమాదకరమని కొందరు చెబుతున్నారని, అది తాము వాడబోమని, ఆరు నెలలు సమయం ఇస్తామని శాస్త్రవేత్తలను తీసుకొచ్చి చూపించాలని అన్నారు. చుట్టపక్కల గ్రామాలకు సహాయ సహకారాలు అందిస్తామని, మరుగుదొడ్లు, ఆర్‌ఓ ప్లాంట్లు, అంబులెన్స్ ఏర్పాటు చేస్తామని, హామీ ఇచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణలో కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఎస్ఇ శంకర్ నాయక్, ఇఇ కిషోర్ రెడ్డి, తహశీల్దార్ రమేష్ బాబు పాల్గొన్నారు.

తక్షణమే రద్దు చేయాలి : ప్రజాసంఘాల డిమాండ్


ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పే అవకాశాన్ని కల్పించాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ సభను గూండాల సమక్షంలో జరిపి అభాసుపాలు చేశారని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకొని ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని కోరారు. ప్రజలను బెదిరించిన గూండాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

డ్రోన్ దాడులకు కౌంటర్‌గా భార్గవాస్త్ర

- పరీక్ష విజయవంతం



భువనేశ్వర్ : ఆపరేషన్ సిందూర్ సమయంలో పొరుగు దేశం పాకిస్తాన్ ఎక్కువగా డ్రోన్లతో దాడికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకు భారత్ కౌంటర్ డ్రోన్ సిస్టమ్ ‘భార్గవాస్త్ర’ ను సిద్ధం చేసింది. సోలార్ డిఫెన్స్, ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డిఎఎల్) స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ సిస్టమ్‌ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని గోపాల్‌పూర్‌లో గల సీవార్డ్ ఫైరింగ్ రేంజ్ నుంచి పరీక్షించింది. మూడుసార్లు పరీక్షించగా.. భార్గవాస్త్ర రాకెట్ టార్గెట్‌ను కచ్చితత్వంతో సఫలం చేసినట్టు తాజాగా అధికారులు వెల్లడించారు. ఈ భార్గవాస్త్ర డ్రోన్ సమూహాల ముప్పును ఎదుర్కోవడంలో చాలా కీలకమైనది.భార్గవాస్త్ర ఒక కౌంటర్ డ్రోన్ వ్యవస్థ. డ్రోన్ దాడులను దీటుగా ఎదుర్కొనేందుకు దీన్ని అభివృద్ధి చేశారు. ఈ కౌంటర్ డ్రోన్ సిస్టమ్ 2.5 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించగలదు. ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న వైమానిక వాహనాలను కూడా ఇది గుర్తించి, గైడెడ్ మైక్రో బాంబులను ఉపయోగించి వాటిని నిర్వీర్యం చేస్తుంది. భార్గవాస్త్ర వ్యవస్థకు ఏకకాలంలో 64 మైక్రో క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం ఉంది. ఎక్కడికైనా సులువుగా, వేగంగా తరలించవచ్చు. ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కోసం అభివృద్ధి చేసిన మొట్టమొదటి మైక్రో క్షిపణి ఆధారిత కౌంటర్-డ్రోన్ వ్యవస్థ ఇది.





ఇద్దరు మిత్రులు



లింగారావుపేట అనే గ్రామంలో రాము, సోము మంచి స్నేహితులు. వాళ్ళు ఎప్పుడూ కలిసే ఉంటారు. ఒక రోజు ఉపాధ్యాయులు విహారయాత్రకు వెళ్దామని నిర్ణయించారు. ఒక్కొక్కరికి 500 రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. రాము జమ చేసుకున్న డబ్బులు వెయ్యి రూపాయలు ఉన్నాయి. సోము దగ్గర 2000 రూపాయలు ఉన్నాయి. కానీ వాళ్ళమ్మ ఇంటికి సరుకులు తెమ్మని ఆ డబ్బులు ఇచ్చింది. దీంతో సోము రాముతో 'నేను రాలేను' అని చెప్పాడు. 'నువ్వు రాకపోతే నేను కూడా వెళ్లను. కానీ నాకు అది ఇష్టం లేదు. ఇద్దరం కలిసే వెళ్దాం. నా దగ్గర డబ్బులు ఉన్నాయి' అని రాము చెప్పాడు.

'సరే. అయితే, ముందు మీ ఇంటికి వెళ్దాం. మీ అమ్మనాన్నతో నీ దగ్గర డబ్బులు తీసుకున్న సంగతి చెబుతాను. కొన్ని రోజుల్లో ఆ డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని కూడా చెబుతాను. మనం ఎంత స్నేహితులమైనా చేసే ప్రతి పనీ అమ్మానాన్నతో చెప్పాలి. మా ఇంట్లో కూడా నువ్వు సాయం చేసిన సంగతి చెబుతాను. అమ్మ కొన్ని రోజుల్లో ఆ డబ్బులు సర్దుతుంది అన్న నమ్మకం నాకుంది. సరేనా!' అన్నాడు సోము.

ఇద్దరి స్నేహితుల మాటలు విన్న మాస్టారు.. 'భలే ఉన్నార్రా పిల్లలు. స్నేహితులంటే మీలా ఉండాలి. పెద్దలతో చెప్పి చేస్తా అన్నందుకు బహుమానంగా మీ ఇద్దరి విహార యాత్ర డబ్బులు నేనే ఇస్తాను' అంటూ రాము, సోముని దగ్గరకి తీసుకున్నారు. మీరు ఎప్పుడూ ఇలానే కలిసి ఉండాలని ఆశీర్వదించారు.



– నిమ్మల రిత్విక్,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
జక్కాపూర్.


మన తెలుగు

అమ్మ భాష మన తెలుగు
అవనిపైన ఇది వెలుగు
తలపులలో మన తెలుగు
మాటలుగా ఇది వెలుగు
ఊహలలో మన తెలుగు
కథలుగా ఇది వెలుగు
పదకేళిలో మన తెలుగు
మెదడుకు మేతగా ఇది వెలుగు
అక్షరాలలో మన తెలుగు
గురువు బోధల్లో ఇది వెలుగు
కవితలలో మన తెలుగు
బంగరు భవితకు ఇది వెలుగు
విలువలలో మన తెలుగు
మన సంస్కృతిలో ఇది వెలుగు



- ఎ. రాజేశ్వరి,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాజగోపాల పేట,
నంగునూరు మండలం,
సిద్ధిపేట జిల్లా


బొమ్మల కొలువు







- కె స్వాతిప్రియ,
8వ తరగతి
ఎం.తిమ్మాపురం, ఆదర్శ పాఠశాల,
మహానంది (మం),
నంద్యాల జిల్లా.





గౌరి చెరిస్సా రాజ్,
2వ తరగతి,
కె.వి.షిల్లాంగ్ పీక్,
షిల్లాంగ్, మేఘాలయ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

JEEVANA జీవన the family

జీవన సౌరభం

సన్మానం పొందడంలో గొప్పదనం లేదు. దానిని పొందడానికి నీకున్న అర్హతలోనే గొప్పదనం ఉంది.

'ఆపరేషన్' ముగిసిన తర్వాత...'

నాలుగు రోజుల పాటు భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను దేశం యావత్ వీక్షించింది. 'యుద్ధం ఎంత కాలం జరుగుతుందో! ఎన్ని ప్రాణాలు బలౌతాయో' అని కొందరు విచారపడ్డారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌పై భారత ప్రభుత్వం కురిపించిన మరఫిరంగులకు ప్రతీకారం తీరిందని ఇంకొందరు సంతోషపడ్డారు. అయితే ఈ రెండు భావోద్వేగాలకు భిన్నమైన పరిస్థితుల్లో సరిహద్దు ప్రజలు ఉన్నారు. యుద్ధం ముగిసిన సంతోషం వాళ్ల ముఖాల్లో ఎక్కడా కనిపించడం లేదు. కూలిపోయిన ఇళ్లు, బాంబు దాడుల్లో కళ్లముందే ప్రాణాలు కోల్పోయిన ఆప్తులను తలుచుకొని నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నారు అక్కడున్నవారంతా..



కాల్పుల విరమణ తర్వాత సొంత ఇళ్లకి చేరుకునే వారు కొందరైతే, శిథిలమైన శకలాలను చూసి తట్టుకోలేక ఇంకా పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్న వారు మరికొందరు. ఈ ఉద్రిక్తల్లో మొత్తం 20 మంది పౌరులు మరణించినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. డజన్లకొద్దీ జనాభా గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. అయితే ఇళ్లు కూలిపోయి, నిలువ నీడలేక వేలకొలది ప్రజల బతుకు దుర్భరంగా తయారైంది.

అరవై ఐదేళ్ల సయ్యద్ బేగమ్ ఇంటిపై మే 9 అర్ధరాత్రి బాంబు షెల్స్ పడ్డాయి. బారాముల్లా జిల్లా గింగిల్ గ్రామంలో ఆమె నివసిస్తోంది. ఆ రోజు రాత్రి 9:30కి బేగమ్, తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిని విడిచి సురక్షిత ప్రాంతానికి బయల్దేరింది. మార్గం గుండా ప్రయాణిస్తున్నప్పుడు బాంబుల వర్షం ఆ గ్రామాన్ని తాకుతూనే ఉంది. ఆ భయంకర శబ్దాలకు వృద్ధురాలు, బలహీనురాలైన బేగమ్ తీవ్రంగా కలత చెందింది. ఆ భయంతో ఇప్పటికీ ఆమె గొంతు పెగలడం లేదు. ఆ కుటుంబంలోనే ఏడేళ్ల చిన్నారిని తన తండ్రి భుజాలపై ఎత్తుకుని తీసుకొచ్చాడు. నాన్న భుజంపై సురక్షితంగా ఉన్న ఆ చిన్నారి తల ఎత్తి తన ఇంటివైపు చూసింది. అప్పుడు ఓ బాంబు అమాంతం వాళ్ల ఇంటిపై పడింది. క్షణాల వ్యవధిలో పెద్ద పెద్ద మంటలు చెలరేగి ఇల్లు కూలిపోయింది. ఆ దృశ్యం ఆ చిన్నారి మనసును తీవ్రంగా బాధించింది. యుద్ధం ముగిసింది.. ఇంటికి వెళ్దాం అని తండ్రి చెబుతున్నా ఆ చిన్నారి ఇంటికి రానని మారాం చేస్తోంది. చిన్నారి తండ్రి అలీ ఆ బిడ్డ పరిస్థితి గురించి ఇలా చెప్పాడు. 'ఇంటి గురించి మాట ఎత్తితే చాలు, తను భయంతో ఏడుస్తోంది. మమ్మల్ని కూడా ఇంటికి వెళ్లొద్దని ఆపేస్తోంది'.

ఈ పరిస్థితి అలీ ఒక్కడిదే కాదు; జమ్మూ కాశ్మీర్ సరిహద్దు గ్రామాల్లో నివసిస్తున్న అందరి పరిస్థితి ఇదే. సరిహద్దు గ్రామం పూంచ్‌లో 14 మంది పౌరులు చనిపోతే వారిలో నలుగురు చిన్నారులే ఉన్నారు. వారిలో నిమిషాల వ్యవధిలో కవలిద్దరినీ పోగొట్టుకున్న తల్లీదండ్రీని ఓదార్చడం ఎవరివల్ల కావడం లేదు. ఉరి, పూంచ్ జిల్లాల్లో ఇప్పటికీ చాలామంది పాఠశాలల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడారాల్లోనే నివసిస్తున్నారు.

కాల్పుల విరమణ ప్రకటన వచ్చిన తరువాత పూంచ్‌జిల్లా వాసి వక్బర్ అజీజ్ ఇలా అంటున్నాడు. 'దీనివల్ల ఏం సాధించాం? చాలామంది ప్రాణాలు కోల్పోయారు. చాలా ఇళ్లు శిథిలాలుగా మారాయి. ఈ విస్తృత పరిణామాలు, విధ్వంసం పాకిస్తాన్‌కి మన సమాధానమా? దీంతో ఇక పాకిస్తాన్ మాపై కాల్పులు జరపదా? దీనికి ఎవరు హామీ ఇస్తారు?' అని అజీజ్ ప్రశ్నిస్తున్నాడు.

ఈ కాల్పుల గురించి మరో స్థానికుడు, 90 ఏళ్ల సైద్ హుస్సేన్ ఇలా అన్నారు. '1947–48 ఇండో పాక్ యుద్ధం తర్వాత సరిహద్దు గ్రామాలపై ఫిరంగి దాడులు జరగడం ఇదే మొదటిసారి. 1965, 1971, 1999 యుద్ధాల సమయంలో అంటే ఉగ్రవాదం శిఖరాగ్రంలో ఉన్నప్పుడు కూడా మేం ఇంతలా ప్రభావితం కాలేదు. భారత్–పాక్ మధ్య మూడు యుద్ధాలు జరిగాయి. కానీ ఉగ్రవాద సమస్య అలాగే ఉంది. ప్రాణనష్టం, ఆస్తి నష్టం తప్ప ఏం లాభపడ్డాం' అని ప్రశ్నిస్తున్నాడు.

ఉరిలోని మార్కెట్లు ఇంకా జనాలు రాక వెలవెలబోతున్నాయి. గింగిల్ గ్రామనివాసి అలీ తన ఇంటి పరిస్థితి గురించి ఇలా చెబుతున్నాడు. 'మా అమ్మకి ఆరోగ్యం బాగోలేదు. ఆమె కళ్లు ఉబ్బిపోయి ఉన్నాయి. వెంటనే చికిత్స చేయించాలి. కానీ మేము పునరావాస కేంద్రంలో తలదాచుకున్నాం. మా ఇల్లు కూలిపోయింది. బిడ్డలను తీసుకుని ఇప్పుడు నేను ఎక్కడికి వెళ్లాలి. అమ్మని చూస్తే భయంగా ఉంది' అని వణుకుతున్న గొంతుతో మాట్లాడాడు.

అలీ భార్య తను ఎదుర్కొన్న పరిస్థితి గురించి ఇలా అంటోంది. 'మా గ్రామానికి దూరంగా బాంబు మోతలు తరచూ వినపడేవి. కానీ ఎప్పుడూ అవి మాపై పడతాయని అనుకోలేదు. పెద్ద పెద్ద శబ్దాలతో మా ఇళ్లపై బాంబులు కురవడం ప్రత్యక్షంగా చూసిన నేను ఇప్పటికీ రాత్రుళ్లు నిద్రపోలేకపోతున్నాను. పిల్లలు కూడా అదే పరిస్థితుల్లో ఉన్నారు' అని భయం నిండిన కళ్లతో చెబుతోంది.

యుద్ధం సంభవించినప్పుడు సరిహద్దు ప్రాంత ప్రజల పరిస్థితుల గురించి ఉరి, కమలకోటె నివాసి మున్నీర్ హుస్సేన్ ఇలా అంటున్నారు. 'మేము సరిహద్దు వాసులం. యుద్ధం జరిగేటప్పుడు దేశంలో అన్ని ప్రాంతాలకు అదొక వార్త. చర్చించుకునే పెద్ద అంశం. కానీ మాకు అది జీవన్మరణ సమస్య. నిలువనీడ కూల్చేసే విపత్తు. కొన్నేళ్లపాటు వెంటాడే భయంకర భూతం'. అని ఆవేదన నిండిన కళ్లతో చెప్పాడు.

వామపక్షాల భారీ శాంతి ర్యాలీ

లక్షలాదిగా హాజరైన ప్రజానీకం

కొల్‌కతా : యుద్ధానికి, ఉగ్రవాదానికి, మతతత్వానికి వ్యతిరేకంగా కొల్‌కతాలో వామపక్ష పార్టీలు భారీ శాంతి ర్యాలీ నిర్వహించాయి. ధరమ్‌తోల్లా లెనిన్ విగ్రహం వద్ద క్రాసింగ్ నుంచి సీల్దా వరకూ రద్దీగా ఉండే రహదారిపై మంగళవారం జరిగిన ఈ ర్యాలీలో లక్షలాదిమంది భాగస్వాములయ్యారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్లకార్డులు, ఎర్రజెండాలు ధరించి ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. భారత ఉపఖండంలో అమెరికా సామ్రాజ్యవాదం నిర్దేశించే పరిస్థితులు ఉండకూడదంటూ నినదించారు. యుద్ధోన్మాదం, ఉగ్రవాదం, దేశాన్ని మతపరంగా విభజించే కుట్రలను నిరసించారు. రెండు సరిహద్దు దేశాలకు సంబంధించిన విషయంలో అమెరికా అధ్యక్షులు ట్రంప్ జోక్యం చేసుకోవడం రెండు దేశాల ప్రజలకు అవమానకరమని తెలిపారు.

ర్యాలీ ప్రారంభానికి ముందు లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు విలేకరులతో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి ఒక దుర్మార్గపు సంఘటన అని విమర్శించారు. ఈ దాడిలో ఆదిల్ అనే ముస్లిం యువకుడు పర్యాటకులను రక్షించడానికి ప్రయత్నిస్తూ ఉగ్రవాదుల చేతిలో మరణించాడనే వాస్తవాన్ని మీడియా మరచిపోతుందని అన్నారు. ర్యాలీని ఉద్దేశించి సిపిఎం బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి సలీం మాట్లాడుతూ దేశంపై దాడి జరిగినప్పుడు దేశ ప్రజలను ఐక్యంగా ఉంచడం అన్ని విధాలుగా అవసరమని అన్నారు. ఐక్యతే మన దేశబలమని చెప్పారు. ఈ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి పహల్గాం దాడి తరువాత ఉగ్రవాదులు ప్రయత్నించారని, ఇదే పనిని చిత్రంగా బిజెపి ఐటి సెల్ కూడా చేస్తుందని సలీం విమర్శించారు. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుమార్తెను ఐటి సెల్ ట్రోల్ చేసిందని గుర్తు చేశారు. దేశ ప్రజల ఐక్యత గురించి మాట్లాడినందుకు మరణించిన నేవీ లెఫ్టినెంట్ భార్యను కూడా ట్రోల్ చేసిందని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ దీనికి వ్యతిరేకంగా ఎటువంటి వైఖరిని తీసుకోలేదని విమర్శించారు.



ప్లే-ఆఫ్స్ నుంచి విదేశీ ఆటగాళ్లు కష్టమే

- 25 తర్వాత వచ్చేయండి: దక్షిణాఫ్రికా బోర్డు షరతు
- వైట్‌బాల్ సిరీస్‌తో వెస్టిండీస్, ఇంగ్లండ్ ఆటగాళ్లు కూడా..
- తాత్కాలిక ఆటగాళ్లను తీసుకోండి: బిసిసిఐ



ముంబయి: భారత్–పాకిస్తాన్ దేశాల ఉద్రిక్తతల నేపథ్యంలో షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఐపిఎల్ 10రోజులు పొడిగించబడింది. దీంతో ఆయా ఫ్రాంచైజీల తరఫున ఆడే విదేశీ ఆటగాళ్లలో చాలామంది తమ తమ దేశాలకు తిరిగి వెళ్లిపోయారు. డబ్ల్యుటిసి ఫైనల్ కారణంగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా ఆటగాళ్లు, ఈనెల 29నుంచి వైట్‌బాల్ సిరీస్ కారణంగా ఇంగ్లండ్, వెస్టిండీస్ ఆటగాళ్లు ఇప్పటికే తమ తమ దేశాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న ఫ్రాంచైజీలు తమ తమ విదేశీ ఆటగాళ్లను తిరిగి వెనక్కి పిలిపించుకుంటున్నాయి. బట్లర్, అజ్మతుల్లా, మిచెల్ ఓవెన్(గుజరాత్ టైటాన్స్)తోపాటు మిగిలిన ఫ్రాంచైజీలు కూడా విదేశీ ఆటగాళ్లకు తిరిగి ఐపిఎల్‌లో ఆడాలంటూ ఆటగాళ్లను కోరుతున్నాయి.

25తర్వాత వెనక్కి రావాల్సిందే: దక్షిణాఫ్రికా బోర్డు

దక్షిణాఫ్రికా బోర్డు ఆటగాళ్లకు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ల కంటే ముందే స్వదేశం రావాల్సిందిగా షరుతు విధించింది. 'మొదట అనుకున్న షెడ్యూల్ ప్రకారం మే 25న ఐపిఎల్ ఫైనల్ జరగాల్సి ఉంది. కానీ, భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా 10రోజుల పాటు టోర్నీ వాయిదా పడడంతో ఫైనల్ తేదీ జూన్ 3కి మారింది. అయితే, ముందస్తు ఒప్పందం ప్రకారం మే 25 వరకే మా ఆటగాళ్లు ఐపిఎల్ ఆడతారు. మే 26న స్వదేశం బయల్దేరుతారు. ఆ తర్వాత 30న డబ్ల్యుటిసి ఫైనల్ ఆడేందుకు లండన్ చేరుకుంటారు. ఇందులో ఏ మార్పు లేదు' అని దక్షిణాఫ్రికా క్రికెట్, హెడ్ కోచ్ శుక్రి కొన్రాడ్ బుధవారం స్పష్టం చేశారు.

2025 ఐపిఎల్‌లో 20మంది దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఆడుతున్నారు. వీరిలో 8మంది డబ్ల్యుటిసి ఫైనల్‌కు దక్షిణాఫ్రికా ప్రకటించిన జట్టులో ఎంపికయ్యారు. 'ఆ ఎనిమిది మంది ఫిట్‌గా ఉండడం, మ్యాచ్‌కు కొన్ని రోజుల ముందు నుంచే అందుబాటులో ఉండడం చాలా ముఖ్యం. అందుకే ఆ దేశ క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లకు అల్టిమేటం జారీ చేసింది. మే 26 నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్క్వాడ్‌తో కలవాలని ఆదేశించింది. దీంతో కార్బిన్ బాస్చ్, రియాన్ రికెల్టన్ (ముంబయి ఇండియన్స్), వియాన్ మల్డర్(సన్‌రైజర్స్), మార్కో యాన్సెన్ (పంజాబ్), ఎడెన్ మర్క్‌రమ్(లక్నో), లుంగి ఎన్గిడి (ఆర్సీబీ), కగిసో రబాడ(గుజరాత్), ట్రిస్టన్ స్టబ్స్(ఢిల్లీ క్యాపిటల్స్) తిరిగి బయల్దేరి లండన్‌కు వెళ్లనున్నారు.

తాత్కాలిక క్రికెటర్లను తీసుకోండి: బిసిసిఐ

ఈ క్రమంలో అన్ని ఫ్రాంచైజీలకు బిసిసిఐ శుభవార్త చెప్పింది. 'అందుబాటులో ఉన్న వాళ్లను తీసుకోండి' అని బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఐపిఎల్ పునఃప్రారంభ మ్యాచ్‌లకు కొందరు విదేశీ ఆటగాళ్లు దూరం కానున్నారు. వ్యక్తిగత కారణాలు, అనారోగ్యం లేదా గాయాలు వెంటాడడంతో వాళ్లు టోర్నీకి దూరమయ్యే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో తాత్కాలిక క్రికెటర్లను తీసుకోవాలని ఐపిఎల్ సిఇవో హేమంగ్ వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం మే 17 నుంచి జూన్ 3 వరకు జరగనుంది.

ఢిల్లీ జట్టులోకి బంగ్లా పేసర్



ఆస్ట్రేలియాకు చెందిన జేక్ ఫ్రేజర్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతి నిధ్యం వహిస్తు న్నాడు. అతను వ్యక్తిగత కారణాలతో ఐపిఎల్ 2025 మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో ఢిల్లీ అతడి స్థానంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ (రూ.6 కోట్లు) జట్టులోకి తీసుకుంది. ముస్తాఫిజుర్ ఇప్పటివరకు ఐపిఎల్‌లో 57 మ్యాచ్‌లు ఆడి 61 వికెట్లు పడగొట్టాడు.

భారత్ చేరుకున్న జవాన్

- అప్పగించిన పాకిస్తాన్



న్యూఢిల్లీ : పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దును దాటి పొరబాటున పాకిస్తాన్‌లో ప్రవేశించిన బిఎస్‌ఎఫ్ జవాను పూర్నమ్ కుమార్ షాను బుధవారం ఉదయం 10.30 గంటలకు భారత్‌కు అప్పగించారు. గత నెల 23న షా పాకిస్తాన్‌లో ప్రవేశించగా ఆ దేశ జవాన్లు ఆయనను నిర్బంధించారు. అప్పటి నుండి ఆయన వారి కస్టడీలోనే ఉన్నారు. సుమారు మూడు వారాల తర్వాత అమృతసర్‌లోని అట్టారీ జాయింట్ చెక్‌పోస్టు మీదుగా ఆయన దేశంలో ప్రవేశించారు. 'అమలులో ఉన్న ప్రొటోకాల్స్ ప్రకారం అప్పగింత కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది' అని బిఎస్‌ఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. పాకిస్తాన్ రేంజర్లతో తరచూ జరిపిన ఫ్లాగ్ మీటింగ్స్, ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా బిఎస్‌ఎఫ్ చేసిన ప్రయత్నాల ఫలితంగా ఇది సాధ్యపడిందని వివరించింది.

మధ్యప్రదేశ్ మంత్రి వ్యాఖ్యలు అవమానకరం : ఐద్వా ఆగ్రహం

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్‌లో కీలక బాధ్యతలు నిర్వహించిన కల్నల్ సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలను అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఎస్‌ఎఫ్‌ఐ తీవ్రంగా ఖండించాయి. అత్యంత బాధ్యతారహితమైన ఈ వ్యాఖ్యలు సైన్యానికీ, మహిళలకూ అవమానకరమని బుధవారం ఐద్వా ఒక ప్రకటనలో పేర్కొంది. అత్యంత బాధ్యాతరాహిత్యమైన, నీచమైన, మతదురహంకార వ్యాఖ్యలు చేశారని విమర్శించింది. మూడు తరాల నుంచి సోఫియా కుటుంబం సైన్యంలో సేవలందిస్తుందని తెలిపింది. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఒక మంత్రి ఇలాంటి స్త్రీ ద్వేషపూరిత ప్రకటనలు చేయడం సిగ్గుచేటని పేర్కొంది.

మంత్రి చేసిన ఈ రకమైన విభజన వ్యాఖ్యలు ముస్లింలందర్నీ ఉగ్రవాదులుగా చూసే బిజెపి ప్రమాదకరమైన మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని, ఆపరేషన్ సిందూర్ తరువాత ప్రస్తుతం నిలకడగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేసే ప్రయత్నం కూడా అని విమర్శించింది. ఈ వ్యాఖ్యలపై బిజెపి బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఇటువంటి పక్షపాత, తిరోగమన వ్యాఖ్యలు చేసినందుకు తక్షణమే మంత్రితో రాజీనామా చేయించాలని బిజెపిని ఐద్వా డిమాండ్ చేసింది. ఆమె తన సోదరికంటే ముందు భారతదేశం పుత్రిక అని, ప్రధాని నరేంద్రమోడీ ఈ విషయాన్ని గుర్తించాలని సోఫియా సోదరుడు సులేమాన్ చేసిన వ్యాఖ్యలను ఉటంకించింది. మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జాయింట్ సెక్రటరీ దీప్సితాధర్, కార్యదర్శివర్గ సభ్యులు ఐషీఘోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యుపిఎస్‌సి చైర్మన్‌గా అజయ్ కుమార్ నియామకం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) చైర్మన్‌గా రక్షణశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.



మూడో ర్యాంక్‌లో హర్మన్‌ప్రీత్ సేన

- ఐసిసి మహిళల వన్డే ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ సేన సత్తా చాటింది. ఐసిసి బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత్ 8రేటింగ్ పాయింట్లు జమ చేసుకొని 2వ ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్‌కు చేరువైంది. శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు సిరీస్ టైటిల్‌ను చేజిక్కించుకున్న హర్మన్‌ప్రీత్ సేన ఖాతాలో ఎనిమిది రేటింగ్ పాయింట్లు జమ అయ్యాయి. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్(121 రేటింగ్ పాయింట్లు) 3వ స్థానంలో నిలువగా.. ఇంగ్లండ్(127) 2వ స్థానంలో ఉంది. ఇక ఆస్ట్రేలియా మహిళల జట్టు 167 రేటింగ్ పాయింట్లతో మిగతా జట్లకు అందనంత దూరంలో టాప్‌లో కొనసాగుతోంది. ఇక న్యూజిలాండ్(96), దక్షిణాఫ్రికా(90) టాప్–5లో నిలువగా.. శ్రీలంక(82), వెస్టిండీస్(72), బంగ్లాదేశ్(79), పాకిస్తాన్(78) టాప్–10లో చోటు దక్కించుకున్నాయి.

ప్రి క్వార్టర్స్‌కు ఆకర్షి, ఉన్నతి

- థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ


ఆకర్షి కశ్యప్


ఉన్నతి హుడా

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా ప్రవేశించారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో ఆకర్షి కశ్యప్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో 21–16, 20–22, 22–20తో ఎగ్జిన్ సుగియామా(జపాన్)పై విజయం సాధించింది. 17ఏళ్ల ఆకర్షి తొలి గేమ్‌ను సునాయాసంగా చేజిక్కించుకున్నా.. రెండో గేమ్‌ను ముగించడానికి చెమటోడ్చాల్సి వచ్చింది. ఇక ఉన్నతి హుడా 21–14, 18–21, 23–21తో నితిత్‌కరాయ్(ఇండోనేషియా)పై చెమటోడ్చి నెగ్గింది. మరో పోటీలో సంతోష్ రామ్‌రాజ్ 19–21, 7–21తో 8వ ర్యాంక్ క్రీడాకారిణి, సింగపూర్‌కు చెందిన యో–జి–మిన్ చేతిలో ఓటమిపాలైంది. ఇక మాల్విక బన్సోద్ 21–12, 13–21, 21–17తో సింగపూర్‌కు చెందిన నిషిహాన్‌పై పోరాడి గెలుపొందగా.. అనుపమ ఉపాధ్యాయ 11–21, 9–21తో 7వ ర్యాంకర్ థాయ్‌లాండ్‌కు చెందిన ఇంటనాన్ చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ప్రధాన టోర్నీకి అర్హత సాధించిన తరుణ్ మన్నేపల్లి, స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, ప్రియాన్షు రాజ్‌వత్ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68